అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సోమవారం 28-8-2017

సమగ్ర తెలుగు దినపత్రిక



సంపుటి : 3 సంచిక : 240 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు వెల : 5.00

ప్రమాదంలో... రాజ్యాంగం

హక్కుల్ని హరిస్తున్న బీజేపీ-ఆర్ఎస్ఎస్

పరిరక్షణకు మహోద్యమం

మనుస్మృతి ప్రకారం మోడీ పాలన

ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రక్షణ కరువు

విద్యాసంస్థల్లోనూ కొనసాగుతున్న వివక్ష:

డీఎస్ఎంఎం జాతీయ సెమినార్‌లో వక్తలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అందరికీ సమాన హక్కులు కల్పిస్తున్న రాజ్యాంగానికి ప్రమాదం పొంచి ఉందని దళిత్ శోషణ్ ముక్తిమంచ్ (డీఎస్ఎంఎం) జాతీయ సెమినార్‌లో పలువురు వక్తలు అన్నారు. రాజ్యాంగ పరిరక్షణకు మహోద్యమం నిర్మించాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని రక్షించుకునే బాధ్యత పౌరులందరిపైనా ఉందన్నారు. దేశంలో రాజ్యాంగం ఆధారంగా కాకుండా మనుస్మృతి ప్రకారం మోడీ పాలన సాగుతోందని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం సంఘ్‌పరివార్, మతోన్మాదులు దాడులకు పాల్పడుతున్నారని చెప్పారు. రెండురోజులపాటు జరిగే డీఎస్ఎంఎం జాతీయ సమావేశాలు ఆదివారం హైదరాబాద్‌లో ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'రాజ్యాంగం- సామాజిక న్యాయం- సవాళ్లు'అనే అంశంపై జాతీయ సెమినార్ జరిగింది. ఈ సందర్భంగా డీఎస్ఎంఎం జాతీయ నాయకులు సుభాషిణీ అలీ మాట్లాడుతూ అధికారంలో రాజ్యాంగ వ్యతిరేకులున్నారని విమర్శించారు. రాజ్యాంగం అవసరం లేదని, మనుస్మృతి చాలని స్వాతంత్య్రం వచ్చిన ...9లో



సెమినార్‌లో మాట్లాడుతున్న డీఎస్ఎంఎం జాతీయ నాయకులు సుభాషిణీ అలీ

నిటిఆయోగ్ ప్రణాళిక దేశానికి ప్రమాదం
డీఎస్ఎంఎం జాతీయ నాయకులు రాఘవులు

అవమానించేలా మాట్లాడితే పదవులు పోయేలా చట్టం
డీఎస్ఎంఎం జాతీయ సమన్వయకర్త శ్రీనివాసరావు

ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రక్షణ లేదు
కేరళ మాజీ స్పీకర్ కె రాధాకృష్ణన్



హోరాహోరీ పోరులో 1-2తో వెనుకంజ

సిల్వర్ సింధు

ఫైనల్లో పసిడి చేజార్చుకున్న తెలుగు తేజం

సైనా నెహ్వాల్‌కు కాంస్య పతకం 12లో

కాన్పుకెళ్తే కడుపు కోతే...

రాష్ట్రంలో 58% శస్త్రచికిత్సలు

అత్యధికంగా కరీంనగర్‌లో 81.1%

పాలమూర్‌లో అత్యల్పంగా 33.5%


ఎన్ఎఫ్‌హెచ్ సర్వే-4లో వెల్లడి

వివరాలు 12లో



కేంద్రంపై మహా పోరాటం

విపక్షాలపైకి ఏజెన్సీలను ఉసిగొల్పుతున్న మోడీ సర్కారు 2లో



డీఎస్సీ ఆశలో.. ఆగిన శ్వాస

- మనస్తాపంతో నెల రోజులుగా అన్నం మానేసిన నిరుద్యోగి
- అనారోగ్యం పాలై మృతి
- హోటల్ నడుపుతూ పిల్లలను బీఈడీ చేయించిన తల్లి

నవతెలంగాణ-నారాయణఖేడ్

స్వరాష్ట్రం వస్తే ఉద్యోగం వస్తుంది.. తమ కోసం తల్లిపడిన కష్టానికి ఫలితం దక్కుతుంది.. ఉద్యోగం సాధించి తల్లి కండ్లల్లో ఆనందాన్ని చూడాలి.. అని ఎదురు చూసిన నిరుద్యోగికి నిరాశే మిగిలింది. మూడేండ్లుగా డీఎస్సీపై ప్రభుత్వ ప్రకటనలు తప్ప నోటిఫికేషన్ వెలువడలేదు. దీనికోసం ఎదురు చూసిన యువకుడు చివరకు మనస్తాపానికి గురై అన్నపానీయాలు మానేసి అనారోగ్యానికి ...9లో

అదానీ చాపర్‌లోనే జైలుకి!

ఆనాడు మోడీ ప్రచారానికి..

వైరల్ అవుతున్న ఫోటోలు..



ఇప్పుడు డేరా బాబాకు..

పంచకుల: ఇద్దరు మహిళా భక్తులపై లైంగికదాడికి పాల్పడ్డ కేసులో దోషిగా తేలిన గుర్మీత్ రామ్ రహీమ్‌ను పంచకుల నుంచి రోహతక్ జైలుకు తరలించటానికి ఉపయోగించిన హెలికాప్టర్ వివాదస్పదంగా మారింది. దీనిపై ఓ ఫోటో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నది. అందులో డేరా సచ్చా బాబాను తీసుకెళ్లటానికి వాడిన చాపర్ గుజరాత్ వ్యాపారవేత్త గౌతమ్ అదానీదని,.ఈ చాపర్‌లోనే ప్రధాని మోడీ కూడా ప్రయాణించారని ఫోటో ఆధారాలు వైరల్ అయ్యాయి. ౹ఌూ..139 నెంబర్ ఉన్న హెలికాప్టర్ వీఐపీ,వ్యాపారవేత్తల కోసం ప్రత్యేకంగా వినియోగిస్తున్నారు. 15 సీట్లు ఉన్న ఈ చాపర్ అగస్టా వెస్ట్‌ల్యాండ్ కంపెనీకి చెందినది. అచ్చుగుద్దినట్టు ఉన్న ఈ చాపర్‌లోనే ప్రధాని మోడీ 2014 ఎన్నికల ప్రచారంలో వినియోగించారు. ఆ కారణంతో మోడీ వాడిన హెలికాప్టర్,గుర్మీత్ వాడినది ఒక్కటేనన్న వాదనలు షికారు చేస్తున్నాయి. పారిశ్రామికవేత్త అదానీతో ...9లో

మహిళ శవాన్ని తిన్న కుక్కలు
లక్నో ప్రభుత్వాస్పత్రిలో దారుణం 9లో

బాంబుతో కిలోమీటర్ పరుగెత్తిన కానిస్టేబుల్ 2లో

డేరా బాబాకు శిక్ష ఖరారు నేడు 2లో



గోవుల దొంగలంటూ..

ఇద్దరు యువకులను కొట్టి చంపిన దుండగులు

పశ్చిమబెంగాల్‌లో రెచ్చిపోయిన హిందుత్వశక్తులు

కోల్‌కతా: బెంగాల్‌లోని జల్పాయిగురి జిల్లాలో గోవుల దొంగతనం ఆరోపణలతో ఇద్దరు ముస్లిం యువకులను అతికిరాతంగా హత్య చేశారు. ఈ సంఘటన ఆదివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో బర్‌హోరియా అనే గ్రామంలో జరిగింది. మృతుల్ని అస్సాంలోని దూబ్రీకి చెందిన హఫీజుల్‌షేక్(22), బెంగాల్‌లోని కూచ్‌బీహార్ జిల్లాకు చెందిన అన్వర్ హుస్సేన్(20)గా గుర్తించారు. ఓ ట్రక్కులో పశువుల్ని ...9లో

తక్కువ వేతన జాబ్స్‌తోనే తిప్పలు

దేశీయ మార్కెట్లపై దృష్టి సారించాలి

- దిగుమతి ప్రత్యామ్నాయ విధానాలే మేలు
- చిన్న సంస్థలకు దన్నుతోనే మేటి ఉద్యోగాలు
- కాంట్రాక్ట్ వద్దు.. స్థిర ఉద్యోగాలే ముద్దు...



న్యూఢిల్లీ: ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న తీవ్ర సమస్య తక్కువ వేతనపు ఉద్యోగాలేనని.. నిరుద్యోగం కాదని నిటి ఆయోగ్ విశ్లేషించింది. దిగుమతులకు ప్రత్యామ్నాయ విధానాల ద్వారా దేశీయ మార్కెట్లపై దృష్టి సారిస్తే మేలని సర్కారుకు సూచించింది. ప్రభుత్వ విధానాల రూపకర్తగా సర్కారు దిశానిర్దేశం చేస్తున్న నిటి ఆయోగ్ రానున్న మూడేండ్లకు (2017-18 నుంచి 2019-20) సంబంధించిన కార్యాచరణను ఇటీవల విడుదల చేసింది. దిగుమతులకు ప్రత్యామ్నాయ విధానాల ద్వారా దేశీయ మార్కెట్లపై దృష్టి సారించడం వల్ల చిన్న సంస్థలకు ఊతం లభిస్తుందని విశ్లేషించింది. ప్రస్తుతం దేశంలో అధిక ఉత్పాదకత.. అధిక వేతనాలతో కూడిన ఉద్యోగాల అవసరం ఎంతైనా ఉందని పేర్కొంది. దేశం వృద్ధి పథంలో పయనిస్తున్నప్పటికీ ఉద్యోగాల కల్పన జరగడం లేదంటూ వస్తున్న విమర్శలను నిటి ఆయోగ్ తోసిపుచ్చింది. నేషనల్ శాంపిల్ సర్వే కార్యాలయం ...9లో



వాటర్ ఏటీఎంలు వైన్‌షాపుల పక్కన పెడితే ఎలా వుంటుంది... సార్..?..!!

జలవిద్యుత్‌పై జెన్‌కో దృష్టి

ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు

- రిజర్వాయర్లలోకి వరద నీరు వస్తుందని అధికారుల అంచనా
- రెండు, మూడు రోజుల్లో ఉత్పత్తి ప్రారంభం



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

జలవిద్యుదుత్పత్తిపై తెలంగాణ జెన్‌కో దృష్టి పెట్టింది. ప్రస్తుతం కర్నాటక సహా ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు పడుతుండటంతో రాష్ట్రంలోని జలాశయాల్లోకి భారీగా వరదనీరు చేరుతుందని అధికారులు అంచనా వేశారు. ఈ ఏడాది ఇప్పటి వరకు రాష్ట్రంలోని జలవిద్యుత్కేంద్రాల్లో ఎలాంటి ఉత్పత్తి జరగలేదు. వాస్తవంగా ఏటా ఆగస్టు నెలలో ఎగువప్రాంతాల నుంచి వరదనీరు వచ్చిచేరుతుంది. ఇటీవల కురిసిన ఓ మోస్తరు భారీ వర్షాల వల్ల ఆశించిన స్థాయిలో రిజర్వాయర్లలోకి నీరు చేరలేదు. అయితే ప్రస్తుతం కృష్ణాబేసిన్‌లో భారీగా వర్షాలు పడుతుండటంతో జలవిద్యుత్‌ను చేపట్టాలని టీఎస్‌జెన్‌కో అధికారులు నిర్ణయించారు. ఆ మేరకు జలాశయాల్లో నీటి మట్టాలను అంచనా వేస్తున్నారు. రాష్ట్రంలో టీఎస్‌జెన్‌కోకు 2,882.5 మెగావాట్ల వ్యవస్థాపక సామర్థ్యంతో కూడిన బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్కేంద్రాలు ఉన్నాయి. వాటితో పాటు 2,351.8 మెగావాట్ల సామర్థ్యంతో కూడిన జలవిద్యుత్కేంద్రాలు ఉన్నాయి. అయితే గడచిన కొంతకాలంగా జలశయాల్లో తగినంత ఇన్‌ఫ్లోలు లేకపోవడంతో జలవిద్యుత్కేంద్రాల్లో ఉత్పత్తి నిలిచిపోయింది. రాష్ట్రంలోని జూరాల రిజర్వాయర్ పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 1,045 అడుగులు కాగా ప్రస్తుతం 7.8 టీఎమ్‌సీల నీరు ఉంది. మరో 2.7 టీఎమ్‌సీల నీరు ...9లో

నేడు విద్యుత్ అమరవీరుల స్మారక దినం

- 17 ఏండ్లు దాటినా... కొనసాగుతున్న అదే స్ఫూర్తి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

2000 సంవత్సరం ఆగస్టు 28 అప్పటి సమైక్య రాష్ట్రంలో చీకటి రోజు. ఆనాటి తెలుగుదేశం ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా ఉవ్వెత్తున లేచిన ప్రజాఉద్యమం. దాన్ని అణచివేసేందుకు ఆనాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిర్ధాక్షిణ్యంగా పోలీసులకు షూట్ అండ్ సైట్ ఆర్డర్లు ఇచ్చి ఉద్యమకారులపై కాల్పులకు తెగబడిన రోజు. ఫలితంగా ముగ్గురు ఉద్యమకారుల వీరమరణం. బుల్లెట్లు తగిలి కొందరు, పోలీస్ లాఠీచార్జీలో మరికొందరు మొత్తంగా 42 మందికిపైగా క్షతగాత్రులైన చారిత్రక నేపథ్యం. ఆనాటి ఉద్యమ ఫలితంగా తర్వాత దాదాపు పదేండ్లకు పైగా ఒక్కపైసా కరెంటు చార్జీ ...9లో

బాంబుతో కిలోమీటర్ దూరం పరిగెత్తిన కానిస్టేబుల్

- చిన్నారులను రక్షించిన రక్షకభటుడు
- మధ్యప్రదేశ్‌లో ఘటన



భుజంపై బాంబు పెట్టుకొని పరిగెడుతున్న అభిషేక్..

భోపాల్ : పాఠశాలలోని చిన్నారులను కాపాడాలని సిద్ధమయ్యాడు ఓ కానిస్టేబుల్. ఇందుకు తన ప్రాణాలనైనా పణంగా పెట్టాలని భావించాడు. 400మంది చిన్నారులను రక్షించి అందరిప్రశంసలు అందుకున్నాడు. వివరాల్లోకి వెళ్లితే మధ్యప్రదేశ్ రాష్ట్రం సాగర్ జిల్లాలోని చితోరా గ్రామంలో ఓ పాఠశాలలో బాంబు ఉన్నట్టు పోలీసులకు సమాచారం అం దింది. సమాచారం అందుకున్న అభిషేక్ పటేల్ (40) అనే హెడ్‌కానిస్టేబుల్ హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకు న్నాడు. బాంబు నిర్వీర్యం బృందానికి సమాచారం అందించా డు. పాఠశాల వెనుక భాగంలో 10కిలోల బరువున్న బాంబు ను గుర్తించాడు. బాంబు నిర్వీర్యం బృందాలు ఘటనాస్థలానికి చేరుకోవడం ఆలస్యమవుతుందని తెలుసుకుని పది కేజీల బరువున్న బాంబును భుజాన పెట్టుకొని కిలోమీటరు దూరం పరిగెత్తాడు. నిర్మానుష్య ప్రాంతంలో బాంబును విసి రేశాడు. అదృష్టవశాత్తూ ఆ బాంబు అభిషేక్ చేతిలో ఉన్నప్పుడు పేలకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అతను బాంబును గుర్తించిన సమయంలో పాఠశాలలో 400మంది చిన్నారులు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు. కాగా, అసాధారణమైన ధైర్యసాహసాలను ప్రదర్శించి 400మంది చిన్నారుల ప్రాణా లను కాపాడిన అభిషేక్‌ను సహోద్యోగులు, ఉన్నతాధికారులు అభినందించారు. ఆయన చూపించిన ధైర్యాన్ని ప్రశంసిస్తూ ఉన్నతాధికారులు రివార్డు ప్రకటించారు. 'పాఠశాల ఆవరణ లో బాంబును గుర్తించినట్టు డయల్ 100కు కాల్ వచ్చింది. బాంబు పేలివున్నట్టయితే అర కిలోమీటర్ వరకు దాని ప్రభా వం ఉంటుందని పోలీస్ శిక్షణలో నేర్చుకున్నాను. అందుకే సాధ్యమైనంత దూరం బాంబుతో పరిగెత్తేందుకు ప్రయత్నిం చాను. ఏదిఏమైనా చిన్నారుల ప్రాణాలను కాపాడాననే సంతృప్తి నాలో ఉన్నది' అని అభిషేక్ పటేల్ మీడియాతో అన్నారు.

జేడీయూ నేత శరద్‌యాదవ్‌కు బెదిరింపు లేఖ

పాట్నా: జేడీయూ రెబల్ నేత శరద్‌యాదవ్‌కు బెదిరింపు లేఖ వచ్చింది. బీహార్ రాజకీయాల్లో జోక్యం చేసుకోవద్దని లేఖలో హెచ్చరించారు. అయితే, ఈ లేఖ ఎవరు పంపారన్నది మాత్రం తెలియరాలేదు. న్యూఢిల్లీలోని ఆయన నివాసానికి ఈ లేఖ వచ్చినట్టు సమాచారం. బీహార్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడినా, హిందూ మనోభావాలను కించపరిచే వ్యాఖ్యలు చేసినా.. తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని లేఖలో ఉన్నది. 'జాతి వ్యతిరేకులకు మద్దతిస్తూ పెద్ద తప్పు చేశావు' అని హెచ్చరించారు. బెదిరింపు లేఖ గురించి కేంద్ర హోం శాఖకు తెలియజేసినట్టు శరద్‌యాదవ్ కార్యాలయం పేర్కొంది. బీజేపీతో జేడీయూ పొత్తు పెట్టుకోవడం ఏమాత్రం ఇష్టంలేని శరద్‌యాదవ్ పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్న విషయం తెలిసిందే. బీజేపీకి వ్యతిరేకంగా లాలూప్రసాద్ యాదవ్ ఆదివారం నిర్వహించిన ర్యాలీలో కూడా శరద్‌యాదవ్ పాల్గొన్నారు. జేడీయూ నేతలు హెచ్చరించినా లెక్క చేయకుండా ఆయన ర్యాలీలో పాల్గొనడం గమనార్హం.

కేంద్రంపై 'మహా' పోరాటం

విపక్షాలపైకి ఏజెన్సీలను ఉసిగొల్పుతున్న మోడీ సర్కారు

- తేజస్వీ పాపులారిటీని నితీశ్ ఓర్వలేకపోయారు : బీజేపీ వ్యతిరేక ర్యాలీలో వక్తలు



పాట్నా : 'నితీశ్ స్వార్థ ప్రయోజనాలకు మహాకూటమి బీహార్‌లో చీలిపోయినా.. దాని ద్వారానే జాతీయ స్థాయిలో బీజేపీపై పోరాటం చేస్తాం. ప్రతిపక్షాలపైకి దర్యాప్తు ఏజెన్సీలను ఉసిగొల్పడం ద్వారా కేంద్రం రాజకీయ లబ్ధి పొందుతున్నది' అని బీజేపీ వ్యతిరేక ర్యాలీలో వక్తలు అన్నారు. బీహార్ రాజధాని పాట్నాలో రాష్ట్రీయ జనతాదళ్(ఆర్జేడీ).. 'దేశ్ బచావో.. బీజేపీ బగావో' పేరుతో ఆదివారం భారీ నిర్వహించింది. ఈర్యాలీలో ఉత్తరప్రదేశ్ మాజీసీఎం అఖిలేష్ యాదవ్, బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, జేడీ(యూ) రెబెల్ నేత శరద్‌యాదవ్ పాల్గొన్నారు. అంతేకాక ర్యాలీకి కాంగ్రెస్ సీనియర్ నేతలు గులాం నబీ ఆజాద్, సిపిజోషి, సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి హాజరయ్యారు. కాంగ్రెస్ అధి నేత్రి సోనియాగాంధీ, ఉపాధ్యక్షులు రాహుల్‌గాంధీ పాల్గొనలేకపోయారు. కానీ వారి వాయిస్ మెసేజ్‌ను కాంగ్రెస్ నేతలు.. ప్రజలకు వినిపించారు. ఆర్జేడీ చీఫ్ లాలూ మాట్లాడుతూ.. 2019లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ పతనానికి ఈర్యాలీ నాంది పలికిందన్నారు. నితీశ్‌ను సీఎం చేసేందుకు తాను, శరద్‌యాదవ్ తీవ్రంగా కృషి చేసినట్టు గుర్తు చేశారు. ఓవైపు గుండె శస్త్ర చికిత్స జరిగి బాధపడు తున్నా.. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రమంతా తిరిగి ప్రచారం నిర్వహించాన ని తెలిపారు. మాజీ డిప్యూటీ సీఎం తేజస్వీకి వస్తున్న పాపులారిటీని చూసి నితీశ్ ఓర్వలేకపోయారని అన్నారు. రాష్ట్ర ప్రజల నమ్మకాన్ని వమ్ముచేస్తూ నితీశ్ మహా కూటమిలో చీలక తెచ్చాడన్నారు. ఇప్పుడు ఆయనను ఏ పార్టీ కూడా నమ్మే స్థితిలో లేదని ఎద్దేవా చేశారు. కోర్టులో హాజరయ్యేందుకు రాంచికి వెళ్లగానే తన నివాసంపై సీబీఐ దాడులు చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అనుమతి లేకుండానే సీబీఐ ఈ దాడులకు తెగబడిందా? అని ప్రశ్నించారు. శ్రీజన్ కుంభకోణానికి సంబంధించిన అన్ని ఆధారాలూ ఉన్నాయని, సుశీల్ మోడీ.. రాష్ట్ర ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు ఈ స్కాం జరిగిందని చెప్పారు. బీహార్‌లో వరదల కారణంగా 150మందికి పైగా చనిపోయినా.. బాధితులకు ముఖ్యమంత్రి భరోసా ఇవ్వలేక పోయారని విమర్శించారు. ప్రాజెక్టుల నిర్మాణం పేరుతో నితీశ్.. స్కామ్‌లకు తెర తీశారని, దాని ఫలితంగానే అమాయకుల ప్రాణాలు పోయాయన్నారు.

మూడేండ్లు దాటింది.. అచ్చేదిన్ ఎక్కడ : మమత

కేంద్రంలో మోడీ సర్కారు అధికారంలోకి వచ్చి మూడేండ్లు దాటినా వారు చెప్పిన 'అచ్చే దిన్(మంచి రోజులు) ఇంకా రాలేదని మమతా బెనర్జీ ఎద్దేవా చేశారు. సీబీఐని ఉసిగొల్పడం ద్వారా లాలూ ప్రసాద్ యాదవ్‌ను కేంద్రం వేధిస్తున్నద ని ఆమె విమర్శించారు. మోడీ సర్కారును నిలదీస్తున్న వారిపై దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పు తున్నదన్నారు. లాలూ, శరద్ విశ్వసనీయ నేతలని, వారికి ప్రజానాడి బాగా తెలుసని అన్నారు. లాలూ పేరు చెప్పి ఓట్లుపొంది, అధికారం చేపట్టిన నితీశ్ చివరకు ఏం చేశాడో ప్రజలందరికి తెలుసని ఆమె అన్నారు. నోట్లరద్దు నిర్ణయంతో దేశ ఆర్థిక పరిస్థితిపూర్తిగా దిగజారిపోయిందని తెలిపారు.

బీజేపీ ప్రత్యామ్నాయంగా మహాకూటమి : శరద్‌యాదవ్

దేశంలో బీజేపీకి ప్రత్యామ్నాయం మహాకూటమిని ఏర్పాటు చేస్తామని జేడీ(యూ) రెబెల్ నేత శరద్ యాదవ్ అన్నారు. ఆపార్టీ బహిష్కృత నేత, ఎంపీ అన్వర్‌తో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. కేవలం మాట లతోనే ప్రభుత్వం నడవదంటూ మోడీని పరోక్షంగా ఎద్దేవా చేశారు. దేశం ప్రమాదంలో ఉన్నదని, పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

నయవంచక నితీశ్ : తేజస్వీ యాదవ్

ముఖ్యమంత్రి సీఎం నయవంచకుడని, ఆయన మోసానికి ఇప్పటికే ఎందరో బలయ్యారని మాజీ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్ విమర్శించారు. స్వలాభాల కోసం ఎంతటికైనా దిగజారుతారని, ఏ పార్టీతో చేతులు కలిపేందుకైనా ఆయన వెనుకాడరని అన్నారు. ప్రజా తీర్పును వమ్ము చేసిన ఘనత నితీశ్‌కే దక్కుతుందన్నారు. పేదల కోసం ఏంచేశారు? దేశంలో రైతుల సమస్యలను పరిష్కరించారా? అని కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. కేంద్రానికి.. స్మార్ట్ సిటీలు, ధనవంతులు, అన్యాయాలు చేయడమే కావాలని, సామాన్య ప్రజానీకం గురించి ఏ మాత్రం పట్టింపు లేదని తేజస్వీ తెలిపారు.



విశ్వాసాల పేరుతో హింసను సహించబోం : మోడీ



న్యూఢిల్లీ : మనది మహాత్మాగాంధీ, బుద్ధుడు జన్మించిన దేశమని, హింసను ఏ రూపంలోనూ సహించబోమని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. ఆదివారం 35వ మన్‌కీబాత్(మనసులో మాట) రేడియో కార్యక్రమంలో ప్రధాని మాట్లాడారు. త్వరలో జరుపుకోనున్న పండుగల కోసం అంతా వేచి చూస్తున్న సమయంలో హింస ఆందోళన కలిగించడం సహజమని ప్రధాని అన్నారు. డేరా సచ్చాసౌదా అధినేత గుర్మీత్ రామ్‌రహీమ్‌సింగ్‌ను సీబీఐ కోర్టు దోషిగా తేల్చిన నేపథ్యంలో హర్యానా, పంజాబ్ లో జరిగిన హింసను ప్రస్తావిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మత విశ్వాసం లేదా రాజకీయ సిద్ధాంతం పేరుతో చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకునే హక్కు ఎవ రికీ లేదని ప్రధాని అన్నారు. సెప్టెంబర్ 5న సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టినరోజును ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడాన్ని ప్రధాని ప్రస్తావించారు. సృజనాత్మక భావాలను పెంపొందిస్తూ విద్యార్థులకు విజ్ఞానాన్నందించే ఉపాధ్యాయుల బాధ్యతను ప్రధాని గుర్తు చేశారు.

బీహార్ వరద బాధితులను ఆదుకుంటాం

- తక్షణ సహాయక చర్యల కోసం రూ.500 కోట్లు : మోడీ

పాట్నా : బీహార్ వరద బాధితులను ఆదుకుంటామని ప్రధాని మోడీ ఉద్ఘాటించారు. తక్షణ సహాయక చర్యల నిమిత్తం రూ.500కోట్లు మంజూరు చేసినట్టు తెలిపారు. వరదల కారణంగా అతలాకుతలమైన అరారియా, కిషన్‌గంజ్, కతియాహార్, పూర్ణియా జిల్లాల్లో బీహార్ సీఎం నితీష్ కుమార్‌తో కలిసి మోడీ ఏరియల్ సర్వే నిర్వహించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపట్టిన సహాయక చర్యల గురించి ఉన్నతాధికారులను అడిగి తెలుసుకున్నారు. సహాయక చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. కాగా, బీహార్ రాష్ట్రంలో వరదలు బీభత్సం సృష్టించడంతో మృతి చెందిన వారి సంఖ్య ఆదివారం నాటికి 440కి చేరుకున్నట్టు అధికారులు ధ్రువీకరించారు. మృతుల కుటుంబాలకు పీఎం సహాయ నిధి నుంచి రూ.2లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా అందజేస్తామన్నారు. వరదల్లో చిక్కుకుని గాయపడ్డ వారికి రూ.50వేలు అందజేస్తామని అన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో భారత సైన్యంతో పాటు 28ఎన్డీఆర్ఎఫ్ (నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) బృందాలు సహాయక చర్యలు చేపడుతున్నాయని అన్నారు. లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న 1.65లక్షల మందిని పునరావాస కేంద్రాలకు తరలించామన్నారు. ఇదిలా ఉండగా, బీహార్ వరద బాధితుల సహాయక చర్యల కోసం మోడీ సర్కార్ కేవలం రూ.500 కోట్లు ప్రకటించడాన్ని ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ తప్పుపట్టారు. భారీ ఆస్తి నష్టం, పంట నష్టం జరిగిందన్నారు. 440 మంది మృతిచెందినట్టు అధికారులు ఇప్పటికే ధ్రువీకరించారని అన్నారు. గల్లంతైన వారి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయన్నారు. రూ.5,700కోట్ల నష్టం జరిగినట్టు అధికారులు అంచనా వేశారని అన్నారు. బీహార్‌లో 2008లో వరదలు సంభవించినప్పుడు యూపీఏ ప్రభుత్వం సహాయక చర్యల కోసం రూ.1100కోట్లు అందజేసిన విషయాన్ని తేజస్వీ యాదవ్ ఈ సందర్భంగా గుర్తుచేశారు.

డేరా బాబాకు శిక్ష ఖరారు నేడు

- రోహ్‌తక్ జిల్లా జైలులో తీర్పు వెల్లడించనున్న సీబీఐ జడ్జి

చండీగఢ్: లైంగికదాడి కేసుల్లో దోషిగా తేలిన డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్ రామ్ రహీం సింగ్ (డేరా బాబా) శిక్షను సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం సోమవారం ఖరారు చేయనుంది. ఈ వ్యాజ్యానికి సంబంధించిన విచారణ, శిక్ష ఖరారు రోహ్‌తక్ జిల్లా కారాగారంలోనే కొనసాగనుంది. జైలులోనే సీబీఐ ప్రత్యేక న్యాయమూర్తి జగ్దీప్‌సింగ్ తీర్పు వెలువరించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని పంజాబ్-హర్యానా ఉమ్మడి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎస్ఎస్ సారోన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. తీర్పు వెల్లడించిన అనంతరం జ్యుడిషియల్ అధికారిని సురక్షితంగా బయటకు తీసుకువెళ్లేందుకు పటిష్టతమైన భద్రతా ఏర్పాట్లు కూడా చేయాలని పోలీస్ ఉన్నతాధికారులను సీజే ఆదేశించారు. కాగా, ఆశ్రమంలో ఉన్న తమపై డేరా బాబా లైంగికదాడికి పాల్పడినట్టు ఇద్దరు సాధ్వీలు 2002లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈకేసుపై విచారణ చేపట్టిన పోలీసులు సీబీఐ కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. డేరా బాబాపై మోపిన అభియోగాలన్ని రుజువయ్యాయి. సీబీఐ ప్రత్యేక కోర్టు జడ్జిమెంట్ రిజర్వ్ చేసింది. అయితే, డేరా బాబాను కోర్టుదోషిగా తేల్చగానే రాష్ట్రంలో పలు హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. హర్యానా డీజీపీ బీఎస్ సాంధు తెలిపిన వివరాల ప్రకారం...రాష్ట్రంలో చెలరేగిన హింసాత్మక ఘటనల్లో 36మంది మృతి చెందగా, 269 మంది తీవ్రంగా గాయపడ్డారు. సిర్సా ప్రాంతంలోని డేరా బాబా ఆశ్రమంలో దాదాపు 4వేల మంది భక్తులున్నారని అన్నారు. డేరా బాబాను అదుపులోకి తీసుకున్న పోలీసులు రోహ్‌తక్ జిల్లా జైలుకు హెలికాప్టర్‌లో తరలించారు. జిల్లా జైలులోనే కోర్టు ఏర్పాటుకు ఉమ్మడి హైకోర్టు ఆదేశాలిచ్చింది. కోర్టు రూమ్ ఏర్పాటుకు అవసరమైన వసతి ఏర్పాటు చేయాలని, న్యాయవాదులు, సంబంధిత పార్టీలు కోర్టురూములోకి వెళ్లేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని ఉమ్మడి హైకోర్టు జిల్లా జైలు అధికారులను ఆదేశించింది.



తుఫాన్ తాకిడిలో ఇంటిని కోల్పోయిన బాధితురాలు


'హార్వే' బీభత్సం : ముగ్గురు మృతి

టెక్సాస్: అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో 'హార్వే' బీభత్సం సృష్టిస్తోంది. ఈ తుఫాన్ కారణంగా ఇప్పటి వరకు ముగ్గురు ప్రాణాలు కోల్పోగా...పలువురు గాయపడ్డారు. గంటకు 195కి.మీ వేగంతో భారీగా ఈదురుగాలులు వీయడంతో చెట్లు, విద్యుత్ స్తంభాలు కుప్పకూలిపోతున్నాయి. గాలుల ధాటికి వాహనాలు, రోడ్డుపైన బోర్డులు కొట్టుకుపోతున్నాయి. గత 12ఏండ్ల తర్వాత ఇదే అత్యంత శక్తివంతమైన తుఫాన్‌గా వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. టెక్సాస్ తీరప్రాంతమైన రాక్‌పోర్టు తీవ్రంగా దెబ్బతింది. సముద్రంలో అలలు విరుచుకుపడుతున్నాయి. హార్వే ప్రభావం టెక్సాస్ విద్యుత్ వ్యవస్థపై పడటంతో పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దాంతో 2.50లక్షల మంది చీకట్లలో మగ్గుతున్నారు.

పలు విమాన సర్వీసులను రద్దు చేశారు. పాఠశాలలను మూసివేశారు. టెక్సాస్‌లోని పరిస్థితుల గురించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పర్యవేక్షిస్తున్నారు. టెక్సాస్, లూసియానా గవర్నర్లతో ట్రంప్ మాట్లాడారు. హార్వే అతిపెద్ద విపత్తుగా టెక్సాస్ గవర్నరు గ్రెగ్ అబాట్ అభివర్ణించారు. టెక్సాస్‌కు అవసరమైన సహాయాన్ని చేస్తామని ట్రంప్ హామీ ఇచ్చినట్టు అబాట్ తెలిపారు. హైవేల వెంట ఎవరూ ప్రయాణించొద్దని అధికారులు ప్రమాదహెచ్చరికలను జారీ చేశారు.

16కు చేరిన స్పెయిన్ పేలుళ్ల మృతుల సంఖ్య

మాడ్రిడ్: గతవారం స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌లో జరిగిన జంట వాహనాల పేలుళ్లలో మృతుల సంఖ్య ఆదివారం ఉదయానికి 16కి చేరిందని బార్సిలోనా నుంచి అధికారిక వర్గాలు వెల్లడించాయి. చికిత్స పొందుతూ 51 ఏళ్ల జర్మన్ మహిళ ఆదివారం ఉదయం చనిపోవడంతో ఇప్పటికి వరకు 16మంది చనిపోయినట్టు అధికారిక వర్గాలు ధ్రువీకరించాయి. బార్సిలోనా సముద్ర తీరప్రాంతంలో జరిగిన ఈ పేలుళ్లలో 120 మంది గాయాలపాలయ్యారు.



ఘనంగా ఇండోనేషియా స్వాతంత్ర్య వేడుకలు

జకార్తా : ఇండోనేషియా 72వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా ముగిసాయి. ఆగస్టు 22న ప్రారంభమైన ఈ వేడుకలు శనివారంనాడు ముగిసాయి. 1945, ఆగస్టు 17న డచ్ వలసపాలన నుంచి ఇండోనేషియాకు విముక్తి లభించింది.

పాక్‌కు షరతులతో కూడిన సహాయం

- శ్వేతసౌధం సీనియర్ అధికారి వెల్లడి !

వాషింగ్టన్: పాకిస్థాన్ తమ దేశంలో ఉన్న తాలిబన్, హక్కానీ వంటి ఉగ్రవాద సంస్థలకు వ్యతిరేకంగా తీసుకునే చర్యలకు అమెరికా షరతులతో కూడిన భద్రతా సహాయాన్ని అందించగలదని ట్రంప్ అధికార యంత్రాంగంలోని ఓ సీనియర్ అధికారి తెలిపారు. పాకిస్థాన్ ఇంటిలిజెన్స్ అధికారులకు, తీవ్రవాదులకు మధ్య చాలా కాలం నుంచి సంబంధాలున్నాయని.. ప్రస్తుతమున్న పరిస్థితులు ఒక్కరోజులో మారిపోయేవి కాదని ఆయన పేర్కొన్నారు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తున్నారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాక్‌ను హెచ్చరించిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి.

ఉగ్రవాద వ్యతిరేక పోరులో పాక్.. అమెరికాకు సహకరిస్తుందా అన్న ప్రశ్నకు ఆ ఉన్నతాధికారి సమాధానమిస్తూ..."ఉగ్రవాదం విషయంలో పాక్‌తో వేరే పద్ధతి అనుసరించనున్నామని ట్రంప్ స్పష్టం చేశారు. కానీ ఈ విషయంలో పాక్ నుంచి గొప్ప సహకారం అందగలదని నమ్ముతున్నాం. ఇది పాక్ చేతిలో ఉంది. వారు మాతో సహకరిస్తే ఉగ్రవాద సంస్థల కట్టడి విషయంలో ప్రయోజనం పొందగలరు. లేకపోతే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది" అని అన్నారు. అఫ్గానిస్థాన్‌లో అమెరికా భద్రత బలగాలపై దాడులకు పాల్పడుతున్న తీవ్రవాదులకు వ్యతిరేకంగా పాక్ చర్యలు తీసుకోవడం అత్యవసరమని ఆయన తెలిపారు.

పాక్ విదేశాంగ మంత్రి ఖవాజా ఆరిఫ్ త్వరలోనే అమెరికా పర్యటించి విదేశాంగ మంత్రి రేక్స్ టిల్లర్సన్‌తో సమావేశమయ్యే అవకాశం ఉంది.



పాక్ పట్ల ట్రంప్ ఇటీవలి వ్యాఖ్యల్ని నిరసిస్తూ అమెరికా జాతీయ పతాకాన్ని దగ్ధం చేస్తున్న ఆందోళనకారులు

అతడికి క్షమాభిక్ష ప్రసాదించాల్సింది కాదు

- ట్రంప్ నిర్ణయాన్ని తప్పుబట్టి ప్రతినిధుల సభ స్పీకర్ పాల్ రేయాన్
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డెమొక్రాట్స్, మానవ హక్కుల కార్యకర్తలు



'మారికోపా' కౌంటీ 'షరీఫ్' జోయే ఎర్పాయో, ట్రంప్ (ఫైల్)

వాషింగ్టన్ : అరిజోనా రాష్ట్రంలోని 'మారికోపా' అనే కౌంటీ 'షరీఫ్'(లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి)గా పనిచేసిన 85 ఏండ్ల జోయే ఎర్పాయోకు ఒక క్రిమినల్ కేసులో అధ్యక్షుడు ట్రంప్ క్షమాభిక్ష ప్రసాదించటం రాజకీయ వివాదాన్ని రేపింది. స్వంత పార్టీ రిపబ్లికన్ నేతల నుంచే ట్రంప్‌పై విమర్శల వాన కురుస్తున్నది. ట్రంప్ నిర్ణయం సరైంది కాదని ప్రతినిధుల సభ స్పీకర్ పాల్ రేయాన్ తాజాగా తప్పుబట్టారు. జిల్లా ఉన్నతాధికారిగా ఉండి జాతివివక్ష చూపాడన్న కేసులో జోయే ఎర్పాయోను కోర్టు దోషిగా తేల్చింది. అలాంటి వ్యక్తి జైలు శిక్ష అనుభవించకుండా తప్పించారని, ఇలా చేయాల్సింది కాదని పాల్ రేయాన్ తాజాగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రంప్ తీసుకున్న వివాదాస్పద నిర్ణయంపై పాల్ రేయా న్ శనివారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. అందులో..."జిల్లా లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కేవలం పాలనాపరమైన ఆదేశాల్ని అమలుజేయడానికే పరిమితం కాకూడదు. పౌర హక్కులను కాపాడే బాధ్యత కూడా వారిదే. జాతివివక్ష చూపాడన్న కేసులో దోషిగా తేలిన వ్యక్తికి క్షమా భిక్ష ప్రసాదించారు. ఇది దేశంలోని మిగతా జిల్లా అధికారు లకు తప్పుడు సంకేతాలు అవుతాయి. ట్రంప్ తీసుకున్న నిర్ణయాన్ని నేను ఎంతమాత్రమూ అంగీకరించను"అని ఆయన అన్నారు.

జోయే ఎర్పాయోకు ట్రంప్ క్షమాభిక్ష ప్రసాదించటాన్ని అరిజోనా సెనెటర్ జాన్ మెక్‌కెయిన్, ఫ్లోరిడా మాజీ గవర్నర్ జెబ్ బుష్, ఇతర రిపబ్లికన్ నేతలు తీవ్రంగా ఖండించారు. ఇటు డెమొక్రట్స్, అటు మానవ హక్కుల నేతలు ట్రంప్ నిర్ణయాన్ని తీవ్రంగా తప్పుబట్టారు.

వలసదారులపై ఇద్దరిదీ ఒకే విధానం

అమెరికా రాజకీయాల్లో తీవ్రమైన జాతీయ దురహంకారిగా జోయే ఎర్పాయోకు పేరుంది. అతను మారికోపా జిల్లా ఉన్నతాధికారిగా చాలా తీవ్రమైన నిర్ణయాలు తీసుకునేవాడు. కౌంటీ జైలులో ఖైదీల పట్ల చాలా కఠినమైన నిబంధనల్ని అమలుజేశాడు. సరైన పత్రాలు లేని వలసదారులను దేశంలోకి రానివ్వకూడదన్న ప్రచారాన్ని తెరమీదకు తెచ్చింది ఈయనే. ఇతడి నుంచే ప్రభావితుడైన ట్రంప్, వలసదారుల విధానాన్ని రూపకల్పన చేశాడు. ఇద్దరి మధ్యా బలమైన స్నేహసంబంధాలున్నాయి. ఒబామా అధ్యక్షుడిగా ఉన్న సమయంలో 'అతడి జన్మస్థలం అమెరికా కాద'న్న వివాదాన్ని తెరమీదకు తెచ్చినది కూడా జోయే ఎర్పాయోనే.

ఇలాంటి జోయే ఎర్పాయో తాను తవ్వుకున్న గోతిలోనే పడ్డాడు. మారికోపా కౌంటీ ఉన్నతాధికారిగా 'లాటినో' పౌరుల హక్కుల్ని కాలరాచాడని కోర్టులో కేసు నమోదైంది. జిల్లాలో అక్రమంగా ఉంటున్నారని, అనుమానం వ్యక్తం చేస్తూ కొంతమంది లాటినో పౌరులను బంధించాడు. వారిపైకి అధికారుల్ని ఉసిగొల్పాడు. కేవలం వారి చర్మరంగును బట్టి అనుమానించటం, విచారణ జరపటం ఏంటని ? జిల్లా ఫెడరల్ కోర్టు ఎర్పాయోను ప్రశ్నించింది. ఇమ్మిగ్రేషన్ అధికారుల విచారణ ఆపేయాలని 2011లో కోర్టు ఆదేశాలు జారీ చేసింది.

కానీ ఎర్పాయో కోర్టు ఆదేశాల్ని ధిక్కరిస్తూ ముందుకెళ్లాడు. తాను చేసేదంతా సరైందేనని వాదించాడు. దీనికి సంబంధించి కోర్టు ధిక్కార అభియోగాలు అతడిపై నమోదయ్యాయి. కోర్టు అతడ్ని దోషిగా తేల్చుతూ గత నెలలో తీర్పు చెప్పింది. ఆరునెలల జైలు శిక్ష విధించింది. క్షమాభిక్ష కోసం ఎర్పాయో ఎలాంటి దరఖాస్తు చేయలేదు. కానీ ట్రంప్ సన్నిహితుడు కావటం వల్ల అతడికి క్షమాభిక్ష దక్కింది.

ఫ్రాన్స్ అధ్యక్షుడి మేకప్ ఖర్చు రూ.19 లక్షలు!



పారిస్ : ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ ఇమ్మాన్యుయేల్ కేవలం అందంగా కన్పించడం కోసమే మిలియన్ డాలర్లు ఖర్చుచేస్తున్నారట. ఆయన బయటికి వెళ్లినప్పుడు అందంగా కన్పించడానికి వేసుకునే మేకప్ ఖరీదెంతో తెలిస్తే నోరెళ్లబెట్టాల్సిందే. మేక్రాన్ ఫ్రాన్స్ అధ్యక్షుడిగా ఎంపికైన తొలి వంద రోజుల్లోనే మేకప్ కోసం 26వేల యూరోలు అంటే సుమారు రూ.19 లక్షలకుపైగా ఖర్చుచేశారట. ఈ విషయాన్ని మేక్రాన్ అధికార ప్రతినిధులు ఓ నివేదికలో వెల్లడించారు. ఆయన మేకప్ కోసం ఇంత ఖర్చు చేసే బదులు ప్రత్యామ్నాయంగా ఏదన్నా చేయాలని వారు ఆలోచిస్తున్నారట. అందులోనూ ఇటీవల మేక్రాన్ పాపులారిటీ తగ్గుతున్న క్రమంలో ఈ విషయాలు బయటికి రావడంతో ఆయనపై సోషల్‌మీడియాలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పాక్ జనాభా 20.7కోట్లు

- 19 ఏండ్లలో 57 శాతం పెరుగుదల

ఇస్లామాబాద్ : పాకిస్థాన్ జనాభా గత 19 సంవత్సరాల్లో 57 శాతం (7.5 కోట్లు) మేర పెరిగింది. దేశ ఆరో జనగణన (2017) తాత్కాలిక ఫలితాలను పాక్ విడుదల చేసింది. 1998 లెక్కల ప్రకారం 13.2కోట్లున్న జనాభా తాజాగా 20.7కోట్లకు చేరింది. ఇందులో పురుషులు 10.6 కోట్లు, మహిళలు 10.1కోట్లు కాగా ట్రాన్స్‌జెండర్లు 10,418 మంది ఉన్నారు. తాత్కాలిక జనగణన ఫలితాలను పాక్ ప్రధాని నేతృత్వంలోని నలుగురు ముఖ్యమంత్రులతో కూడిన



రాజ్యాంగ సంస్థ (సీసీఐ) ఆమోదించినట్టు ఓ వార్తాసంస్థ తెలిపింది. ఇందులో గిల్గిత్ బాల్టిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌ల వివరాలను చేర్చలేదని.. తుది నివేదికను వాటితో కలిపి ఇచ్చే అవకాశం ఉందని పేర్కొంది.

మత సామరస్యాన్ని దెబ్బతీస్తున్న మోడీ

కమ్యూనిస్టుల పాలన దేశానికే ఆదర్శం: ప్రొఫెసర్ కంచ ఐలయ్య

- కష్టాలు, కన్నీళ్లున్న చోట టీమాస్ : తమ్మినేని వీరభద్రం
- వెనుకబడిన తరగతులు అధికారంలోకి రావాలి: సియాసత్ ఎడిటర్ జహీరుద్దీన్ అలీఖాన్
- పాతబస్తీలో టీమాస్ ఆవిర్భావ సభ



సభలో మాట్లాడుతున్న కంచ ఐలయ్య

నవతెలంగాణ - హైదరాబాద్ సిటీబ్యూరో

దేశంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మత సామరస్యాన్ని దెబ్బతీస్తున్నారని, ప్రజల ఆహారపు అలవాట్లు, ఆచారాలపై ఆంక్షలు విధిస్తున్నారని ప్రొఫెసర్ కంచ ఐలయ్య ఆందోళన వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్‌లో 34 ఏండ్లపాటు, కేరళ, త్రిపురలలో కమ్యూనిస్టుల పాలనలో ఎక్కడా మత సామరస్యానికి భంగం కలగలేదని, దేశానికే కమ్యూనిస్టుల పాలన ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. హైదరాబాద్ సౌత్ జిల్లా (పాతబస్తీ) టీమాస్ ఆవిర్భావ సభ ఆదివారం కుర్మగూడలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా కంచ ఐలయ్య మాట్లాడుతూ.. బీఫ్ తినడం వల్ల ఆర్మీ పటిష్టంగా తయారవుతుందని, దీన్ని ఇతర దేశాలు అనుసరిస్తున్నాయని చెప్పారు. దేశంలో దాడులు, దౌర్జన్యాలకు గురవుతున్న ముస్లింలు, క్రిస్టియన్లకు, దళితులకు ఎలాంటి రక్షణ లేదు కానీ రేపిస్టు డేరా బాబాకు జెడ్ కేటగిరీ భద్రత కల్పించి విమానంలో కోర్టుకు, జైలుకు తిప్పుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెనుకబడిన తరగతులు, దళిత, మైనార్టీ పిల్లలకు ఇంగ్లీష్ విద్యనందించాలని, ప్రపంచస్థాయి ప్రమాణాలను పాటించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వం కేజీ టు పీజీ ఉచిత విద్య ప్రకటించి ఎక్కడా అమలు చేయడం లేదన్నారు. ప్రభుత్వ పాలనతీరును ఎండగడుతున్న మేధావులు, కళాకారుల గొంతులను నొక్కుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

సియాసత్ పత్రిక మేనేజింగ్ ఎడిటర్ జహీరుద్దీన్ అలీఖాన్ మాట్లాడుతూ.. వారసత్వ రాజకీయాలే తప్ప వెనుకబడిన తరగతులు అధికారంలోకి రావడం లేదన్నారు. ప్రజాస్వామ్యానికి విలువ లేకుండా అధికార, ధనబలంతో ఓటర్లను మభ్యపెడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో పాలనంతా కేసీఆర్ కుటుంబం చేతిలోనే ఉందని, ఈ పరిస్థితి నుంచి వెనుకబడిన [illegible] అధికారంలోకి రావాలని కోరారు. టీమాస్ స్టీరింగ్ కమిటీ సభ్యులు విమలక్క మాట్లాడుతూ.. పోరాటంలో మహిళలు లేకుండా తెలంగాణ రాష్ట్రం రాలేదని, కానీ కొంతమందికే తెలంగాణ మిగిలిందని అన్నారు. దేశంలో హంతక ముఠాలు దూసుకొస్తున్నాయని, వీటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆర్ఎస్ఎస్ సంఘ్ పరివార్ శక్తులు దేశంలో ఏదైనా చేసుకోవచ్చనే స్వేచ్ఛను కేంద్ర ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. తలాక్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మహిళల విజయమన్నారు. ఎండీ అబ్బాస్ టీమాస్ ఫోరం ఏర్పాటు లక్ష్యాలు, ఉద్దేశాలను వివరించారు. జిల్లా టీమాస్ ఫోరం నాయకులు కనకయ్య, సత్తార్, బాలు, శ్రవణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, టీమాస్ ఫోరం స్టీరింగ్ కమిటీ సభ్యులు ప్రొఫెసర్ విశ్వేశ్వర్‌రావు, జాన్‌వెస్లీ, జేబీ రాజు, జి.రాములు, కిల్లె గోపాల్, ఎం వి.రమణ, శ్రీరామ్‌నాయక్, సోమయ్య, ఎం.నాగరాజు, మక్కా మజీద్ సొసైటీ కార్యదర్శి మహ్మద్ ఇక్బాల్ జావీద్, ఆలిండియా సున్నీ ఉల్మా బోర్డు అధ్యక్షులు సయ్య హమీద్ హుస్సేన్ సుతారీ, న్యాయవాది అబ్దుల్ ఖుదాస్ఘోరీ పాల్గొన్నారు.

కష్టాలు, కన్నీళ్లున్న చోట టీమాస్ ఫోరం ఉంటుందని ఫోరం స్టీరింగ్ కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం అన్నారు. విద్య, వైద్యం, కూడు, గూడు, ఉపాధి ప్రజలందరికీ దక్కాలని, ఆర్థిక సమానత్వం రావడంతోపాటు కుల అసమానతలు పోవాలన్నారు.

కుల అసమానతలు పోవాలి : తమ్మినేని

రాజ్య పాలనలో, విద్యలో, రాజకీయాల్లో సెక్యులర్ విధానం ఉండాలని టీమాస్ కోరుకుంటుందని తెలిపారు. మత విశ్వాసాలను, నమ్మకాలను వ్యక్తులపై బలవంతంగా రుద్దకుండా స్వేచ్ఛ కావాలని అన్నారు. ఆహారపు అలవాట్లు, ఆచార కట్టుబాట్లను నిర్ణయించే విధానాన్ని టీమాస్ వ్యతిరేకిస్తోందన్నారు. ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక సమానత్వం కోసం టీమాస్ పోరాడుతుందని చెప్పారు.



'కాలుష్య వ్యర్థాలను నియంత్రించని పరిశ్రమలను మూసేయాలి'

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాలుష్య వ్యర్థాలను నియంత్రించలేని పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్ ఆఫ్ కాలనీస్ అండ్ అపార్ట్‌మెంట్స్ (ఫాకా) ప్రధాన కార్యదర్శి వీ.కామేష్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం భారీ వర్షానికి హైదరాబాద్ కూకట్‌పల్లిలోని ఇండ్ల వద్దకు చేరిన కాలుష్యవర్థాల నురుగు పరిశ్రమల అక్రమాలను, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నిర్లక్ష్యాన్ని మరోసారి రుజువు చేశాయని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రకమైన కాలుష్యానికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకొని సంబంధిత పరిశ్రమల లైసెన్సులు రద్దు చేయాలన్నారు. నగరంలో కాలుష్యాన్ని నివారించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని, పర్యావరణ రక్షణ కోసం నిరంతర చర్యలు చేపట్టాలని సూచించారు.

కార్మికుల హక్కుల కోసం పోరాటం

- పన్నుల అధికారం కేంద్రం చేతిలో పెట్టిన రాష్ట్రం: సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎం సాయిబాబు


మాట్లాడుతున్న సాయిబాబు

నవతెలంగాణ-హన్మకొండ

కార్మికుల కనీస వేతనాలు, వారి హక్కుల పరిరక్షణ కోసం సెప్టెంబర్ 19న ప్రభుత్వంపై పోరాటం చేయనున్నట్టు సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎం సాయిబాబు తెలిపారు. హన్మకొండలో ఆదివారం సంఘం రాష్ట్ర కార్మిక కౌన్సిల్ రెండో రోజు సమావేశం జరింగిది. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఐదేండ్లకోసారి ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెంచాల్సి ఉన్నా ఆ దిశగా పాలకులు చొరవ తీసుకోవడం లేదని అన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడి మూడేండ్లు గడిచినా ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని విమర్శించారు. ప్రభుత్వ, ప్రయివేట్ రంగాల్లో కోటీ 50 లక్షల కాంట్రాక్టు ఉద్యోగస్తులు ఉన్నారని వివరించారు. ఇప్పటివరకు ఏ ఒక్కరినీ పర్మినెంట్ చేయలేదన్నారు. ప్రభుత్వం కార్మికుల శ్రమ దోపిడీకి పాల్పడుతోందన్నారు. జీఎస్టీ పేరుతో బీడీ కార్మికులు, వస్త్ర వ్యాపార కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. పన్నులు వేసే అధికారాన్ని కేంద్ర ప్రభుత్వం చేతిలో పెట్టిన రాష్ట్ర ప్రభుత్వం.. ఇప్పుడు మాట్లాడటం సరైనది కాదన్నారు. నిరసనలు తెలుపకుండా కలెక్టరేట్ల ముందు 144 సెక్షన్ విధిస్తూ నిరంకుశ పాలన చేయడం శోచనీయమన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు వేదికలు అవసరమని అన్నారు. వాటిని మూసివేయడం ప్రజాస్వామ్య విధానం కాదన్నారు. భవన నిర్మాణ కార్మికుల నిధులను వారి అభివృద్ధికే ఖర్చు చేయాలని సూచించారు. కార్మిక వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి కార్మికులను ఆదుకోవాలని కోరారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్(సీఐటీయూ) యూనియన్ ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి మాట్లాడుతూ.. స్త్రీలు అన్ని శ్రామిక వర్గాల్లో మమేకమై పనిచేస్తున్నారని వివరించారు. పనిచేసే చోట వారు లైంగిక వేధింపులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా ప్రభుత్వం రక్షణ చర్యలు తీసుకోవడం లేదన్నారు. మహిళలకు ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని కోరారు. బతుకమ్మ పండుగకు చీరలు పంపిణీ చేస్తే ఆడవాళ్లు సంతోషంగా ఉండరని, వారు ఆర్థికంగా ఎదగడానికి చట్టాలు చేయాలని అన్నారు. ఆశావర్కర్లకు పెంచిన వేతనాలు అమలు చేయడం లేదని చెప్పారు. మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు పెంచాలని కోరారు. సీఐటీయూ వరంగల్ అర్బన్ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ మాట్లాడుతూ.. ఇటీవల మున్సిపల్ అధికారులను విధుల నుంచి బహిష్కరించడం సరైంది కాదన్నారు. కౌన్సిల్ ఏర్పాటు చేసి అధికారులను తిరిగి వెనక్కి తీసుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు యాదానాయక్, జి.వెంకట్ పాల్గొన్నారు.

షరతులు లేకుండా ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

- కల్లు గీత కార్మిక సంఘం డిమాండ్

నవతెలంగాణ బ్యూరో -హైదరాబాద్

ప్రమాదవశాత్తు మరణించిన కల్లుగీత కార్మికుల కుటుంబాలకు, శాశ్వత వికలాంగులుగా మారిని వారికి ఎలాంటి షరతులు లేకుండా ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఆసరా పింఛన్లు పొందే వారికి ఎక్స్‌గ్రేషియా చెల్లించబోమంటూ ప్రభుత్వం ప్రకటించడం సమంజసం కాదని తెలిపింది. ఈ మేరకు ఆదివారం సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యంవి రమణ ఒక ప్రకటన విడుదల చేశారు. వృత్తిలో ప్రమాదవశాత్తు మరణించిన వారికి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఆసరా పింఛన్లు పొందేవారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించకూడదంటూ నిబంధనలో పొందుపర్చిందన్నారు. వృత్తి చేసే వారికి పెన్షన్ సౌకర్య కల్పించేందుకు ఈ ఏడాది మార్చిలో జీవో నెంబర్ 53ను విడుదల చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ జీవో ప్రకారమే కల్లుగీత వృత్తిదారులందరికీ పెన్షన్ సౌకర్యం కల్పించేలా నిబంధనలో మార్పులు చేయాలని కోరారు.

రేపు మహిళా కూలీల రాష్ట్ర సదస్సు

- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో 29న (మంగళవారం) మహిళా కూలీల రాష్ట్ర సదస్సును సూర్యాపేట జిల్లా కోదాడలో నిర్వహించనున్నట్టు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు తెలిపారు. రాష్ట్రం నలుమూలల నుంచి మహిళా ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొని విజయవంతం చేయాలని ఆదివారం విజ్ఞప్తి చేశారు. మహిళా కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమాన పనికి సమాన వేతనం, పని ప్రదేశాల్లో వివక్ష, లైంగిక వేధింపులు, ప్రజా పంపిణీ వ్యవస్థ, ఆహార భద్రత చట్టం, ఒంటరి మహిళలకు ఇతర అన్ని రకాల పింఛన్లను రూ. 3000 పెంచి ఇవ్వాలని కోరారు. సాగు భూములు ఈ సమస్యలన్నింటిపై చర్చించి తీర్మాణాలు చేసి భవిష్యత్ పోరాటాలకు పిలుపు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ సదస్సులో సంఘం అఖిల భారత కార్యదర్శి ఎ.విజయరాఘవన్, ఉపాధ్యక్షులు బి.వెంకట్, జి.నాగయ్య, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి హైమావతి, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.రమ, కోదాడ ఎమ్మెల్యే ఉత్తం పద్మావతి, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి తదితరులు పాల్గొంటారని చెప్పారు.

గురుకుల పీజీటీ భాషాపండితుల పరీక్ష ప్రశాంతం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఆదివారం గురుకుల భాషాపండితులకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) నిర్వహించిన రాతపరీక్ష ప్రశాంతంగా జరిగింది. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఏఈఈ) 463 పోస్టులకు, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ బాయిలర్స్ నాలుగు పోస్టులకు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ ఏడు పోస్టులకు కలిపి 75,546 మంది దరఖాస్తు చేసుకున్నారు. పీజీటీ భాషా పండితులు (హిందీ, ఉర్దూ, తెలుగు) 408 పోస్టులకు 2,250 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. ఆదివారం జరిగిన రాతపరీక్షలకు ఏఈఈ, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ బాయిలర్స్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టులకు 64.29 శాతం మంది, పీజీటీ భాషాపండితుల పోస్టుల రాతపరీక్షకు 87.51 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఎ వాణీప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఏఈఈ (సివిల్, మెకానికల్ కామన్ పేపర్) అభ్యర్థులకు, పీజీటీ ఇంగ్లీష్ అభ్యర్థులకు రాతపరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. ఏఈఈకి 44,483 మంది, పీజీటీ ఇంగ్లీష్‌కు 2,900 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని తెలిపారు.

నేడు ఇంగ్లీష్ అభ్యర్థులకు రాతపరీక్ష

పీఆర్ ఈఈ రఘువీరారెడ్డిని సస్పెండ్ చేయాలి

- ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల అసోసియేషన్ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

జగిత్యాల జిల్లా వెలగటూరు మండల పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజినీర్ శ్రీకాంత్ ఆత్మహత్యకు కారణమైన ఈఈ రఘువీరారెడ్డిని సస్పెండ్ చేయాలని తెలంగాణ పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ అసోసియేషన్ డిమాండ్ చేసింది. శ్రీకాంత్ ఆత్మహ త్యకు ఈఈనే కారణమని విమర్శించింది. ఆదివారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ అసోసియేషన్ అధ్యక్షులు తల్క అంజయ్య, ప్రధాన కార్యదర్శి కొరమోని బాలచందర్ విలేకర్లతో మాట్లాడారు. ఈఈ రఘువీరారెడ్డి వేధింపుల మూలంగానే ఎఈ శ్రీకాంత్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఆరోపించారు. ఈఈ వెంటనే అరెస్ట్ చేసి, సర్వీసు నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. డబ్బులు వసూలు చేసి ఇవ్వాలంటూ తరచూ శ్రీకాంత్‌పై ఈఈ రఘువీరారెడ్డి ఒత్తిడి తెచ్చేవారని విమర్శించారు. ఇందుకు తిరస్కరించిన నేపథ్యంలో కులం పేరుతో తిట్టడం, దూషించడం చేసేవారని ఆరోపించారు. మూడు నెలల క్రితమే శ్రీకాంత్‌కు పెండ్లి అయిందన్నారు. ఉపాధ్యక్షులు వైబి కృష్ణారావు, కొడాలి నాగేశ్వర్‌రావు, పి.అశోక్, కార్యవర్గ సభ్యులు రమావత్ మంగూలాల్, పి దాసయ్య పాల్గొన్నారు.

వెంటనే చర్యలు తీసుకోవాలి:శ్యామ్‌సుందర్

అసిస్టెంట్ ఇంజినీర్ శ్రీకాంత్ ఆత్మహత్యకు కారణమైన ఈఈ రఘువీరారెడ్డిపై వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ సివిల్ ఇంజినీర్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు కె శ్యామ్‌సుందర్ డిమాండ్ చేశారు. శాఖాపరమైన చర్యలతోపాటు క్రిమినల్ కేసు పెట్టాలని సూచించారు. తెలివైన యువకుడు శ్రీకాంత్ ఆత్మహత్య మూలంగా అతని కుటుంబం సంక్షోభంలో పడిందన్నారు. ఆయన భార్యకు ఉన్నతస్థాయి ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వాల వైఫల్యం వల్లే వైకల్య జననాలు

పేద కుటుంబాల్లోనే ఎక్కువ

- పోషకాహార లోపమే ప్రధాన కారణం: ఎన్‌పీఆర్‌డీ బహిరంగ సభలో జూలకంటి రంగారెడ్డి
- ఇప్పుడిస్తున్న పింఛన్ సరిపోదు: ఎన్‌పీఆర్‌డీ ఆలిండియా ఉపాధ్యక్షుడు నాగరాజు



మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

నవతెలంగాణ-సంగారెడ్డి ప్రతినిధి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్లే వైకల్య జననాలు పెరుగుతున్నాయని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. అందరికీ విద్య, వైద్యం, పౌష్టికాహారం, స్వచ్ఛమైన నీరు ఉంటే వైకల్యంతో పుట్టుకలు ఉండవని అన్నారు. రెండు రోజులపాటు జరగనున్న వికలాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర ద్వితీయ మహాసభ ఆదివారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో జూలకంటి మాట్లాడుతూ.. వైకల్యానికి పూర్వజన్మ కర్మలు, దేవుండ్లు, పాపాలు కారణం కాదని, 98శాతం వికలాంగులు పేద కుటుంబాల నుంచే రావడాన్ని గమనించాలని ఈ సందర్భంగా సూచించారు. పేదలందరికీ పౌష్టికాహారం, మెరుగైన వైద్య సదుపాయాలు కల్పిస్తే అంగవైకల్యంతో పుట్టే శిశువుల సంఖ్య తగ్గుతుందని అన్నారు. దేశంలో 2.5కోట్లు, రాష్ట్రంలో 10లక్షల 50వేల మంది వికలాంగులు ఉన్నారని, వీరంతా ఏకమై పోరాడి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. దేశంలో ఇప్పటికీ 40శాతం జనాభాకు అక్షర జ్ఞానం లేదని, విద్య, వైద్యం అందుబాటులో లేవని అన్నారు. సీఎం, మంత్రులు తమ జీతాలు పెంచుకున్నారు కానీ వికలాంగులకు పింఛన్లు పెంచేందుకు మాత్రం ఆలోచించడం లేదని విమర్శించారు. లక్షల కోట్ల బడ్జెట్లు ప్రవేశపెడుతున్న ప్రభుత్వాలకు వికలాంగులకు కేటాయింపులు చేసేందుకు మాత్రం మనసు రావటం లేదన్నారు. వికలాంగుల న్యాయమైన సమస్యలపై జరిగే పోరాటాలకు తమ మద్దతు ఉంటుందని చెప్పారు. గత పాలకుల విధానాల వల్ల దేశంలో పేదరికం ఉందని, రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారన్న మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు ఆత్మహత్యలు మరింత పెరిగాయన్న విషయాన్ని గుర్తించాలన్నారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోనే అధికంగా రైతు ఆత్మహత్యలు నమోదవుతున్నాయని, అక్కడి రైతులు తమ ఆందోళనలను ఉధృతం చేస్తున్నారని తెలిపారు.

వికలాంగులకు ప్రభుత్వాలు ఇప్పుడిస్తున్న పింఛన్ ఏ మాత్రం సరిపోవడం లేదని, దాని పెంపు కోసం దేశ వ్యాప్త ఉద్యమం చేస్తామని ఎన్‌పీఆర్‌డీ ఆలిండియా ఉపాధ్యక్షుడు నాగరాజు అన్నారు. తమ హక్కుల కోసం వికలాంగులు ప్రభుత్వాలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. వికలాంగులను అవమానించినా, దాడులు, లైగింక వేధింపులకు గురిచేసినా క్రిమినల్ కేసులు పెట్టేందుకు ఆర్‌పీడీ యాక్ట్ 2016 రక్షణగా ఉందన్నారు. గ్రామపంచాయతీల నిధుల్లో 5శాతం వికలాంగుల కోసం ఖర్చు చేయాలని చట్టంలో ఉందన్నారు. ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్షుడు గోరెంకల నర్సింహ మాట్లాడుతూ.. గతంలో 40శాతం వైకల్యం ఉంటే సంక్షేమ పథకాలకు వికలాంగులు అర్హులయ్యేవారని, కేసీఆర్ ప్రభుత్వం కనీస వైకల్యాన్ని 50శాతానికి పెంచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛన్ ఇవ్వాల్సి ఉండగా 20వ తేదీ తర్వాత, ఒక్కోసారి రెండు నెలలకోసారి ఇస్తున్నారన్నారు. వికలాంగులకు చట్టం ద్వారా సక్రమించిన అన్ని హక్కులను ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వికలాంగులకు ష్యూరిటీ లేకుండా సబ్సిడీ రుణాలు అందజేయాలని కోరారు. ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షుడు అడివయ్య, గౌరవాధ్యక్షుడు మాణిక్యం పాల్గొన్నారు.

నవతెలంగాణ దర్వాజ
హైదరాబాద్
సోమవారం 28-8 -2017 4

సాహిత్యవార్తలు

ఆకాశవాణి సాహిత్యసేవపై సెమినార్

భాషా సాహిత్యాలకు ఆకాశవాణి చేసిన కృషి అపూర్వం... అపురూపం. దాశరథి, దేవులపల్లి కృష్ణశాస్త్రి, మునిమాణిక్యం, స్థానం నరసింహా రావు, గోపిచంద్, బుచ్చిబాబు, రావూరి భరద్వాజ... ఇలా చెప్పు కుంటే ఎన్ని పేర్లు...వీరందరూ సాహిత్యాన్ని పరిపుష్టం చేసినవారే. ఈవిధంగా ఆకాశవాణి భాషా సాహిత్యాలకు చేసిన కృషిని స్మరించుకుంటూ కేంద్ర సాహిత్య అకాడెమీ, ఆకాశవాణి, భాషా సాంస్కృతిక శాఖ సంయుక్తంగా ఈ నెల 28, 29 తేదీలలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహిస్తుంది. ఆకాశవాణిలో పనిచేసిన సాహితీ ప్రముఖులు, ఆకాశవాణితో అనుబంధం ఉన్న ప్రముఖులు ప్రసంగిచనున్నారు.

◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆

ఆశారాజు, సుధామల కవితా పఠనం

కేంద్ర సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 28న ఆశారాజు, 29న సుధామ కవితా పఠనం కార్యక్రమాలు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరుగుతాయి. ఈ రెండు రోజుల్లో సాయంత్రం నాలుగు గంటలకు అకాడమీ నిర్వహించే 'కవిసంధ్య' కార్యక్రమాల్లో ఈ కవులిద్దరూ తమ కవితా జీవితాన్ని గురించి చెబుతారు, ఆ తర్వాత కవిత్వం వినిపిస్తారు.

◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆

కవితలకు ఆహ్వానం

గరగపర్రు – వెలిని నిరసిస్తూ 'పోరు గరగపర్రు' కవితా సంకలనం తీసుకురానున్నాం. ఇందుకోసం కవుల నుంచి 20 పంక్తులకు మించని కవితలను ఆహ్వానిస్తున్నాం. ఆగస్టు 30లోపు కవితలను ఖజూఋతీఖజవవస్త్రఋఖఅశ్రీ.ఔశీఎ ఈమెయిల్‌కు ఓపెన్ ఫైలు, పిడిఎఫ్ ఫైల్ పంపాలని మనవి. మరిన్ని వివరాలకు కవి, సంకలనకర్త నేలపూరి రత్నాజీని 9494423787, 9848187416 నంబర్లలో సంప్రదించవచ్చు.


– బహుజన రచయితల వేదిక

◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆

డా.సి.నారాయణ రెడ్డి సాహిత్యంపై జాతీయ సదస్సు

ఉస్మానియా విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల సందర్భంగా తెలుగు శాఖ ఆగస్టు 30, 31 తేదీలలో ఆర్ట్స్ కళాశాల రూమ్ నెం.51లో డా.సి.నారాయణ రెడ్డి సాహిత్యంపై జాతీయ సదస్సు నిర్వహిస్తుంది. ప్రారంభ సమావేశంలో ముఖ్య అతిథిగా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య రామచంద్రం, విశిష్ట అతిథిగా డా.ఎన్. గోపి, ఆచార్య టి.పాపిరెడ్డి, ఆచార్య ఎస్వీ సత్యనారాయణ, ముగింపు సభలో డా.నందిని సిధారెడ్డి గార్లు పాల్గొంటారు.

డా.ఎండ్లూరి సుధాకర్, ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి, ఆచార్య బన్న అయిలయ్య, డా.జి.బాల శ్రీనివాసమూర్తి, డా.సి.కాసీం, డా.ఎస్.రఘు, ఆచార్య వెలుదండ నిత్యానందరావు, డా.పిల్లల మర్రి రాములు, డా.సాగి కమలాకర శర్మ, డా.ఎన్.రజని, డా.పి.వారిజా రాణి, డా.కె.లావణ్య, ఆచార్య మాడభూషి సంపత్ కుమార్, ఆచార్య శరత్ జ్యోత్స్నారాణి, ఆచార్య మేడిపల్లి రవికుమార్, ఆచార్య కొలకలూరి మధుజ్యోతి, ఆచార్య బి.విశ్వనాథ్ తదితర సాహితీవేత్తలు పత్ర సమర్పణ చేస్తారని సదస్సు సంచాలకులు, తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య సూర్యా ధనంజయ్ తెలిపారు.




డాక్టర్ ధేనువకొండ శ్రీరామమూర్తి గారంటే నాకు "ఆయతనమ్" కథ గుర్తుకు వస్తుంది. శంకరాభరణం శంకర శాస్త్రి లాంటి అద్భుతమైన వ్యక్తిగా ఈ కథలోని, చయనులు మనసులో ఎప్పటికీ గుర్తుండిపోతాడు. తాను విశ్వసించిన సంస్కృతీ సంప్రదాయాలకే అంకితమైన చయనులు విశ్వనాథ వారి ధర్మారావు కంటే ఉన్నతుడిగా గోచరిస్తాడు. క్షీణించిపోతున్న సాంస్కృతిక అస్తిత్వ అవశేషాన్ని కాపాడుకోవాలనే సందేశం మనకు అందులో కనిపిస్తుంది. ఈ ఒక్క కథ చాలు. ఆయన కథకుడిగా చిరస్థాయినందుకోవడానికి. ఆయన కవిత్వం కూడా నాకిష్టమే. ఆయనా వచన రచనల అభిమానిగా, నేను కథకుడైన ధేనువకొండను ఎక్కువగా ఇష్టపడతాను.

కథకుడిగా ధేనువకొండ శ్రీరామమూర్తి

కొంత మంది అదృష్టవంతులకు బాల్యం ఒక తీయని జ్ఞాపకాల దొంతర. అందులో డాక్టరుగారొకరు. ఆయన తన ఇంటిని, పరిసరాలను, చుట్టు పక్కల వారిని, ఊరిని, ఊరు వాళ్ళను, ఊరితో సంబంధమున్న ఎవరినీ ఆయన మరిచిపోలేదు. హైదరాబాద్ లో స్థిరపడినా ఊరితో ఉన్న అనుబంధాన్ని పదిలంగా కాపాడుకున్నారు. అవన్నీ ఇంకా ఇంకా తాజాగా వున్నాయనడానికి నిదర్శనం వారి కథల్లోనే కనిపిస్తుంది. "కోర్టు సెంటర్, ఐలాండ్ విల్లా, రంగారాయుడు చెరువు" కథల ఇతివృత్తాలకు కేంద్ర స్థానం ఒంగోలు. తొలినాళ్ళలో 'కోర్టు సెంటర్' ఎలా ఉందో చెబుతూ అందులోని లాయర్లు, వారిలో కొందరి కుత్సిత మనస్తత్వం, జడ్జీల్ని బ్లాక్ మెయిల్ చేసే విధానం ఎలా వుందో చూపించారు. మారిపోతున్న ఒంగోలు టోపోగ్రఫీని చెప్పిన కథ "ఐలాండ్ విల్లా". సరళీకృత ఆర్థిక విధానాల ప్రభావం పట్టణ ప్రజల జీవితాల మీద, ప్రాంతీయ స్వరూపాల మీద చేస్తున్న దాడిని అర్థం చేసుకోవడానికి ఈ కథ తోడ్పడుతుంది. స్థానిక వాస్తవికత లోంచి లోకాన్ని అర్థం చేసుకోవాల్సిన అవసరాన్ని గుర్తుకు తెచ్చే కథ "రంగారాయుడు చెరువు". పట్టణంలో నీటిని ఇంటింటికి అందించిన తొలి రోజులు, నీటి కరువు, దాని నుండి బయట పడటానికి చేసిన ప్రయత్నాల్ని ఇందులో చూడవచ్చు. సేవా భావంతో నీళ్ళను అందించిన అప్పయ్య, ఇప్పుడు అతని మనవడు మోహన్ మినరల్ వాటర్ దిగ్గజం. నీటి అమ్మకం ఇతని స్వభావం. అతనే ఈ కథ చెప్పడం ఒక వైచిత్రి. ముఖ్యంగా డాక్టర్ గారి కథల్లోని ప్రాంతం కానీ, పాత్రధారులు కానీ అటు ఒంగోలుకు, ఇటు హైదరాబాద్‌కు చెందిన వారై వుంటారు. ఈ విషయాన్ని "చిగురించని శిశిరం, జలయజ్ఞ సమిధలు, క్రౌంచ వియోగం, మోహ తిమిరం, నల్లబ్బి, పశుర్వేత్తి" కథలలో గమనించవచ్చు.

ఎవరి సంస్కృతిని వాళ్ళే కాపాడుకోవాలనుకుకోవడంలో తప్పు లేదు. చెదిరిపోతున్న గతం, విచ్ఛిన్నమవుతున్న సంప్రదాయిక జీవనరీతి పట్ల ఒక బెంగ వుండటం సహజం. ఆధునికత బ్రాహ్మణీయ కులాల వారి జీవన దృక్పథాన్ని ఏ విధంగా మార్చి వేసిందో "ఆయతనమ్", "యజ్ఞోపవితం" కథల్లో వివరించారు. అలాగే సంస్కృతి, సంప్రదాయాల పట్ల వాటిని సంరక్షించే పండితుల పట్ల డాక్టరు గారికి వల్లమాలిన అభిమానం. అంతకు మించిన ఆరాధనాభావం కూడా కనిపిస్తుంది. "జలయజ్ఞ సమిధలు' లో గోపయ్య అనే గోపాల చక్రవర్తి చిన్నతనంలోనే కాశీ వెళ్ళి, కాశీ విద్యా పీఠంలో అధ్యయనం చేసి వచ్చిన పండితుడు, లోక జ్ఞాని, ఆయన గ్రహణ శక్తి అమోఘం అని వివరిస్తూ, ఆయన ప్రభావం తమ అందరి మీద వుండేదని చెబుతారు. అంతటి పండితుడి సంసార జీవనంలో వున్న అపశ్రుతుల గురించి వివరించేటప్పుడు అవేదనను వెలిబుచ్చుతాడు. "సప్తమాధిపతి" లో నరసింహశాస్త్రి గారు ప్రభుదర్పంతో ఏమైనా చేయగల నిగ్రహానుగ్రహ సమర్థుడు. ఆయన మాటల మీదకు జనానికి అపార విశ్వాసం వున్న తీరును బలంగా చిత్రిస్తారు. "క్రౌంచ వియోగం" కథలో శేషయ్య తాత గొప్పతనం, ఆయన భోజన ప్రియత్వం, సంభాషణా చాతుర్యం, అన్యోన్య దాంపత్యం గురించి వివరిస్తారు. "పశుర్వేత్తి" లో సంగీతజ్ఞులైన సుబ్బారావు పంతులు గారి గొప్పదనం, నిరాడంబరుడిగా కనిపించే శేషయ్యలోని ప్రతిభ, మృదంగ విద్వాంసుడైన సూరి అహంభావాన్ని చక్కగా చిత్రీకరించారు.



"మఖమల్ గులాబీ, దక్షిణ పొలం" కథలు పైకి చూడటానికి ప్రాకృతిక సహజాతాలకీ, నైతిక విలువలకీ మధ్య యేర్పడ్డ సంఘర్షణని ప్రధానం చేసుకొని రాసినట్లు కనిపించినా... మనిషి జీవన పరిపూర్ణతని, ఆత్మ శాంతిని సాధించడానికి అవసరమైన తాత్త్విక చింతనని ఎంతో లోతుగా విశ్లేషించారు. అలాగే ప్రేమకీ, కామానికీ ఉన్న భేదాన్ని వివరిస్తూ రాసిన రెండు కథలలో "పశ్యం" ఉదాత్తమైన ప్రేమకు నిదర్శనం కాగా, "మోహ తిమిరం" వివాహేతర సంబంధాల వల్ల ఒనగూడే అనర్థాలను తెలియజేస్తుంది. కొందరు మానసిక ఒత్తిడిని లోనయి బాలన్స్ కోల్పోవడం, దాని ప్రభావం వారి జీవన సరళిపై పడడం కనిపిస్తుంది. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పని చేసే వారు కలిసి కాపురం చేసేటప్పుడు? పిల్లలు కలిగేదెప్పుడు? డబ్బు, కెరీర్‌లో మునిగి పోయి వారు కోల్పోతున్నదేమిటో వారికే తెలియదు. చివరకు బామ్మ గారు పూనుకొని వారి దాంపత్యాన్ని చక్కదిద్దడం "డబ్ల్యు డబ్ల్యు డబ్ల్యు. బామ్మ. కామ్" లో చూడవచ్చు.



ఒక మానవీయ దృక్పథం, ధేనువకొండ వ్యక్తిత్వంలో ప్రవర్తనలో అడుగడుగునా కనబడుతుంది. అదీ ఆయన కథల్లో ప్రతిఫలిస్తుంది. డాక్టర్ గా ధేనువకొండ శ్రీరామమూర్తి సెరిబ్రల్ పాల్సీ నిపుణులు. "చిగురించిన శిశిరం" లో కనిపించే డాక్టర్ రావు ఎవరో కాదు, రచయితే. సెరిబ్రల్ పాల్సీ రావడానికి గల కారణాలను, అలాంటి పిల్లల సంరక్షణను, వారి తల్లిదండ్రుల సంఘర్షణను ఆ కథలో అద్భుతంగా చిత్రీకరించారు. చిన్న తనంలోనే కళ్లు పోగొట్టుకున్న బుజ్జమ్మను పెళ్ళి చేసుకున్న శేషయ్యకు వైద్యమంటే మహా పిచ్చి. శ్రీశైలం అడవుల్లో చెంచులతో తిరిగి ఆకులఅలములు సేకరించేవాడు. ఎలాగైనా గోసాయి చిట్కాలతో బుజ్జమ్మ కళ్ళకు తిరిగి చూపు తెప్పించాలని చేసే విఫలయత్నాల గురించి ఈ కథలు వివరిస్తాడు.

సంగీత ప్రపంచంలో నెలకొని ఉన్న రెండు విభిన్న ధోరణులను పరిచయం చేసే కథలు వైవిధ్యభరితంగా వున్నాయి. తన జీవన విధానంలో సంగీతాన్ని ఒక భాగంగా చేసుకున్న నల్లబ్బి నిస్వార్థ, నిరాడంబర జీవితాన్ని తెలిపే కథ ఒకటి కాగా– శాస్త్రీయ సంగీత ప్రపంచంలోని పోటీ, పండిత స్పర్ధలు ఎలా వుంటాయో పరిచయం చేసే కథ మరొకటి. బాబ్రీ మసీదు విధ్వంసంతో ముస్లింలలో ఏర్పడిన అభద్రతా భావాన్ని "బడేబీ" కథలో చూపించిన విధానం ఆకట్టుకుంటోంది. స్కూల్ పిల్లల బాగు కోసం జీవితాన్ని వెళ్ల దీసిన "మదర్ బీ", మత సామరస్యానికి నిలువెత్తు రూపంగా నిలిచిన "బడేబీ" ఆదర్శమూర్తులుగా నిలిచి పోతారు.

ధేనువకొండ కథల్లో ఎక్కువ భాగం నోస్టాల్జియానే. వైయక్తిక జ్ఞాపకాలు, సంఘటనలను నోస్టాల్జియాకు ముడిపెడూ, ఏదో ఒక జీవన సత్యాన్ని ఆవిష్కరించడానికి ప్రతి కథలోను ధేనువకొండ ప్రయత్నించారు. అందుకే చాలా వరకు ఈ కథలు రచయిత ఆత్మకథనాలుగా రూపొందాయి. ధేనువకొండ తన కథలన్నింటినీ ఉద్దేశపూర్వకంగానే ఉత్తమ పురుష పద్ధతిని ఎంపిక చేసుకున్నారు. అందువల్ల అందులో చోటు చేసుకున్న మౌఖిక కథా లక్షణాలు పాఠకుడ్ని ఆకర్షించగలిగాయి.

ధేనువకొండ కథలలో అవసరమైనంత వరకే ఆంగ్ల పదాలను ఉపయోగిస్తారు. ఎక్కువగా సంస్కృత పదాలను ఉపయోగించి తెలుగు భాషకు సరికొత్త అందాన్ని తీసుకురావడమే ఆయన ప్రత్యేకత. తొలితరం పండిత కవుల కథకుల తర్వాత అలాంటి శైలి మళ్ళీ ధేనువకొండలోనే కనిపిస్తుంది. ధేనువకొండ ప్రధానంగా కవి కావడం వల్ల కవిత్వ పరిభాష అనుకోకుండా కథల్లో ఇమిడిపోవడాన్ని గమనించవచ్చు. కొత్త కొత్త పదబంధాలు, వాక్యాలు వాక్యాలుగా విస్తరించుకున్న వర్ణనలతో సరికొత్త శైలిని సంతరించుకున్న ధేనువకొండ కథలు పాఠకుడ్ని ఆసక్తికరంగా చదివింపచేస్తాయి. కథ, కవిత్వం, నవలా ప్రక్రియల్లో విశేష కృషి చేసిన డాక్టర్ ధేనువకొండ ఈ నెల 17వ తేదీన కన్నుమూశారు. వారి రచనలు, జ్ఞాపకాలే ఇప్పుడు మనకు మిగిలాయి. కవిగా ప్రయాణాన్ని ఆరంభించి వచన రచనల్లోకి విస్తరించిన వారి సాహితీ వ్యాసంగం తెలుగు సాహిత్యచరిత్రలో నిలిచిపోతుంది.

– కె.పి. అశోక్ కుమార్,
97000 00948

ఒంటరి ఆకాశం



సాహితీసభల్లో
నిశ్శబ్ద శ్రోత
కవి సమూహాల్లో
మెరిసే ముత్యం

లాల్చీజేబుల్లోని
కవిత్వం పూమొగ్గల్ని
పావురాల్లా ఎగరేసే
పాగల్ షాయర్

జాన్ జిగర్
చార్మినార్ షాన్‌లో
ఉమ్రావ్‌జాన్ పాటకు
పిచ్చి ఫిదాయిష్

రంజాన్ వేళల్లో
కవిత్వం నెలవంకను పిండి
మొహబత్, ఖుషీల
అత్తర్లద్దుతాడు

దసరాపండుగలో
జంబాకు దుస్సి
అలాయ్ బలాయ్‌ల
కానుకలిస్తాడు

అతనిప్పుడు
నిన్నటిలా లేడు
పాదాలు పట్టు తప్పి
నడకను నిరాకరిస్తున్నాయి

ఇంట్లో తిరుగాలన్నా
ఇల్లాలు ఆసరా కావాలి
గేటు దాటాలన్నా
నాల్గు కాళ్ళ వాకర్‌కావాలి

సుదూర తీరాల్ని
సులువుగా చేరిన పాదాలవి
సుమనస్సుల చెలిమిని
ఏకం చేసిన అడుగులవి

ఇప్పుడు
బెడ్ రెస్టు కావాలంటూ
అవస్తలు పెడుతున్నాయి

అయినా...
కాలాన్ని విల్లులా వంచి
కవిత్వం సంధిస్తున్నాడు

కవులతో
కలిసి నడువలేని సంధ్యల్ని
అక్షరాలపూదోటలు చేస్తున్నాడు

గతం జ్ఞాపకాల్ని
సీతాకోక చిలుకలు చేస్తూ
రేపట్ని కలగంటున్నాడు

ఇప్పుడతని
వాకర్‌ను ముట్టుకుంటే
కవిత్వం పట్టుకున్నట్టుంది

ఇప్పుడతని ముందు
కూర్చుని మాట్లాడితే
అంబుల పొది ముందున్నట్టుంది

పరమాత్మ,
9848552512

ఉద్యమాల కవిత్వశిఖరం మఖ్దూం


తెలంగాణ గడ్డపై విప్లవవీరుడు, ఉద్యమాలకు ఊపిరి, నిరంకుశపాలనపై గర్జించిన తుపాకీ తూటా, ఫాసిజంపై ఎత్తిన కత్తి, మానవవిలువలను చాటి చెప్పిన మల్లెల పరిమళం, ప్రేమభావనకు పట్టం కట్టిన సంగీత తరంగం, ప్రేమ శ్రమల విజయం కోసం అహర్నిశలు తపించిన కవిత్వశిఖరం మఖ్దూం.

కవిత్వమూ ఉద్యమమూ కలగలిసిన సంగమం ఆయన జీవితం. ప్రజల్లో చైతన్యం సృష్టించడానికి ఒకచేత్తో కవిత్వం రాస్తూ, మరోవైపు ప్రజా ఉద్యమాలకు సారథ్యం వహిస్తూ జాతిని జాగృతం చేసిన బహుముఖ వ్యక్తిత్వం ఆయనది. చెగువెర, ప్లాబోనెరుడాల గురించి మనం చదివాం. ఆ కోవకు చెందిన అపురూపమైన వ్యక్తి మఖ్దూం.

మఖ్దూం నిరంకుశ రాజరికవ్యవస్థను ప్రశ్నించాడు. హైదరాబాదులో కమ్యునిస్టు ఉద్యమానికి పునాదులు వేశాడు. అప్పటి హైదరాబాదు సంస్థానాన్ని పాలించిన నిజామ్‌కు వ్యతిరేకంగా సాయుధపోరాటంలో పాల్గొన్నాడు. తెలంగాణ గడ్డను కీర్తిస్తూ ఆయన రాసిన "తెలంగాణ" గేయంలో రాజరికంపై తీవ్రమైన నిరసన స్పష్టంగా కనబడుతుంది.

నేడు బాబరు వారసులంటూ ముస్లిములపై ఫాసిస్టు శక్తులు దాడులు చేస్తున్న నేపథ్యంలో మఖ్దూం వంటి విప్లవకవుల చరిత్రలు ప్రజల ముందుకు రావలసిన అవసరం ఉంది. నిజామ్ వారసుడిగా అనల్ మలిక్ అన్న నినాదాన్ని మఖ్దూం వంటి వారు సమర్ధించలేదు. షోయబుల్లాఖాన్, తుర్రెబాజ్ ఖాన్, బందగీ తదితరలు నిరంకుశ పరిపాలనపై తిరగబడ్డారు. ఈ వాస్తవాలు ప్రజల ముందుకు రావాలి. మతపరంగా ప్రజల్లో చిచ్చుపెట్టడానికి ప్రయత్నిస్తున్న శక్తులను అడ్డుకోవాలంటే ప్రజలంతా ఐక్యం కావాలి. ఫాసిజాన్ని ఎదుర్కోడానికి, మఖ్దూం వంటి వారు చూపించిన పోరాటపటిమ అందరికీ తెలియాలి.

ఈ నేపథ్యంలో వాహెద్ రాసిన ఈ పుస్తకం ఎంతో ముఖ్య మైనది. మఖ్దూం జీవితాన్ని, కవిత్వాన్ని పాఠకులకు పరిచయం చేయడానికి ఆయన పడిన కష్టం పుస్తకంలో స్పష్టంగా కనిపిస్తుంది. ప్రతి అంశాన్ని పరిశోధించి విలువైన సమాచారాన్ని అందించాడు.



షాయరె తెలంగాణ మఖ్దూం మొహియుద్దీన్ (జీవితం–కవిత్వం)– రచన: వాహెద్, పేజీలు: 488, వెల: రూ. 300, ప్రతులకు: నవతెలంగాణ పుస్తక కేంద్రాలు

కవిసంగమంలో "ఉర్దూ కవిత్వ నజరాన" శీర్షికన మఖ్దూం కవిత్వాన్ని జీవితాన్ని వారం వారం పరిచయం చేశాడు. ప్రతి వారం పరిశోధనాత్మకంగా జీవితాన్ని గురించి రాయడం, కవిత్వాన్ని విశ్లేషించడం, అనువదిం చడం సాధారణమైన పని కాదు. యూని వర్శిటీలు పూనుకుని చేయవలసిన పని ఇది. వాహద్ ఒంటిచేత్తో మఖ్దూం జీవిత విశేషాల సమాచారం సేకరించి ఈ పుస్తకంలో పొందు పరచడం మాత్రమే కాదు, మఖ్దూం కవితలను అనువదించి, విశ్లేషించి ఒక గొప్ప విప్లవకవి జీవితాన్ని సమగ్రంగా పాఠకులకు అందించాడు.

తెలంగాణ సాయుధపోరాటానికి పిలుపునిచ్చిన వాడు మఖ్దూం. తెలంగాణ గడ్డపై అపారప్రేమ కలిగిన వాడు. తెలంగాణ సాధిం చుకున్న సందర్భంలో తెలంగాణ కొత్త ముఖచిత్రంపై తెలంగాణా సాయుధ పోరాట వీరుడు, అద్భుతమైన కవి మఖ్దూంను సాధికారికంగా పరిచయం చేసిన వాహెద్‌ను ఈ సందర్భంగా అభినందిస్తున్నాను.

– కవి యాకూబ్, 9849156588

కవులెక్కడుంటారు...

నేను బయటకెళ్తున్నాను
వర్షం వచ్చే లాగుంది ఇప్పుడెక్కడికి
కొందరు మనుషుల్ని కలవడానికి
ఇక్కడుంది మనుషులు కారా
ఇక్కడుందీ మనుషులే
మరి..!
కానీ అక్కడున్న మనుషులు
తడి తడిగా వుంటారు

అంటే ..
అక్కడున్న మనుషులు
కవిత్వాన్ని శ్వాసిస్తారు
కవిత్వాన్ని ప్రేమిస్తారు
కవిత్వమై బతుకుతారు
ఎక్కడుంటారు వాళ్లు
కవిత్వం ఎక్కడుంటే అక్కడ...!

– కె.విల్సన్ రావు, 8985435515

ఆక్షేపణ

ఈ నేల చివరి నుంచి ఆ క్షితిజం వరకు
తనే పరిగెడుతూ చేరుకుంది – ఒంటరిగా
వెనుతిరిగి నన్ను చూసిందో లేదో
వెక్కి వెక్కి ఏడవటం మొదలెట్టింది
ఈ వైపు క్షితిజం పై నన్ను చూసి –
మోసగాడివంటూ ఆక్షేపిస్తూ...!

– డా. రూప్‌కుమార్ డబ్బీకార్,
91778 57389

దర్వాజ పేజీపై మీ అభిప్రాయాలను, సూచనలను, సలహాలను, రచనలను darwajapage@ gmail.com కు పంపించగలరు.
చిరునామా : దర్వాజ, నవతెలంగాణ, ప్లాట్‌నెం. 21/1, అజమాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్– 500020

'సమాజం మారాలన్నా... వివక్ష లేని సమాజం రావాలన్నా... దోపిడీ నశించాలన్నా నాలుగ్గోడల మధ్య కూర్చుంటే జరగదు. నలుగురిలోకి రావాలి. ప్రశ్నించాలి. అప్పడే సమసమాజం సాధించగలం' దీన్ని బలంగా నమ్మారు డాక్టర్ హేమలత. అందుకే డాక్టర్ వృత్తిని కాదనుకుని యాక్టివిస్ట్‌గా మారారు. ఒకప్పుడు గొంతు విప్పడానికే ధైర్యం చేయని ఆమె ఇప్పుడు కార్మికుల గొంతుకయ్యారు. అంచెలంచెలుగా ఎదుగుతూ ప్రస్తుతం సీఐటీయూ అఖిల భారత అధ్యక్షురాలిగా బాధ్యతలు చూస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ అఖిల భారత మహాసభలకు వచ్చిన ఆమెను మానవి పలకరించింది.



నాలుగ్గోడల మధ్య కాదు నలుగురిలోకి వెళితేనే మార్పు...

వర్కింగ్ ఉమెన్ ఎదుర్కొంటున్న సమస్యలు ఎలా ఉన్నాయి?

సమస్యలు చాలానే ఉన్నాయి. అసంఘటిత రంగంలో మహిళల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. వ్యవసాయంలో వచ్చిన సంక్షోభం వల్ల గ్రామాల్లో పనితగ్గిపోయింది. అందరూ పట్టణాలకు వలసలు వస్తున్నారు. ఇక్కడ మహిళ శ్రమకు విలువలేదు. గతంలో ఇంట్లో ఉండే మహిళలు ఇంటి పనులతో పాటు పశువులు మేపడం, అడవికి వెళ్ళి పుల్లలు తేవడం, పిల్లల్ని పెంచడం లాంటి పనులు చేసేవారు. ఈ పనులకు అసలు గుర్తింపే లేదు. ప్రభుత్వం కూడా అలాంటి పనులకే ఇప్పుడు మహిళలను ఉపయోగించి వారి శ్రమను దోచుకుంటుంది. ఉదాహరణకు అంగన్‌వాడీ చూడండి. దేశ వ్యాప్తంగా సుమారు 27 లక్షల మంది ఉన్నారు. అలాగే ఆశావర్కర్లు తొమ్మిదిన్నర లక్షల మంది ఉన్నారు. మిడ్డే మీల్ వర్కర్లుగా 27 లక్షల మంది పని చేస్తున్నారు. నేషనల్ రూరల్‌మిషన్‌లో లక్షల మంది ఉన్నారు. ఇలా సుమారు కోటి మంది వరకు మహిళా కార్మికులు ఉన్నారు. కానీ వీరిని కార్మికులుగా గుర్తించడం లేదు. కొంతమందికి పీస్‌రేట్ సిస్టమ్‌లో వేతనాలు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. ఆశాలకు కేవలం ప్రోత్సాహకాలు మాత్రమే ఇస్తున్నారు. వీరు చేసే వెట్టిచాకిరి చూస్తే ఘోరంగా ఉంటుంది. ఇలాంటి ఎన్నో సమస్యలు మహిళా కార్మికులు ఎదుర్కొంటున్నారు.

మరి వివక్ష ఎలా ఉంది?

కొనసాగుతూనే ఉంది. ఎక్కడైనా ఓ దగ్గర మహిళ సుపీరియర్‌గా ఉంటే మగవాళ్ళు తట్టుకోలేరు. ఆడవాళ్ళ కింద మేం పని చేయాలా? అనే ఫీలింగ్ వస్తుంది. పితృస్వామ్య భావజాలం వల్ల చాలా మంది మహిళలు ఎడ్జస్ట్ అవుతూ బతుకుతున్నారు. చివరకు మహిళలు కూడా ఇలా ఉండటమే కరెక్టని నమ్ముతున్నారు.

మహిళలకు రక్షణ ఎలా ఉందంటారు?

కరువయింది. ఈ మధ్యనే చూశాం చండీగఢ్‌లో ఓ ఐఎఎస్ కూతురు కార్లో వెళుతుంటే కొందరు వెంబడించారు. అప్పుడు ఆ అమ్మాయి ధైర్యంగా ఎదుర్కొంది. ఆమె తండ్రి సపోర్ట్‌తో కేసు కూడా పెట్టింది. కానీ ఎంత దారుణమంటే ఆ నేరస్తులకు బెయిల్ ఇచ్చి విడుదల చేశారు. పైగా రాత్రిపూట అమ్మాయి బయటకు ఎందుకు వెళ్ళాలి? అని అమ్మాయికి నీతులు చెబుతున్నారు. ఓ పైస్థాయి అధికారి కూతురి పరిస్థితే ఇంత దారుణంగా ఉంటే ఇక సామాన్య మహిళల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

మీ ఉద్యమ జీవితంలో ఎప్పుడైనా వివక్షను ఎదుర్కొన్నారా?

లేదు. ఒకే భావాలతో, ఒకే ఆదర్శం కలిగిన వారి మధ్య పని చేస్తున్నాను కాబట్టి అలాంటి సమస్య రాలేదు. పైగా మా నాయకత్వం మహిళలను అభివృద్ధి చేయడానికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నది. అలా అని కేవలం మహిళ కాబట్టే ప్రత్యేకంగా చూస్తారని కాదు. బాధ్యతలు అప్పగించడంలో ఆడా మగ తేడా ఉండదు. కాబట్టే గతంలో ఆంధ్రాలో పుణ్యవతి, ఇప్పుడు కర్నాటకలో వరలక్ష్మి అధ్యక్షులుగా బాధ్యతలు చూశారు.

డాక్టర్‌గా ఉన్న మీరు యాక్టివిస్ట్‌గా ఎలా మారారు?

ఈ నిర్ణయం పూర్తిగా నాదే. ఎంబీబీఎస్ పూర్తయిన తర్వాత కామ్రేడ్ శ్యామ్ సుందర్‌తో పెండ్లి జరిగింది. ఆయన అప్పటికే యూనియన్‌లో పని చేస్తున్నారు. పెండ్లి తర్వాత హైదరాబాద్ వచ్చాను. మొదట నెల్లూరు ప్రజావైద్య శాలలో ట్రెనింగ్ తీసుకుని కొంత కాలం పని చేశా. తర్వాత బందర్‌లో ప్రాక్టీస్ పెట్టాను. ఎమర్జెన్సీ సమయంలో మా ఇంటికి నండూరి, పర్సా సత్యనారాయణ, మోటూరు హనుమంతరావు వచ్చి క్లాసులు పెట్టేవారు. వాటికి నేనూ వెళ్లేదాన్ని. సుందరయ్యగారి పుస్తకాలు బాగా చదివేదాన్ని. ఆయన పుస్తకాలు, విన్న క్లాసులు నన్ను ప్రభావితం చేశాయి. జనంలోకి వెళ్ళి పని చేయాలని అప్పుడే



నిర్ణయించుకున్నాను. నాలుగు గోడల మధ్య కాదు, నలుగురిలోకి వెళితేనే సమసమాజాన్ని సాధించగం అనే అభిప్రాయానికి వచ్చి ప్రాక్టీస్ మానేసి ఉద్యమాల్లోకి వచ్చేశాను.

డాక్టర్ వృత్తిని వదిలి ఇలా ఉద్యమాల్లోకి వచ్చేస్తుంటే ఇంట్లో ఏమీ అనలేదా?

అందరూ నా నిర్ణయాన్ని గౌరవించారు. ఎలాంటి సమస్యా రాలేదు. అప్పుడు అలాంటి నిర్ణయం తీసుకున్నందుకు ఇప్పుడు చాలా తృప్తిగా ఉంది. ఏ లక్ష్యంతో అయితే వచ్చానో దాని కోసం పూర్తి స్థాయిలో పని చేయగలుగుతున్నాను.

మీ చిన్నతనం గురించి చెప్పండి?

నాన్న వైకుంఠరావు. అమ్మ శంకరి. నాన్న సొంత ఊరు శ్రీకాకుళం. ఉద్యోగ రీత్యా ఒరిస్సాలోని బరంపూర్‌లో ఉండేవారు. నేను అక్కడే పుట్టి పెరిగాను. మెడిసిన్ వరకు అక్కడే చదువుకున్నాను. నాన్న ఎప్పుడూ బిజీగా ఉండేవారు. మా చదువులన్నీ అమ్మనే చూసుకునేది. అమ్మకు మేం బాగా చదువుకోవాలని, క్రమశిక్షణతో పెరగాలని ఉండేది. మమ్మల్ని అలాగే పెంచింది.

చిన్నప్పటి మిమ్మల్ని ఇప్పుడు గుర్తు చేసుకుంటే ఎలా అనిపిస్తుంది?

అప్పుడప్పుడు నా మెడిసిన్ ఫ్రెండ్స్ ఫోన్ చేస్తుంటారు. 'నువ్వేనా అది. అప్పుడు అంత సైలెంట్‌గా ఉండేదానివి. ఎవరితో ఒక్క మాట కూడా మాట్లాడేదానివి కాదు ఇప్పుడు ఇలా ఎలా మాట్లాడుతున్నావు?' అని ఆశ్చర్యపోతుంటారు. నిజంగా చిన్నప్పుడు అలాగే ఉండేదాన్ని. ఇల్లు, కాలేజీ తప్ప మరో ప్రపంచం తెలిసేది కాదు. అయితే నేను ఏడో తరగతిలో ఉన్నప్పుడనుకుంటా మొదటిసారి స్కాలర్‌షిప్ వచ్చింది. ఆ డబ్బులతో చెప్పులు లేని వాళ్ళకు కొనివ్వాలనుకున్నాను. ఇంట్లో పిల్లల మధ్య ఈ చర్చ కూడా జరిగింది. అయితే అది ఆచరణ సాధ్యం కాలేదు. కేవలం చర్చలకే పరిమితమయ్యింది. పెండ్లి తర్వాతనే సమాజాన్ని అధ్యయనం చేయగలిగాను. మా అబ్బాయి అరుణ్, కోడలు మమత ఇద్దరూ సీపీయంలో పూర్తికాలం కార్యకర్తలుగా పని చేస్తున్నారు.

ట్రేడ్ యూనియన్‌తో మీ ప్రయాణం?

1993లో ప్రాక్టీస్ పూర్తిగా మానేసి యూనియన్‌లోకి వచ్చేశాను. 1995లో హైదరాబాద్ వచ్చిన తర్వాత అంగన్‌వాడీ యూనియన్ బాధ్యతలు అప్పగించారు. 1998లో ఢిల్లీలో అవసరమని అక్కడకు వెళ్ళాం. అక్కడ అంగన్‌వాడీ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీగా, ప్లానిటేషన్ వర్కర్స్ ప్రెసిడెంట్‌గా పని చేశాను. కొంత కాలం బీడీ వర్కర్స్ ఫెడరేషన్ బాధ్యతలు కూడా చూశాను. అలాగే మత్స్యకార్మిక సంఘం జనరల్ సెక్రటరీగా కూడా బాధ్యతలు చూశాను.

ఇన్నేండ్ల మీ ఉద్యమ జీవితంలో మిమ్మల్ని కదిలించిన సంఘటనలు?

చాలా ఉన్నాయి. అయితే అప్పట్లో అంగన్‌వాడీ టీచర్‌కు 225 రూపాయలు, హెల్పర్‌కు 110 రూపాయలు ఇచ్చేవారు. పైగా సీడీపీఓ, రాజకీయ నాయకులు వీళ్ళను మనుషులుగానే చూసేవారు కాదు. బానిసలకంటే హీనంగా ట్రీట్ చేసేవారు. ఇది నన్ను బాగా కదిలించింది.

నేటి అమ్మాయిలకు మీరిచ్చే సందేశం?

అమ్మాయి, అబ్బాయి సమానం అనే భావన పెరగాలి. పురుషాధిక్య సమాజంపై పోరాటం చేయాలి. మేము అమ్మాయిలం కదా ఏం చేయలేం, తక్కువ అనే భావనను పక్కకు నెట్టెయ్యాలి. సొంత నిర్ణయాలు తీసుకోవాలి. ఏదైనా సాధించగలం అనే నమ్మకం పెరగాలి.

సలీమ

పిల్లల నిద్ర గురించి...

చిన్న పిల్లలకి నిద్ర చాలా ముఖ్యమైనది. మంచి నిద్ర ఆరోగ్యకరమైన ఎదుగుదలకు ఉపయోగపడుతుంది. అలాగే వ్యాధి నిరోధక శక్తి, మేధాశక్తి మీద నిద్ర ప్రభావితం చాలా ఉంటుంది. అందుకే తల్లిదండ్రులు పిల్లల నిద్ర కు సంభందించిన కొన్ని విషయాలు కచ్చితంగా తెలుసుకోవాల్సిందే...!

సమయానుసారంగా...

క్రమబద్ధమైన నిద్ర మంచి ఆరోగ్యాన్ని ఇస్తుంది. అంతే కాకుండా సమయానికి పడుకోవడం లేదా లేవడం వంటి అలవాటు పద్ధతిగా జరగాలి. ఇది వాళ్ళ స్లీప్ సైకిల్ ని క్రమబద్ధపరచామే కాకుండా పిల్లల్ని మరింత శక్తివంతంగా తయారు చేస్తుంది. ఇది చిన్న పిల్లలకే కాదు, పెద్దవాళ్ళకు కూడా ఎంతైనా అవసరం.



సానుకూలంగా...

సుఖమయమైన నిద్ర సానుకూలంగా ఆలోచించేలా చేస్తుంది. ఇది పిల్లల మానసిక ఆరోగ్యం, పెరుగుదలకు దోహదపడుతుంది. ముఖ్యంగా పిల్లలు ఆడుకునే ముందు స్నానం చేయడం, పళ్లుతోము కోవడం, నైట్ డ్రెస్ వేసుకోవడం, స్టోరీస్ చెప్తూ నిద్రపోవడం పిల్లలను ఆరోగ్యంగా ఉంచడమే కాదు, సంబంధాల పట్ల గౌరవ మర్యాదలు పెరగడానికి తోడ్పడతాయి.

ఆహ్లాదకరమైన పడకగది...

పరిపూర్ణ నిద్రకి పడక గదికి చాల సన్నిహితమైన అనుబంధం ఉంది. పడక గది పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్య సమస్యలు కూడా దూరం అవుతాయి. ముఖ్యంగా ఎలక్ట్రానిక్ పరికరాలను బెడ్ రూమ్ లో లేకుండా చూసుకోవాలి.

కెఫిన్, జంక్ పదార్థాలు...

పడుకునే ముందు జంక్ పదార్థాలు తినడం లేదా కాఫీ తాగడం వంటివి చేయవద్దు. దీని వల్ల నిద్ర సరిగ్గా పట్టదు. జంక్ పదార్థాలు షుగర్ లెవెల్స్ ను పెంచుతాయి. ఇది నిద్ర లేమికి దారి తీయడమే కాదు, నిద్రను దూరం చేస్తుంది. రాత్రి ఏడున్నర లోపు డిన్నర్ లో హోల్ గ్రేయిన్స్ తో కూడినవి తీసుకోవడం మంచిది.



వెక్కిళ్లను మనమందరం ఏదో ఒక సందర్భంలో ఎదుర్కొంటాం. తినే సమయంలో అయితే ఆ బాధ మాటల్లో చెప్పలేం. వెక్కిళ్ల సమయంలో తృప్తిగా తినలేం. మనకు వచ్చే వెక్కిళ్లు సారణమైన ఎక్కిళ్లయితే షాకింగ్ న్యూస్ చెబితే ఆగిపోతాయి. కారణం మన మెదడుకు ఆ షాకింగ్ న్యూస్ వెళ్ళి మిగిలిన ప్రక్రియ ఆగిపోతుంది. దాంతో పాటు మరో చిట్కా కూడా ఉంది. అదేమిటంటే...

శొంఠి వెక్కిళ్లను ఆపడంలో బాగా పనిచేస్తుంది. శొంఠిని పొడి చేసి బెల్లంతో కలిపి నోట్లోకి పీలిస్తే వెక్కిళ్లు ఆగిపోతాయి. అంతే కాదు శొంఠి, తేనెను కలిపి సేవిస్తే తగ్గుతాయి. వెక్కిళ్లు ఎక్కువగా చిన్న పిల్లలకు వస్తాయి. చిన్నపిల్లలను బోర్లా పడుకోబెట్టి తడితే తగ్గిపోతాయి. అంతేకాదు నీళ్ళలో చక్కెర కలిపి చిన్నపిల్లలకు తాగిస్తే సరిపోతుంది. వెక్కిళ్లు ఎక్కువగా వస్తుంటే నల్లతుమ్మచెట్టు ముళ్ళు 20 గ్రాములు నలగ్గొట్టి అరకప్పు మంచినీటిలో వేసి సగం కషాయం అయ్యే వరకు మరగబెట్టి దించి వడపోసి ఆ కషాయం గోరువెచ్చగా అయిన తరువాత ఒక చెంచా తేనె కలిపి రెగ్యులర్‌గా తాగితే తగ్గిపోతాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు.

ఇట్లచేద్దాం

కత్తిరించుకునే ముందు గోళ్ళను కొద్దిసేపు గోరువెచ్చని నీటిలో వుంచి తీస్తే సులువుగా కట్ చేసుకోవచ్చు.



అందమైన వంటగది

ఇల్లు ప్రత్యేకంగా, ఆకర్షణీయంగా కనిపించాలని అందరూ అనుకుంటారు. అలా కనిపించాలంటే ప్రధాన ఎంపిక ఇంటి అలంకరణలు. అయితే అలంకరణ విషయంలో చాలామంది కేవలం లివింగ్ రూమ్, పడక గది వరకే పరిమితమవుతారు. వంటగది గురించి పెద్దగా పట్టించుకోరు. అయితే వంటగదిలో వాడే వస్తువులనే వంటగది అలంకరణలో భాగం చేసుకోవచ్చు. దీనికోసం పెద్దగా డబ్బు ఖర్చు చేయాల్సిన అవసరం కూడా ఉండదు. కొంత సమయం తీసుకుని వినూత్నమైన ఆలోచనలు చేస్తే చాలు.

ప్రత్యేకమైన బౌల్స్‌ని కప్పులను ఉపయోగించుకోండి:

వంటగది పాత్రలు, కప్పులు, సాసర్లు, ప్లేట్లు ఏవైనా సందర్శకులను ఆకర్షిస్తాయి. సాధారణమైన సాదా వస్తువులకు బదులుగా మరలా వాటిని మరోసారి చూడాలి అనిపించే ప్రత్యేకమైన వాటిని ఎంచుకోండి. మీ స్థానిక షాపులలో అలాంటివి దొరకకపోతే ఆన్‌లైన్ షాపింగ్ చేయండి.

నిల్వ చేసుకునే కంటెయినర్లు:

వివిధ పరిమాణాలలో, డిజైన్లలో పాత్రలను కొనడానికి ప్రయత్నం చేయండి. దీనివల్ల వంటగది మరింత అందంగా, పద్ధతిగా కనిపిస్తుంది. ఇలాంటి వాటికి స్పైస్ జాడీలు ఒక ఉదాహరణ.

ఒక షో పీస్‌ని ఉంచండి:

మీ వంటగదిని ఆర్ట్ గ్యాలరీలా తయారు చేయాల్సిన అవసరం లేదు. అయితే వంటగదిలోకి ప్రవేశించగానే గుర్తించే ఒక అలంకార పీస్‌ని ఉంచండి. వాటికోసం ఎక్కువ ఖర్చుపెట్టాల్సిన అవసరం లేదు. ఒక ఫ్లవర్ వాజ్ కూడా ఉపయోగపడుతుంది.

గోడ రంగులు:

మీరు లేత రంగులు ఉపయోగిస్తే వంటగది చాలా ఆకర్షణీయంగా ఉంటుంది. దీనివల్ల ఆ ప్రదేశం చాలా విశాలంగా కనిపిస్తుంది. గోడలు తరచుగా మురికౌతున్నట్లయితే వాషబుల్ రంగులు వేయించుకోండి.

ఫర్నిచర్, క్యాబినేట్లు:

ఫర్నిచర్, వంటగది క్యాబినేట్లను కొనుగోలు చేసేముందు బాగా ఆలోచించండి. మీ వంటగదికి కచ్చితంగా సరిపోయేవాటినే ఎంచుకోండి. క్యాబినేట్లకు తగినంత స్థలం అవసరం. లేకపోతే మీ వంటగది అస్తవ్యస్తంగా కనిపిస్తుంది.

కాస్త విశ్రాంతి తప్పని సరి !



ఉద్యోగం చేసే మహిళలు రోజంతా పని చేసినా కాస్త విశ్రాంతి తీసుకోవడానికి సమయం ఉండదు. బయటి పనులు, ఇంటి పనులు, పిల్లలు ఇలా అన్నింటిని ఒకే సారి బ్యాలెన్సు చేయాలంటే చాలా కష్టం. రోజు వారీ పనులను ఎలాంటి ఇబ్బందులు లేకుండా చక చక పూర్తి చేసుకోవాలంటే కొన్ని సింపుల్ టిప్స్ పాటిస్తే సరిపోతుంది.

- ఉదయాన్నే చాలా పనులు ఉంటాయి. కాబట్టి రాత్రి పడుకునే ముందు యూనిఫామ్, స్కూల్ బ్యాగ్స్, వాటర్ బాటిల్స్ వంటివి అన్నీ రాత్రే సిద్ధం చేసి పెట్టుకోవాలి. ఇలా చేసుకోవడం వల్ల ఎలాంటి ఆందోళన లేకుండా ఉదయం టిఫిన్ చేస్తారు.
- కొన్ని సంస్థల్లో కచ్చితమైన సమయపాలన ఉంటుంది. అలాంటి సమయంలో చాలా ఆలస్యం అయితే ఒక్కరోజు వర్క్ ఫ్రమ్ హెూమ్ అని చెప్పి ఇంటి దగ్గరే ఉండి ఆఫీసు పనులను పూర్తి చేసుకోండి. అప్పడప్పుడు ఇలా చేస్తే ఒత్తిడికి గురి కాకుండా ఉంటారు.
- వీకెండ్స్‌లో కుటుంబంతో కలిసి బయటికి వెళ్లండి. జీవితంలో కాస్త సంతోషం, ఆహ్లాదభరితంగా ఉంటుంది. ఎప్పుడు రొటీన్‌గా ఉండటం వల్ల రోజు వారీ పనుల పట్ల విరక్తి కలుగుతుంది.
- కొన్నిసార్లు ముఖ్యమైన శుభాకార్యాలకు వెళ్లకుండా సమయాన్ని వృథా చేస్తారు. టీవీ చూడటం, చుట్టు పక్కల వారి గురించి మాట్లాడుకోవడం వంటివి చేస్తారు. దీని వల్ల సంబంధాలు దూరం కావడంతో పాటు అలాంటి అవకాశం మళ్లీ రాదు.
- ఇంటి శుభ్రత, బట్టలు ఉతకడం, తోట పనులు... చాలా ఉంటాయి. ఇవన్నీ చేసి బాగా అలసిపోయి తినకుండా ఉంటారు. దీని వల్ల ఆరోగ్యం పాడవుతుంది. తీవ్రంగా అలసిపోయే వరకు పనులు చేయకుండా నెమ్మదిగా పూర్తి చేసుకోండి. వీలైనంత వరకు పిల్లలతో, కుటుంబ సభ్యులతో కలిసి తినడానికి ప్రయత్నించండి.
- నెలలో ఉండే ముఖ్యమైన కార్యాక్రమాలకు, పుట్టిన రోజులకు, పార్టీలకు, అకేషన్లకు తప్పక వెళ్లండి. దీని వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుంది. అలాగే ఒత్తిళ్లను అదుపులో ఉంచుకుంటారు.

తొమ్మిదేండ్లకే ఉద్యోగం...

మధురమైన పాటలను విని ఆనందించేవారు ఎంతో మంది ఉంటారు. మధురమైన స్వరం మాత్రం కొద్దిమందికే ఉంటుంది. ఆ కొద్దిమందిలో ఒకరు ఆర్కాట్ పార్థసారథి కోమల. రెండు దశాబ్దాల పాటు దక్షిణ భారతదేశంలో నేపథ్యగాయనిగా ప్రశంసలు అందుకున్న గాయని. తొమ్మిదేళ్ల వయసులోనే ఆలిండియా రేడియోలో ఉద్యోగం వచ్చింది. శాస్త్రీయ సంగీత పోటీల్లో ఆమె పాటను విని దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఆమె పాటను మరోసారి పాడించుకున్నారు. 1950, 60వ దశకాల్లో తమిళం, మలయాళం, తెలుగు భాషల్లో అనేక పాటలు పాడారు. రేడియో కళాకారిణిగా అనేక సంవత్సరాలు పనిచేసిన ఆమెను తమిళనాడు ప్రభుత్వం ' కళైమామణి' బిరుదుతో సత్కరించింది.



ఆర్కాట్ పార్థసారధి కోమల
(ఆగష్టు 28, 1934)

కోమల మద్రాసులోని తిరువళ్ళికేనులో జన్మించారు. ఆమె తల్లితండ్రులు పార్థసారథి, లక్ష్మి. మూడేళ్ళ వయసులోనే పాటలు పాడటం ప్రారంభించిన కోమల తన గాత్రంతో ఎంతో మందిని ఆకట్టుకున్నారు. ఆమె గానం విన్న ఒక వ్యక్తి రేడియోలో పాడే అవకాశం కల్పించారు. అలా రేడియోలో పాటలు పాడుతున్న సమయంలో మద్రాస్ రేడియో స్టేషన్‌లో నాదస్వరం వాయించటానికి రాజమండ్రి నుండి వచ్చిన గాడవల్లి పైడిస్వామి ఆమె పాటను విని ఆనందించారు. అంతేకాదు ఆమెకు సంగీతంలో శిక్షణ ఇస్తే మరింత బాగా పాడుతారని ఆమె తల్లిదండ్రులకు చెప్పారు. వాళ్లను ఒప్పించి కోమలిని తనతో పాటు రాజమండ్రి తీసుకువెళ్ళి అక్కడ శాస్త్రీయ సంగీతంలో శిక్షణ ఇచ్చాడు. అలా తెలుగునేలపై శాస్త్రీయ సంగీతం నేర్చుకున్న ఆమె.తొలిసారిగా ఒరిస్సాలోని బరంపురంలో 1943లో జరిగిన శాస్త్రీయ సంగీత పోటీలో పాల్గొన్నారు. ఈ పోటీల్లో ముత్తుస్వామి దీక్షితార్ క తి 'శ్రీ గణనాయకం' పాడారు. ఆమె గాత్రానికి మెచ్చి వెండిభరిణె బహుమతిగా ఇచ్చారు. అలా తమిళనాడులో జన్మించి.. తెలుగు నేలపై సంగీతం నేర్చుకుని ఒరిస్సా లో బహుమతి గెలుచుకున్నారు. ఈ కార్యక్రమానికి వచ్చిన దుర్గాబాయి దేశ్‌ముఖ్ కోమలని ప్రశంసించి మళ్లీ ఆ క తిని పాడించుకున్నారు.

మధురమైన స్వరం, సంగీత అవగాహన ఉండటంతో తొమ్మిదేళ్ళ వయసులోనే ఆమెకు ఆలిండియా రేడియోలో ఉద్యోగం వచ్చింది. రేడియోలో ప్రసారమయ్యే గానలహరి కార్యక్రమంలో విద్యార్థినిగా పాల్గొనేవారు. అక్కడ పనిచేస్తుండగా సినిమాల్లో పాడే అవకాశం వచ్చింది. కోమల ప్రయాగ నరసింహశాస్త్రి సిఫార్సుతో 1946లో చిత్తూరు వి.నాగయ్య తీసిన 'త్యాగయ్య'లో తొలిసారిగా సినిమా పాట పాడారు.. ఆనందభైరవి రాగంలో 'మధురానగరిలో చల్లనమ్మ' అనే ఈ పాటకు ఆమె 250 రూపాయల పారితోషికం అందుకున్నారు. సినిమాలలో పాడిన తొలిపాట, చివరి పాట తెలుగు పాటలే కావటం విశేషం.

ఆలిండియా రేడియోలో ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన కోమల 1995లో పదవీ విరమణ పొందారు. .

ఆమె చాలా తమిళ్, మలయాళం, తెలుగు మరియు కన్నడ చిత్రాలలో 1960 మధ్య వరకు పాడారు. 1970 ల ప్రారంభంలో మళయాళంలోనూ తన గానాన్ని వినిపించారు. ఎంతో మంది ప్రముఖ సంగీత స్వరకర్తల సంగీత దర్శకత్వంలో కమల గీతాపాలన చేశారు.

రామనాథన్, కెవి మహదేవన్, వెంకటరామన్, విశ్వనాథన్, రామ్మూర్తి, ఎస్.ఎం. సుబ్బయ్యనాయుడు, టిఆర్ పప్పా, నటరాజన్, జి గోవిందరాజులు నాయుడు, ఎస్ దక్షిణామూర్తి, ఘంటసాల, పెండ్యాల నాగేశ్వరరావు, మాస్టర్ వేణు, టీవీ రాజు తదితరులతో ఆమె పనిచేసారు.

ప్రముఖ గాయకులు గోవిందరాజన్, టి.ఎమ్. సౌందరరాజన్, పి.బి.శ్రీనివాస్, ఏసుదాస్, పిఠాపురం నాగేశ్వర రావు, ఆమె ముఖ్యంగా పి. లీలా, కే. జమునా రాణిల తదితరులతో కలిసి పాడారు.

Women of the day

చంద్రబాబుపై మాజీ సీఎస్ ఫైర్

- ఏపీ సీఎంకు ఐవైఆర్ క్రిష్ణారావు 19 పేజీల లేఖ



నవతెలంగాణ - సిటీబ్యూరో

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఐవైఆర్ క్రిష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవో-179 రద్దు చేయాలనే డిమాండ్‌తో ఆయన ఆదివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాప్రయోజనాలకు వ్యతిరేకంగా ఏపీ ప్రభుత్వం రాజధాని అమరావతిలో నిర్మాణ పనులను సింగపూర్‌కు చెందిన కంపెనీలకు అప్పగిస్తున్నదని అన్నారు. దీనికి సంబంధించి ప్రభుత్వం జీవో-179ను 2017, మే 8న విడుదల చేసిందని తెలిపారు. జీవో ప్రకారం సింగపూర్‌కు చెందిన కంపెనీకి దొడ్డిదారిన నిర్మాణ పనులు అప్పగించారని ఆరోపించారు. ప్రభుత్వం అక్రమమార్గంలో ఆ దేశానికి చెందిన కంపెనీలను తెచ్చే ప్రయత్నం చేస్తోందని అన్నారు. స్విస్ ఛాలెంజ్ అంటే సుమోటోగా కంపెనీలు రావాలని సూచించారు. అయితే, మొత్తం ప్రక్రియను అక్రమ పద్ధతిలోనే చేస్తున్నారని చెప్పారు. సింగపూర్‌కు చెందిన కంపెనీలు నిజాయితీ పాటిస్తాయని చెప్పడంలో వాస్తవం లేదన్నారు. అక్కడ అంతర్గత విషయాల్లో మాత్రమే నిజాయితీ పాటిస్తారని చెప్పారు. చాలామంది సింగపూర్, వివిధ దేశాల్లో చేసే వ్యవహారాలపై తీవ్ర ఆరోపణలు, అనుమానాలున్నాయని వివరించారు. రాష్ట్ర ప్రయోజనాలను పణంగా పెట్టి విదేశీ కంపెనీలకు అనుగుణంగా సవరణ చేశారని తెలిపారు. ఇంతగా ఆరాటపడి పనులను అప్పగించాల్సిన అవసరం లేదన్నారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పు ఇంకా రావాల్సి ఉందన్నారు. తీర్పు రాకముందే పనులు చేపట్టడాన్ని ఆయన తప్పుబట్టారు. సింగపూర్, ఏపీ ప్రభుత్వ తీరుపై... 'ఒకడు నేనూ పొట్టు తెస్తాను. నువ్వు శనగలు తీసుకురా కలిపి ఉబికొని చెరిసగం పంచుకొని తిందాం' అనే రీతిలో వ్యవహారిస్తున్నారని అన్నారు. టెక్నికల్ కమిటీని సైతం పారదర్శకంగా వేయలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ విషయాన్ని గ్రహించి జీవోను తక్షణమే రద్దుచేసి ఇంటర్నేషనల్ బిడ్డింగ్ విధానం ద్వారానే రాజధాని నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా, సీఎం చంద్రబాబుకు రాసిన 19 పేజీల లేఖను మీడియా ప్రతినిధులకు విడుదల చేశారు. క్రిష్ణారావు మీడియా సమావేశం అంతా హడావుడిగా సాగింది. తాను చెప్పదల్చుకున్న అంశాన్ని చెప్పి, పది నిమిషాలపాటు మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పి అక్కడి నుంచి నిష్క్రమించడం గమనార్హం. మీడియా సమావేశానికి బౌన్సర్లు రావడం కూడా విశేషం.

రెండో ప్రయోగ వేదిక పైకి పీఎస్ఎల్వీ-సీ39

సూళ్లూరుపేట: శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి ఈ నెల 31న నింగిలోకి పీఎస్ఎల్వీ-సీ39 రాకెట్‌ను పంపేందుకు శాస్త్రవేత్తలు చురుగ్గా సన్నాహాలు చేస్తోన్నారు. ఇప్పటికే రాకెట్ అనుసంధాన ప్రక్రియ పూర్తయింది. రాకెట్‌కు తుది పరీక్షలు నిర్వహించారు. ఆదివారం ఉదయం 6 గంటలకు వాహన అనుసంధాన భవనం నుంచి పీఎస్ఎల్వీ-సి39 రాకెట్‌ను రెండో ప్రయోగ వేదిక పైకి తీసుకొచ్చారు. ఇక్కడ పరీక్షలు నిర్వహించిన అనంతరం 31న సాయంత్రం నింగిలోకి పీఎస్ఎల్వీ రాకెట్ దూసుకెళ్లనుంది. ఐఆర్ఎన్ఎస్ఎస్-1ఎ స్థానంలో 1హెచ్ ఉపగ్రహాన్ని ఇస్రో పంపనుంది.

కొద్ది గంటల్లో నంద్యాల విజేత

కర్నూలు : రాష్ట్రవ్యాప్తంగా నంద్యాల ఉప ఎన్నికలపై నెలకొన్న ఉత్కంఠకు కొద్ది గంటల్లో తెరపడనుంది. నేడు కర్నూలు జిల్లా నంద్యాల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించ నున్న ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపునకు అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. పోలింగ్ ముగిసిన మరుసటి రోజే నంద్యాలలో టీడీపీ, వైసీపీల మధ్య ఘర్షణ తలెత్తి తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకొంది. ఈ నేపథ్యంలో కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి సంఘటనలు జరగకుండా ఎన్నికల సంఘం పకడ్బందీగా చర్యలకు పూనుకుంది.

ముద్రగడ అరెస్టు

పోలీసు వలయాన్ని ఛేదించి పాదయాత్ర

పలుచోట్ల లాఠీచార్జి

- ముద్రగడ పద్మనాభంపై కేసు నమోదు
- పెద్దాపురం డీఎస్పీపై సస్పెన్షన్ వేటు!



ముద్రగడను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

కిర్లంపూడి: కాపులకు రిజర్వేషన్ల కల్పించాలంటూ నెల రోజులుగా పాదయాత్ర చేపడుతూ పోలీసు ఆదే శాలతో వెనక్కి వెళ్తున్న మాజీమంత్రి ముద్రగడ పద్మ నాభం ఆదివారం పోలీసు వలయాన్ని ఛేదించుకుని పాదయాత్ర కొనసాగించారు. సుమారు మూడు కిలోమీటర్ల మేర పాదయాత్ర చేశారు. పోలీసులు లాఠీఛార్జి చేసి, ఆయనను అరెస్టు చేశారు. ముద్ర గడను పోలీస్ స్టేషన్‌కు తరలిస్తుండగా ఉద్యమ కారులు వాహనాన్ని పలుచోట్ల అడ్డుకున్నారు.

చలో అమరావతి పాదయాత్రను పోలీసులు అడ్డుకుంటూ ఉండటంతో 32 రోజుల నుంచి ఇంటి వద్దే నిరసన తెలుపుతున్న ముద్రగడ.. ఆదివారం వంటావార్పు కార్యక్రమానికి పిలుపునిచ్చారు. కాకినాడలో చంద్రబాబు, జగన్ పర్యటనలతో కిర్లంపూడిలో పోలీసు బందోబస్తు తక్కువగా ఉంది. నెలరోజులుగా ముద్రగడ గృహనిర్బంధంతో ఆగ్రహంగా ఉన్న కాపులు, వారికి మద్దతుగా ఇతర సామాజిక తరగతులకు చెందినవారు అధిక సంఖ్యలో కిర్లంపూడి చేరుకోవడంతో ఒక్కసారిగా ముద్రగడ పాదయాత్రను కొనసాగించారు. జిల్లా ఎస్పి విశాల్‌గున్ని, డీఐజీ రామకృష్ణ, ఇతర పోలీసు ఉన్నతాధికారులు సంఘటనా స్థలానికి వచ్చినప్పటికీ పాదయాత్రను అదుపుచేయలేకపోయారు. రాజు పాలెం సెంటర్లో పోలీసు ఉన్నతాధికారులు రోడ్డుకు అడ్డంగా బోర్డులు పెట్టినప్పటికి వాటిని తోసు కుంటూ ముందుకు చొచ్చుకుని వెళ్లారు. పోలీసు ఉన్నతాధికారులు పాదయాత్రను అనుసరిస్తూ వస్తున్న తరుణంలో యువకులు నినాదాలు, వాహనాల సైరన్‌లతో గందరగోళం నెలకొంది. ముద్రగడ తన అనుచరులతో మూడు కిలోమీటర్ల పాదయాత్ర సాగించారు.

ముద్రగడ పాదయాత్ర తమ గ్రామానికి ఎప్పుడు వస్తుందా అంటూ మహిళలు హారతులతో ఎదురుచూశారు. రాజుపాలెం, కొత్తూరు జంక్షన్ వద్ద మహిళలు, ప్రజలు పాదయాత్రకు ఘనస్వాగతం పలికారు. కిర్లంపూడి మండలం వీరవరం విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ముద్రగడను అరెస్టు చేస్తున్నట్లు పోలీసు ఉన్నతాధికారులు తెలపడంతో స్వచ్ఛందంగా అరెస్టవుతున్నట్లు ముద్రగడ తెలిపారు. ముద్రగడ అరెస్టుతో ఆయన అనుచరులకు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితి అదుపుతప్పడంతో పోలీసులు లాఠీచార్జి చేశారు. ముద్రగడను స్టేషన్‌కు తరలించే క్రమంలో పోలీసు వాహనాన్ని ఉద్యమకారులు అడుగడుగునా నిలుపు చేశారు. వీరవరం, రామచంద్రపురం, గోనేడ, పాలెం గ్రామాల్లో రోడ్డుకు అడ్డంగా పెద్దపెద్ద దుంగలువేసి వాటికి నిప్పటించి వాహనాన్ని అడ్డగించారు. రోడ్డుకు అడ్డంగా మహిళలు, యువకులు బైఠాయించారు.

నైరుతి బలహీనత వల్లే పిడుగులు

- అల్పపీడనం ఏర్పడితే పిడుగులు తగ్గుముఖం

విశాఖపట్నం : రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఆగస్టులో సహజత్వానికి భిన్నంగా ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురుస్తున్నాయి. ఉదయం ఎండ, మధ్యాహ్నానికి నల్లని మేఘాలు కమ్ముకుని సాయంత్రం పలుచోట్ల భారీవర్షాలు కురుస్తున్నాయి. నైరుతి రుతుపవనాల బలహీనత వల్ల పిడుగులు ఎక్కువగా పడుతున్నాయి. నైరుతి రుతుపవనాల సీజన్‌లో రోజులు, గంటల తరబడి వర్షం కురుస్తుందని విశాఖ వాతావరణ కేంద్రం విశ్రాంత డైరెక్టర్ రాళ్లపల్లి మురళీకృష్ణ వివరించారు. నైరుతి రుతుపవనాల ప్రభావం ఉంటే పిడుగులు పడే అవకాశం లేదన్నారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో నైరుతి పవనాల ప్రభావం లేదన్నారు. ఇటీవల చైనా పరిసరాల్లో ఏర్పడిన తుఫానుకు నైరుతి పవనాలు అటువైపుగా మళ్లాయన్నారు. మళ్లీ అవి తిరిగి రావాలంటే బంగాళాఖాతంలో అల్పపీడనం లేదా వాయుగుండం వంటివి ఏర్పడాలన్నారు. రెండ్రోజుల్లో బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశాలున్నాయన్నారు. వేసవిని తలపించే ఎండలు, రాష్ట్రంపై ఉపరితల ఆవర్తనం, ద్రోణులు మూలంగా క్యుములోనింబస్ మేఘాలు ఏర్పడుతున్నాయని ఆయన తెలిపారు. ఈ మేఘాలు 9 కిలోమీటర్ల ఎత్తుకు చేరుకుంటే పిడుగులు పడే అవకాశం ఉందన్నారు. పెద్ద చినుకులు, అది కూడా పావుగంట నుంచి గంటలోపు మాత్రమే పడుతుంటాయని వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో వారం రోజులుగా పడుతున్నవి క్యుములోనింబస్ వర్షాలేనని, అందుకే విజయనగరం, విశాఖ, శ్రీకాకుళంతో పాటు కోస్తాలో పలుచోట్ల విస్తారంగా పిడుగులు పడ్డాయన్నారు. రెండ్రోజుల్లో అల్పపీడనం ఏర్పడితే పిడుగులు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని తెలిపారు.

24 గంటల్లో అల్పపీడనం

ఒడిశా-పశ్చిమబెంగాల్‌కు ఆనుకుని వాయువ్య బంగాళాఖాతంలో 4.5 కిలోమీటర్ల ఎత్తులో శనివారం ఉపరితల ఆవర్తనం ఏర్పడిన సంగతి తెలిసిందే. ఇది క్రమంగా బలపడుతోందని, 24 గంటల్లో అల్పపీడనంగా మారుతుందని భారత వాతావరణ శాఖ పేర్కొంది.

భారత్‌లో సాంకేతిక పరిజ్ఞానం అపారం

- రక్షణ రంగంలో అత్యాధునిక టెక్నాలజీ : కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ
- ఆర్మీ అంబులపొదిలో అధునాతన శక్తివంత లాంగ్‌రేంజ్ సర్ఫేస్ మిస్సైల్

హైదరాబాద్ : దేశంలో సాంకేతిక పరిజ్ఞానం కలిగిన మానవ వనరులు అపారంగా ఉన్నాయని కేంద్ర రక్షణ, ఆర్థిక, కార్పోరేట్ వ్యవహారాల శాఖ మంత్రి అరుణ్ జైట్లీ అన్నారు. భారత రక్షణ రంగంలో అత్యాధునిక టెక్నాలజీ వినియోగిస్తూ అత్యంత శక్తివంతమైన మిసైల్స్, యుద్ధ ట్యాంకర్లను రక్షణ రంగ సంస్థలు బీడీఎల్, మిథానీలు అభివృద్ధి చేస్తున్నాయని చెప్పారు. భారతీయులు విదేశాల్లోనూ తమ సేవలను అందిస్తున్నారని, శాస్త్ర సాంకేతిక విజ్ఞానం రక్షణ రంగంలోనూ వినియోగిస్తున్నారని తెలిపారు. ఆదివారం హైదరాబాద్, కంచన్‌బాగ్ బీడీఎల్‌లో జరిగిన కార్యక్రమంలో లాంగ్‌రేంజ్ సర్ఫేస్ ఎయిర్ మిసైల్‌ను జైట్లీ ఇండియన్ ఆర్మీకి అందజేశారు. దీన్ని డీఆర్‌డీవో, ఇజ్రాయిల్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇండస్ట్రీస్ సంయుక్తంగా అభివృద్ధి చేశాయి. అత్యంత శక్తివంతమైన ఈమిసైల్‌ను నావీ, ఎయిర్‌ఫోర్సు దళాలు కూడా వినియోగించవచ్చు. బీడీఎల్ ఇబ్రహీంపట్నం కాంప్లెక్స్‌లో జరిగిన మరో కార్యక్రమంలో రాకెట్ మోటర్ స్టాటిక్ పరీక్ష సదుపాయాన్ని జైట్లీ జాతికి అంకితం చేశారు. దీనికోసం రక్షణ శాఖ రూ.48కోట్ల నిధులను వెచ్చించింది. బీడీఎల్ భానూర్ యూనిట్‌లో అస్త్ర ఆయుధాల తయారి కేంద్రాన్ని, ఐదు మెగావాట్ల సోలార్ ఫొటో వొల్టాయిక్ పవర్ ప్రాజెక్టును కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ ప్రారంభించారు. ఇక్కడ ఆకాశంలో యుద్ధం చేసేందుకు ఉపయోగించే ఆయుధాలను అభివృద్ధి చేస్తారు. ఈ కార్యక్రమంలో బీడీఎల్ సీఎండీ వి.ఉదయ భాస్కర్, రక్షణ శాఖ కార్యదర్శి (ప్రొడక్షన్) ఎకె గుప్త, ఆర్మీ అధికారులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనంలో అపశృతి

- రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని నలుగురు మృతి
- విద్యుత్తుషాక్ తగిలి ఇద్దరు మృతి



ఘటనా స్థలంలోనే మృతిచెందిన అశోక్

ఒంగోలు : వినాయక నిమజ్జనం వేడుకల్లో అపశృతి చోటుచేసుకుంది. రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొనడంతో నలుగురు మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడి కోమాలో ఉన్నాడు. ఈ ఘటన కొత్తపట్నం మండలం ఈతముక్కలలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఒంగోలులోని భాగ్యనగర్, రిజిస్ట్రార్ కార్యాలయం దగ్గరలో స్థానికులు వినాయక విగ్రహన్ని ఏర్పాటు చేశారు. ఆదివారం ఈతముక్కల, మడనూరు వద్ద నిమజ్జనం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. భాగ్యనగర్‌కు చెందిన యువకులు అశోక్(25), పవన్(14), శివకుమార్ నిమజ్జనానికి వెళ్లి, బైక్‌పై తిరిగి వస్తున్నారు. అదే సమయంలో కందులూరుకు చెందిన అలూరి రాంబాబు(28), బొబ్బాల క్రిష్ణమూర్తి(30) తమ గ్రామంలో ఏర్పాటుచేసిన వినాయకుడి విగ్రహ నిమజ్జనానికి మడనూరుకు బైక్‌పై వెళుతున్నారు. ఈ రెండు బైకులూ అతివేగంగా వస్తూ సూరారెడ్డిపాలెం రైల్వే గేటు దాటిన తరువాత ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో అశోక్ అక్కడికక్కడే మృతిచెందారు. మిగతా నలుగురూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను రిమ్స్‌కు తరలించగా పరిస్థితి విషమించడంతో పవన్, క్రిష్ణమూర్తి, రాంబాబు మృతిచెందారు. శివకుమార్ కోమాలో ఉన్నాడు.

విద్యుత్తుషాక్ తగిలి ఇద్దరు మృతి

వినాయక నిమజ్జనం సందర్భంగా విద్యుత్‌షాక్ తగిలి ఇద్దరు మృతిచెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈసంఘటన శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా తడ మండలంలోని అండగుండాల గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు.. అండగుండాల గ్రామంలోని బిసి కాలనీలో ఆదివారం గణేశ నిమజ్జనం కోసం విగ్రహాన్ని తరలిస్తున్నారు. 11కెవి విద్యుత్ తీగలు తగిలి నలుగురికి కరెంట్ షాక్ తగిలింది. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన పిచ్చుక శ్రీనివాసులు(24), పిచ్చుక యువక్రిష్ణ(22) మృతి చెందారు. గుత్తి వినోద్, పిచ్చుక జయకృష్ణలకు తీవ్ర గాయాలయ్యాయి.

ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు నలుగురినీ సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శ్రీనివాసులు, యువకృష్ణ మృతిచెందారని డాక్టర్ తెలిపారు. బంధువులు మృత దేహాలను గ్రామానికి తీసుకెళ్లారు. గాయపడ్డ వినోద్, జయకృష్ణలను ప్రథమ చికిత్సానంతరం మెరుగైన వైద్యం కోసం చెన్నయ్ తరలించారు. గ్రామానికి చేరిన మృత దేహాలను సోమవారం సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం తిరిగి కుటుంబ సభ్యులకు అప్పగించనున్నారు.

బీజేపీతో సీఎం లోపాయికారి ఒప్పందం

- కేసీఆర్ మాటల మాంత్రికుడు: కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి

నవతెలంగాణ- కొడంగల్

బీజేపీతో సీఎం కేసీఆర్ లోపాయికారి ఒప్పందం చేసుకున్నారని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జైపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం వికారాబాద్ జిల్లా(ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా) కొడంగల్‌లో కాంగ్రెస్ నాయకుడు మధుసూదన్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ బీజేపీని విమర్శిస్తూనే ఆ పార్టీ వంతపాడటం ఏమిటన్నారు. ఒప్పందంలో భాగంగానే రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఓట్లు వేశారన్నారు. నియోజకవర్గాల పెంపు జరగాలంటే రాజ్యాంగ సవరణ అవసరమన్నారు. అన్ని రంగాల్లో సీఎం కేసీఆర్ విఫలమయ్యారని విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని టీఆర్ఎస్ ప్రభుత్వమే అడ్డుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 169 జీవో ప్రకారం నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం సరైందన్నారు. దళితులకు మూడెకరాల భూమి, మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్లు ఏమయ్యాయని ప్రశ్నించారు. కేసీఆర్ మాటల మాంత్రికుడే తప్ప సమస్యలు పరిష్కరించే మాంత్రికుడు కాదన్నారు. వివిధ రంగాల్లో కమిటీలు ఏర్పాటుచేసి తమ పార్టీని బలోపేతం చేస్తామని చెప్పారు. కమిటీల నియామకం అనంతరం నియోజకవర్గ ఇన్‌చార్జీలను నియమిస్తామన్నారు. ప్రత్యేకంగా కొడంగల్‌పై దృష్టిసారిస్తామని చెప్పారు. ఎవరూ నిరాశ చెందొద్దని నాయకులు, కార్యకర్తలకు భరోసా కల్పించారు. సమావేశంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, ఆయా మండలాల అధ్యక్షులు పట్లోళ్ల దామోదర్‌రెడ్డి, జయకృష్ణ, నరోత్తంరెడ్డి, హన్మారెడ్డి, నరేందర్‌రెడ్డి, నాయకులు సలీం, సుభాష్‌నాయక్, కృష్ణంరాజు ఉన్నారు.

ఎకరానికి రూ.4వేలు ఇచ్చి తీరుతాం

- మే 15 వరకు రైతు ఖాతాల్లో జమచేస్తాం
- తెలంగాణ ఉద్యాన మహోత్సవ ప్రారంభంలో: వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన విధంగా రైతుల పెట్టుబడి కోసం ఎకరానికి రూ.4వేల చొప్పున ఇచ్చితీరుతామని వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. 'తెలంగాణ ఉద్యాన మహోత్సవం-2107' ను ఆదివారం నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్‌ప్లాజాలో ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రైతు సమగ్ర సర్వే పూర్తి చేసిన వెంటనే మే 15 వరకు రైతు ఖాతాల్లో ఎకరానికి రూ. 4 వేల చొప్పున డబ్బులు జమ చేస్తామని చెప్పారు. రెండు పంటలు పండించే ఉద్యాన రైతులకు ఏడాదికి రూ.8వేల నగదు అందనున్నట్టు వెల్లడించారు. సమన్వయకర్త, ఏఈవో సంతకాలతో కూడిన రికార్డు ఆధారంగా ఈ నగదు అందజేస్తామని వివరించారు. రాష్ట్రంలో 10800 రెవెన్యూ గ్రామాలున్నాయని, అందులో 3600 యూనిట్లుగా విభజించి సెప్టెంబరు 1నుంచి 9 వరకు గ్రామ రైతు సమన్వయ సంఘాలను ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. సెప్టెంబరు 10నుంచి 14 వరకు మండల రైతు సమన్వయ సంఘాలను ఏర్పాటు చేసి, రిసోర్స్ పర్సన్స్ ద్వారా సదస్సులు నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలో కోటి 20 లక్షల ఎకరాల సాగు భూమి విస్తీర్ణంలో ఉన్నదన్నారు. అందులో 10 లక్షల ఎకరాల్లో కూరగాయలు పండిస్తున్నామని చెప్పారు. ఆహార ధాన్యాల దిగుమతి నుంచి ఎగుమతి దిశగా వ్యవసాయ శాఖ అడుగులు వేస్తోందన్నారు. ఉద్యాన శాఖలో అనేక పథకాలకు రాయితీ ఇస్తున్నామని, ముఖ్యంగా డ్రిప్ సబ్సిడీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలు తమ ఇంటికి అవసరమైన కూరగాయలను పండించుకునేందుకు అవసరమైన అధునాతన, సాంకేతిక పద్ధతులను ఉద్యాన శాఖ అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. ఉద్యాన పంటలతోనే అధిక అదాయం పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మదన్ మోహన్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ లోక భూమారెడ్డి, మాజీ డిప్యూటీ స్పీకర్ హరీశ్వర్‌రెడ్డి, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సి. పార్థసారధి, ఉద్యాన శాఖ కమిషనర్ ఎల్. వెంకట్‌రామ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ ఉద్యాన ప్రదర్శన ఈ నెల 31వరకు ప్రజలకు అందుబాటులో ఉంటుందని, ప్రభుత్వ, ప్రయివేటు సంస్థలు తమ ఉత్పత్తులతో కూడిన స్టాళ్లను ఏర్పాటు చేశాయి.

వ్యవసాయ సమగ్ర విధానంపై చిత్తశుద్ధి లేదు

- ధాన్యాల దిగుమతే రైతుల ఆత్మహత్యలకు కారణం
- గ్రామీణ వ్యవసాయ అనుబంధ ఉత్పత్తులను ప్రోత్సహించాలి: ప్రొఫెసర్ కె.నాగేశ్వర్



సమావేశంలో ప్రొఫెసర్ కె.నాగేశ్వర్

నవతెలంగాణ-మహబూబ్‌నగర్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యవసాయ సమగ్ర విధానంపై చిత్తశుద్ధి లేదని మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కళాభవన్‌లో ఆదివారం "వ్యవసాయ సంక్షోభం-రైతు ఆత్మహత్యలు, పరిష్కార మార్గాలు" అంశంపై సెమినార్ ఏర్పాటు చేశారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వెంకట్‌రామిరెడ్డి అధ్యక్షత వహించగా, నాగేశ్వర్ మాట్లాడారు. భారతదేశంలో దశాబ్దాల కాలంగా వ్యవసాయంపై పాలక ప్రభుత్వాలు సమగ్ర విధానం రూపొందించలేకవపోడంతో సంక్షోభంలో కూరుకుపోయి రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయన్నారు. నేటికీ 2శాతం వృద్ధిరేటులో వ్యవసాయం లేదన్నారు. ప్రపంచ పెట్టుబడిదారి దేశమైన అమెరికాలో వంద ఎకరాల భూస్వామి తమ పిల్లలను వ్యవసాయదారులుగా తయారు చేస్తుంటే, మనదేశంలో రైతులు మాత్రం పిల్లలను వ్యవసాయానికి దూరంగా పెంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని అన్ని మార్కెట్‌యార్డుల్లో ధాన్యానికి గిట్టుబాటు ధర వచ్చే వరకు నిల్వ చేసుకోవడానికి గోదాములు లేవన్నారు. రైతులపై వ్యాపారుల వత్తిడితో వచ్చిన ధరకే ధాన్యాన్ని అమ్ముకుంటున్నారని తెలిపారు. బ్యాంకులు వ్యవసాయాన్ని అనుబంధ సంస్థగా గుర్తించాలని కోరారు. సాగు కలిసిరాక, అప్పులు పెరుగుతుండటంతో ప్రతిరైతు వ్యవసాయం వదిలేద్దామనే దుస్థితిలో ఉన్నారన్నారు. ప్రతి ఐదేండ్లకు ఒకసారి ప్రభుత్వం సేకరించే జనాభా లెక్కల్లో రైతుల సంఖ్య తగ్గుతోందన్నారు. గ్రామాల నుంచి రైతులు పట్టణాలకు వచ్చి కూలీలుగా మారుతున్నారన్నారు. ప్రభుత్వాలు విదేశాల నుంచి ఆహార ధాన్యాలను దిగుమతి చేసుకోవడంతో మన దేశ వ్యవసాయ రంగం మరింత దిగజారుతోందన్నారు. నాయకులు, విత్తన వ్యాపారులు కుమ్మక్కై రైతులను నిండా ముంచుతున్నారన్నారు. సీజన్ సమయంలో నకిలీ విత్తనాలు విచ్చలవిడిగా మార్కెట్‌లో అమ్ముతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ అనుబంధంగా గొర్రెలు, మేకలు, పశుపోషణ, చేతివృత్తులను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. రైతుకు నమ్మకమొచ్చే విధంగా పాలకులు సమగ్ర విధానం రూపొందించి ప్రోత్సహించినప్పుడే వ్యవసాయంలో లాభాలు వచ్చి ఆత్మహత్యలు ఆగుతాయని తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ.సాగర్, ఆహ్వాన సంఘం అధ్యక్షుడు బుర్రి వెంకట్‌రామిరెడ్డి, అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి, కోయిల్‌సాగర్ ప్రాజెక్టు రైతు అధ్యక్షుడు ఉమావెంకటేశ్వర్‌రెడ్డి, ఎమ్‌డీ.జబ్బార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైలు పట్టాలపై పడి

ఇద్దరు యువకుల ఆత్మహత్య

నవతెలంగాణ-మిర్యాలగూడ టౌన్

రైలుపట్టాలపై ఇద్దరు స్నేహితులు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో ఆదివారం జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... త్రిపురారం మండలం బాబుసాయి పేటకు చెందిన బైకు మెకానిక్ బచ్చు చరణ్(19), త్రిపురారంలో సెల్‌షాపు నిర్వా హకుడు బూరుగు నాగరాజు(20) స్నేహితులు. శుక్రవారం వినాయకచవితి వేడుకల్లో పాల్గొని శని వారం మిర్యాలగూ డకొచ్చి రాత్రి 8 గంటల వరకు పట్టణంలోనే ఉన్నారు. ఆదివారం తెల్లవారు జామున టీక్యా తండా వద్ద రోడ్డు వెంట బైకు నిలిపి రైలుపట్టా లపై పడుకున్నారు. వారిపై నుంచి రైలు వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచె ందారు. నాగరాజు తల విడిపోయి దూరంగా ఛిద్రమై పడింది. మృతికి గల కార ణాలు తెలియ రాలేదు. ప్రొ.కబడ్డీలో బెట్టింగ్‌కు పాల్పడి అప్పుల పాలయ్యారని, అందువల్ల మనస్తా పంతో ఆత్మహత్య చేసుకున్నారని తోటి స్నేహితులు చెబుతున్నారు. మృతదేహాలను పోస్టు మార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియాస్పత్రికి తరలించారు. రైల్వే ఎస్ఐ అచ్యుతం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసు లెక్కల్లోకి రాని మండపాలు లక్షకు పైనే?

అనుమతి తీసుకున్నవి 95వేలు, అత్యధికంగా హైదరాబాద్‌లోనే..

- అనుమతి ఉన్న వాటికే భద్రత.. లేని వాటికి ఎలా?
- ఉగ్రవాద స్లీపర్‌సెల్స్ యాక్టీవ్‌గా ఉన్నాయన్న సమాచారం
- భద్రతపై మరింతగా దృష్టిని సారించిన పోలీసు ఉన్నతాధికారులు



నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను చేశామని పేర్కొంటున్న పోలీసు ఉన్నతాధికారులను మరో సమస్య వేధిస్తున్నది. ఈ మారు పోలీసుల అనుమతి లేకుండా దాదాపు లక్షకు పైగా గణేష్ మండపాలు హైదరాబాద్ మొదలుకుని అన్ని జిల్లాల్లో వెలిశాయి. ఈ మండపాల వద్ద భద్రతను కల్పించే విషయంలో ఉన్నతాధికారులు మల్లగుల్లాలు పడుతున్నారని తెలిసింది. ముఖ్యంగా దేశంలో ఐఎస్‌తో పాటు మరి కొన్ని ఉగ్రవాద సంస్థలకు చెందిన స్లీపర్ సెల్స్ యాక్టీవ్‌గా ఉన్నాయని నిఘా వర్గాల నుంచి ఉన్న సమాచారంతో పోలీసు ఉన్నతాధికారులు మరింతగా అప్రమత్తం అయ్యారని తెలిసింది. గణేష్ ఉత్సవాలు ప్రారంభమై ఆదివారం నాటికి మూడో రోజు గడిచింది. మూడవ రోజు నుంచే గణేష్ నిమజ్జనోత్సవాలు ట్యాంక్‌బండ్ మొదలుకుని వివిధ జిల్లాల్లోని చెరువులు, నదులలో ప్రారంభం అయ్యాయి. ఇక వచ్చే నెల ఐదవ తేదీన హైదరాబాద్‌లో వందలాది గణేష్ విగ్రహాలు సామూహిక నిమజ్జనోత్సవానికి తరలనున్నాయి. ఇంతవరకు బాగానే ఉంది. కాని రాష్ట్రంలో అధికారికంగా బస్తీలు, కాలనీలు, పట్టణాలు, గ్రామాలు, మండల కేంద్రాలలో కలిపి మొత్తం 95 వేల గణేష్ మండపాలు పోలీసు అనుమతితో వెలిసినట్టు రాష్ట్ర డీజీపీ అనురాగ్‌శర్మ తెలిపారు. హైదరాబాద్‌లో 13 వేలు, సైబరాబాద్ కమిషనరేట్‌లో 9400, రాచకొండ కమిషనరేట్‌లో ఏడు వేలు, వరంగల్ కమిషనరేట్‌లో నాలుగువేలకు పైగా గణేష్ మండపాలు ఏర్పాటు కాగా మిగతా కమిషనరేట్లు, జిల్లాలు కలిపి మొత్తం 95 వేల వరకు వెలిసినట్టు పోలీసు రికార్డులలో నమోదైందని ఆయన తెలిపారు.

అయితే ఇవిగాక మరో లక్షకు పైగా మండపాలు, గణేష్ ప్రతిమలను హైదరాబాద్ మొదలుకుని రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలు, కాలనీలు, బస్తీలు, గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్‌లు, చిన్న చిన్న బస్తీలలో వివిధ సంఘాలు ఏర్పాటు చేసుకోగా వాటి గురించి పోలీసులకు సమాచారం లేదని ఉన్నతాధికారుల దృష్టికి వచ్చినట్టు తెలిసింది. సాధారణంగా ఆ విధంగా స్థానికులు విగ్రహాలను పెట్టుకుంటే ఎవరికి అభ్యంతరం లేదని, కాని భద్రతా కారణాల దృష్ట్యా వాటి వివరాలు పోలీసుల వద్ద తప్పని సరిగా ఉండాలని ఉన్నతాధికారులు చెబుతున్నారు. కారణం దేశంలో ఉగ్రవాద కార్యకలాపాలు చాపక్రింద నీరులా సాగుతున్నాయని, కొన్ని ఉగ్రవాద సంస్థలకు చెందిన స్లీపర్‌సెల్స్ యాక్టీవ్‌గా ఉన్నాయని కేంద్ర నిఘా సంస్థ అంతర్గతంగా అన్ని రాష్ట్రాలను ఇప్పటికే హెచ్చరించినట్టు తెలిసింది. ముఖ్యంగా గణేష్ మండపాలకు అనుమతి విధానం పెట్టడం ద్వారా దరఖాస్తు చేసుకున్న మండపాల వద్ద తగిన భద్రతను అక్కడి స్థానిక స్థితిగతులను బట్టి ఏర్పాటు చేయడం, రాత్రి వేళ మండపాల వద్ద నిర్వాహకుల్లో ఒకరు తప్పని సరిగా ఉండేలా చేయడం, నిమజ్జనం రోజును గణపతి విగ్రహాలను తరలించడానికి అవసరమైన వాహన సౌకర్యాన్ని(చార్జితోటే) ఏర్పాటు చేయడం, ఆ వాహనం వెంబడి ఇద్దరు లేక ముగ్గురు సాయుధ కానిస్టేబుళ్లను ఎస్కార్టుగా పంపించడం పోలీసుల ముందు జాగ్రత్త చర్యల్లో కొన్ని. కాగా అనుమతి లేకుండా వెలసినట్టుగా చెప్పబడుతున్న లక్షకు పైగా మండపాలలో దాదాపు ఇరవై ఐదు శాతానికి పైగా వీధులు, చౌరస్తాలలోనే పెట్టినవిగా పోలీసుల దృష్టికి వచ్చింది. మిగతా వాటికి ఆయా నిర్వాహకుల నుంచి కొంత సెక్యూరిటీ ఉన్నప్పటికి చివరిగా నిమజ్జనానికి తరలించే సమయంలో సెక్యూరిటీ పరంగా సమస్యలు వచ్చే అవకాశాలు ఉన్నాయని అధికారులు అనుమానిస్తున్నారు. ఈ విధమైన పరిస్థితి ఏర్పడటానికి స్థానిక పోలీసు స్టేషన్‌లపై ఉన్నతాధికారుల సరైన పర్యవేక్షణ లేకపోవడమేనని డీజీపీ హెడ్‌క్వార్టర్స్ అధికారులు అసంతృప్తితో ఉన్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా ఆయా జిల్లాలు, కమిషనరేట్‌లలో ఉన్నతాధికారులు పూనుకుని అవసరమైన ప్రాంతాల్లో సెక్యూరిటీని పటిష్టం చేయాలని, నిమజ్జనం జరిగేంత వరకు అన్ని మండపాల వద్ద పోలీసులే గాక, నిర్వాహకులు కూడా అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్టు సమాచారం.

పెట్టుబడి గ్రంథం ప్రాధాన్యత




బి.వి. రాఘవులు

- 11 -

(గురువారం తరువాయి భాగం)

సరళీకరణ విధానాల కాలంలో ఉన్నాం. ఇందాక చెప్పినట్టు సరళీకరణ విధానాల ముఖ్యమైన లక్షణమేంటంటే.. ఇంకా పెట్టుబడిదారీ సంబంధాలు ప్రవేశించని రంధ్రాల్లోకి ప్రవేశించి దాన్ని మొత్తం విచ్ఛిన్నం చేసి పెట్టుబడిదారీ సంబంధాల్లోకి తీసుకురావడమే సరళీకరణ విధానాల ముఖ్యమైన లక్షణం. మీరు కమూనిస్టు ప్రణాళిక చదివితే పెట్టుబడి ఎట్లా మూల మూలకీ ప్రవేశిస్తదో. గ్రామ గ్రామానికీ ప్రవేశిస్తదో. రంధ్రం రంధ్రంలోకి ప్రవేశించుద్దో తెలుస్తుంది. ప్రవేశించి దాన్ని బద్దలు చేసి మొత్తం దాని రూపురేఖలను మార్చేస్తుంది. ఇది పెట్టుబడి యొక్క లక్షణం. ఇప్పుడు సరళీకరణ విధానాలొచ్చిన తర్వాత అదే చేసింది. సరళీకరణ విధానాలు రాకముందు రాజ్యమనేది పెట్టుబడిదారీ విధానాన్ని కొంత నియంత్రణ చేసి, దాన్ని అదుపులో పెట్టి, దాని దుర్మార్గాలు మరీ ఒక స్థాయికి మించకుండా కొంత ప్రయత్నం చేసింది. అదెందుకు ప్రయత్నం చేసిందో అదొక చరిత్ర. సోషలిస్టు సోవియట్ యూనియన్ వచ్చింది కాబట్టి అట్లాంటి ప్రయత్నాలు చేసుకోకపోతే ..మనం కుక్కను తాడేసి కట్టేస్తం ఎందుకు కట్టేస్తం.. దానికి తిండి బాగా పెట్టేస్తున్నాం వదిలేస్తే ఏం చేస్తదో ..ఎవడు మనమీద కేసుపెట్తడో అని భయపడి కట్టేసి ఉంచుతాం. అందుకని పెట్టుబడి విధానం 1917 తర్వాత సోషలిస్టు వ్యవస్థ ఏర్పడింతర్వాత తాడేసి కట్టేయడానికి ప్రయత్నం చేసింది పెట్టుబడిదారీ వర్గం. ఎందుకంటే సోవియట్ యూనియన్, చైనా, ఈ సోషలిస్టు వ్యవస్థ వల్ల అసలుకే మోసం. అందుకని కొంత కాలం కట్టేద్దాం వాళ్లు బలహీనమైపోయిన తర్వాత కుక్కనొదులుదాం. అప్పుడు వాళ్ల సంగతి చూసుద్ది అని చెబుతారు...1991 తర్వాత ఆ రకంగా వదిలేశారు. కాబట్టి ఇదొక ముఖ్యమైన కీలకమైన అంశం. అక్కడి నుండి ప్రపంచ వ్యాపితంగా అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలు ఎట్లున్నాయి. అవి కాకుండా ఇంతకు ముందు సోషలిస్టు దేశాల్లో, ఇప్పుడున్న మన ఇండియా లాంటి దేశాల్లో, ఆఫ్రికా దేశాల్లో పాత పెట్టుబడిదారీ పూర్వ వ్యవస్థలు, పూర్వ రంగాలు, పూర్వ అంశాలు అట్లాంటివి ఎక్కడెక్కడున్నాయో చూసి వాటన్నింటిలో ప్రవేశించి పూర్తిగా ధ్వంసం చేయడానికి ప్రయత్నం చేస్తూ ఉంది. అందుకని ఇవి ఎంత పెరుగుతూ ఉంటే ఆ పెట్టుబడి ప్రవేశం వల్ల వచ్చే సమస్యలన్నీ అంత వికృతంగా తయారవుతున్నాయి. పెట్టుబడి ప్రవేశించిందాని వల్ల వచ్చే సమస్యలు ఏవేంటో మీరు పెట్టుబడి గ్రంథం చదివితే అర్థమవుతుంది. ఈ రోజు భూమిని గుంజుకుంటున్నరు అని అంటున్నరు. ఎందుకు గుంజుకుంటున్నరో చదివితే అర్థమవుతుంది. ఇక్కడ మల్లన్నసాగర్ కావచ్చు. చంద్రబాబు పది లక్షలు, చంద్రశేఖర్‌రావు ఐదు లక్షల ఎకరాలు కావచ్చు. ఇవన్నీ ఎందుకు గుంజుకుంటున్నరు. అభివృద్ధి కోసమంటున్నరు. అభివృద్ధి కోసం కాదు దీంట్లో ప్రిమిటివ్ ఆక్యుములేషన్..పురాతన సంచయమో ఏదో తెలుగు ట్రాన్స్‌లేషన్ ఉంది. అదీ పెట్టుబడిదారీ విధానం యొక్క ఒక ముఖ్యమైన లక్షణం. అది వ్యాప్తి చెందే లక్షణం. అది వ్యాప్తి చెందుతా ఉంది. దాని లక్షణం అది. అది మనం డ్యామును గండికొట్టేస్తే నీళ్లొచ్చి ఎలా ముంచేసి పోతాయో..ఇప్పుడు అలాంటి ప్రిమిటివ్ ఆక్యుములేషన్ అని అంటున్నం. అలాగే అప్పులు విపరీతమవుతున్నాయి. అప్పులు ఎందుకు ఎక్కువైపోతున్నయో పెట్టుబడి గ్రంథం చూస్తే అర్థమై పోతది. ఇప్పుడు కమ్యూనిస్టు పార్టీకి ఎవరైనా సభ్యులుగా ఉంటే వారు ఆదాయమెంత కట్టాలి. ఎవరూ కట్టడం లేదు. ఏమయ్యా ఎందుకు కట్టడం లేదంటే మాకు టేక్ కొంటే తక్కువగా ఉందని అంటున్నారు. నాకు లక్ష రూపాయల జీతమస్తది కాని మూడు వేలు, నాలుగు వేలే చేతికొస్తున్నాయి. కానీ 20 ఏళ్ల క్రితం లక్ష రూపాయల జీతమొస్తే కనీసం 50 వేలు, 60 వేలు చేతికొచ్చేది. ఇప్పుడు మూడు వేలు నాలుగు వేలే ఎందుకు తీసుకుపోతున్నాం. ఎందుకంటే మీ చేత కారు కొనిస్తాడు. ఫ్రిజ్ కొనిస్తాడు. మీ చేత ఇంకోటి కొనిస్తాడు. ఇన్సూరెన్స్ పాలసీ కట్టిస్తాడు. మీ ఇల్లు తగలబతుందేమోనని ఇన్సూరెన్స్.. మీ దగ్గరకు వరదొస్తుందేమోనని, ఇక్కడ హైదరాబాద్‌లో వరదొస్తుంటే దానికి కూడా ఇన్సూరెన్స్ కట్టిస్తాడు. సస్తే ఇన్సూరెన్సే కాదు. నీకు కలిరిగితే ఇన్సూరెన్స్ ఉంటుంది. ఇవన్నీ ఏంటీ.? పెట్టుబడిదారీ విధానమనేది సరుకుల్ని అమ్ముకోవడం. ఎఫెక్టివ్ డిమాండ్ లేకపోవడం ఇవన్నీ వస్తున్నాయి. అందుకని ఈ అప్పులు, సరళీకరణ విధానాలు ఇవన్నీ వచ్చిన తర్వాత మనిషిని ఒక అప్పులమయం చేయడం, అప్పుల్లో ముంచేయడమే. ఇక అప్పుల్లో మునిగిన తర్వాత, నీవు నీళ్లల్లో మునిగిన తర్వాత, తలపైకి పెట్టి ఉంచాలా? మిగతాదంతా కిందుంటే వాడు బాధపడడు. తల మునిగితే బాధపడిపోతాడు. అందుకని ఇక్కడిదాక ముంచుతాడు. తల మాత్రం మునగనీయడు. తల మునిగితే అప్పు మునిగిపోద్ది. అప్పు చెల్లించడు. అందుకని మన తల మునగనీయ్యడు. అందుకని ఎప్పుడూ అప్పిచ్చే వాడు తీర్చమని కోరడు. వడ్డీ ఇవ్వనమి కోరుతుంటాడు. మీరు తీర్చేస్తే వాడికింకో సమస్య. మళ్లీ ఇంకొకరికి అప్పివ్వాలి. ఆ శ్రమెందుకు పడాలి. మీరు తీర్చకుండా ఉండాలి. కానీ వడ్డీ మాత్రం ఇవ్వాలి. ఇదీ అప్పుయొక్క స్వభావం. ఆ స్వభావం గురించి దీంట్లో చెబుతాడు. ఇదీ స్వచ్ఛమైన పెట్టుబడిదారీ విధానం సంబంధాలకి. ఇంతకు ముందేమన్నడు. బ్యాంకుల జాతీయాకరణం. నువు అప్పుకావాలంటే తీసుకో.. అప్పులు చేసీ చేసీ నువు చెల్లించకపోతే నేను మాఫీ చేసేస్తను. అంటే మాఫీ చేసేయొచ్చు. అప్పుడు రాజ్యం చేతిలో ఉంది కాబట్టి. ఇప్పుడు నీతి ఆయోగ్.. వాడేమంటున్నడు. 'మాఫీ చేయకు. మాఫీ చేస్తే చాలా అన్యాయమైపోతాడు' అని. నిన్న నీతి ఆయోగ్‌వాడు రైతులకు మాఫీ చేయమని అంటే అన్నడు. మాఫీలు, గీఫీలు చేయడం అనేది స్వచ్ఛమైన పెట్టుబడిదారీ విధానం కాదు. అందుకని అప్పులెందుకని వస్తున్నయి. క్రెడిట్ మార్కెట్ ఎందుకని పెరిగింది. ఇవన్నీ మీరు అర్థం చేసుకోవాలంటే దీంట్లో ఉంది. అందుకని ఇప్పుడు భూములు, గీములు ఎందుకు తీసుకుంటున్నారంటే ప్రిమిటివ్ అక్యుమిలేషన్ అంటే దీంట్లో మీకు అర్థమవుతుంది. అందుకని చట్టాలన్నీ మారుతున్నాయి. ఎందుకు మారుతున్నాయి. దీన్ని చూస్తే మీకు చట్టాలకు..ఈ రోజు పెట్టుబడికేంత వ్యత్యాసం ఉందో దీంట్లో మీకు అర్థమవుతుంది. ఈ రోజు పర్యావరణానికి, పెట్టుబడిదారీ విధానానికేంటో అర్థమయిపోతుంది. పెట్టుబడి అనేది ఒక సెల్ఫ్ డ్రైవింగ్ మిషన్ అని మార్క్స్ చెబుతాడు. ఓ చోట పెట్టుబడి అంటాడూ ..పెట్టుబడి అనేది ఎటువంటి స్థాయికొచ్చిందంటే తన యజమానిని ఉరేస్తే లాభం వస్తది అదనపు విలువ వస్తదనుకుంటే పెట్టుబడి తన యజమానిని ఉరేయడానికి సిద్ధం.



(తరువాయి భాగం గురువారం సంచికలో..)

తెలుగు భాషను కాపాడుకుందాం



ఫణి మాధవి కన్నోజు

"ఇంగ్లాండ్‌లో ఇంగ్లీష్, ఫ్రాన్స్‌లో ఫ్రెంచ్ భాషలు ఎట్టున్నవో అలాగే ఈదేశంలో కూడా పెద్దల నోట వాడే తెలుగు భాషకు సాధ్యమైనంత దగ్గరగా రాతను కూడా తెచ్చి, నోటి మాటా, చేతిరాతా ఒకదానికొకటి పోషకాలుగా చేసి రెండింటికినీ సమంగా ప్రవత్తి కలిగించి, రాత సార్థకంగానూ సులభంగానూ చేసి, తెలుగు వారు రాసే, మాట్లాడే భాష కూడా సభ్య భాషే అనే గౌరవం సంపాదించటమే మేము తలపెట్టిన ప్రయోగం. ఇదే మా దష్టిలో వాస్తవమైన భాషాభిమానం" అని నిర్మొహమాటంగా తెలియజేసిన ఘనుడు, తెలుగు చైతన్యానికి సూర్తి ప్రదాత గిడుగు రామ్మూర్తి పంతులు. ఆయన జన్మ దినాన్నే మనం 'మాత (తెలుగు) భాషా దినోత్సవం'గా జరుపుకుంటున్నాం.

1863 ఆగస్టు 29న శ్రీకాకుళం జిల్లా పర్వతాల పేటలో జన్మించిన గిడుగు రామ్మూర్తి పంతులు గొప్ప పండితుడు,

దేశ భాషలందు
తెలుగు లెస్స

బహు భాషావేత్త, సంస్కత, ఆంగ్ల భాషల్లో నిష్టాతులు. వ్యావహారిక భాషోద్యమాన్ని చేపట్టి నిరాటంకంగా నిర్వహించారు. 'తెలుగు' మాస పత్రిక పెట్టి సాహిత్య సేవ చేశారు. హరిజనాభ్యుదయం గురించి, నిమ్నజాతుల వారి కోసం సొంత ఖర్చుతో ఒక పాఠశాలను స్థాపించారు. తెలుగు భాష మాత భాషగా మారాలని గట్టి పోరాటం చేశారు. అలాంటి మహనీయుని జన్మదినాన్ని తెలుగు భాషా దినోత్సవంగా ప్రకటించి వేడుకగా జరుపుకుంటున్నాం ఇప్పటివరకు. ఆయన్ని తలచుకుంటూ.. ఈ రోజు మనం మన తెలుగు భాష మనుగడ గురించి కొంత మాట్లాడుకుందాం....

'తెలుగు బిడ్డవురోరి తెలుగు మాట్లాడుటకు
సంకోచపడియెదవు సంగతేమిటిరా?
అన్య భాషలు నేర్చి ఆంధ్రంబు రాదంచు
సకిలించు ఆంధ్రుడా! చావవెందుకురా" అంటూ ఆవేదనతో ఆవేశపడ్డారు కాళోజీ.

'తెలుగులో చదువుకోవటం వల్ల కానీ, తెలుగులో మాట్లాడటం వల్ల కానీ పిల్లల భవిష్యత్ అభివద్ధికి ఆటంకమవుతుంది' అనే భావన నేడు బలంగా నాటుకుపోయింది. అందుకే ముందు మనం మన భాషను ఎందుకు ప్రేమించాలో తెలుసుకుందాం... నేడు ప్రపంచంలో 6,500 భాషలు వ్యవహారంలో ఉన్నాయి. అన్ని భాషలు మొదట ధ్వని రూపంలోనే ఉంటాయి. నోటితో పలకబడేదే భాష. భాషలో భావ వ్యక్తీకరణ ముఖ్యం. గాడిదలు ఓండ్ర పెడతాయి. సింహాలు గర్జిస్తాయి. పిట్టలు కూస్తుంటాయి. సహజ ప్రవత్తుల వల్ల ఆ జీవులు అలా ప్రవర్తిస్తుంటాయే తప్ప, వాటికి భాషించే శక్తి లేదు. మానవులకు మాత్రమే భాషించే శక్తి ఉంది. మాట్లాడటం ద్వారా మానవుడు తన మనోగత భావాల్ని ఇతరులకు అర్థమయేలా వ్యక్తీకరించగలు గుతాడు. ఆకలి, దాహం, కోపం, ఉద్రేకం లాంటి మనోభావాలు మనిషి మెదడులో పుట్టినప్పుడు ఇతరులకు స్పష్టంగా అర్థమయ్యేట్టు తెలిపే వాగ్రూప ప్రక్రియే భాష. ఈ భాష అనేది సష్టిలో మనిషికి మాత్రమే గల అపూర్వ సాధనం. ఈ వాగ్రూపమైన, ధ్వనుల సమాహారమైన భాష క్షణికం, తత్ క్షణం నశించేది. కాబట్టి సాధ్యమైనంత ఎక్కువ కాలం స్థిరంగా ఉంచేం దుకు, కాలగర్భంలో కలిసి పోకుండా ఉంచేందుకు మానవులు 'లిపి'ని కనిపెట్టా రు. దీనికి అక్షరం అని పేరు పెట్టారు. క్షరమంటే నశించేది. అక్షరమంటే నశించనిది. లిపిని ఎవరు కనిపెట్టారు? అనే ప్రశ్నకు అనేక భిన్నాభిప్రాయాలున్నాయి. ప్రస్తుతం అది వదిలేద్దాం. భారతీయ లిపి అతి ప్రాచీనమైనదని భావింప బడుతోంది. బ్రాహ్మీ లిపి భారతీయ లిపులకు మూలమనీ, తెలుగు కూడా అందునుండి ఉద్భవించిందేనని చెప్పబడుతోం ది. బ్రాహ్మీ లిపి - దక్షిణ బ్రాహ్మీ లిపి - అందులో మళ్లీ వేంగి లిపి - తెలుగు లిపి ఈ క్రమంలో ఉద్భవించినట్లుగా తెలుస్తోంది. మూల లిపి నుంచి ఉద్భవించ బడినప్పటికీ తెలుగు భాష విభిన్న పదజాలం, భావ స్పష్టత అధికంగా కలిగి ఉందని నిర్ధారింపబడింది. ఇంత కష్టపడి మన పూర్వీకులు ఏర్పరచుకున్న తెలుగు భాషా లిపి రాను రానూ అనేక ప్రభావాలకు లోనవుతూ, మార్పులు పొందుతూ వచ్చింది. భారత దేశానికి పరజాతి పాలన కొత్త కాదు. క్రీ.పూ. నుంచి అనేక విదేశీ దాడులకు గురవుతూ వచ్చింది. ఆయా సమయాల్లో మన దేశ సంస్కతీ సంప్రదాయాలు అనేక ప్రభావాలకు గురయ్యాయి. మరీ ముఖ్యంగా పాశ్చాత్యుల పాలనా సమయంలో మన దేశ ప్రజల ఆచార వ్యవహారాలు, ఆహార్యాలతోపాటు భాషపై కూడా కొన్ని మార్పులు పొడచూపాయి. వారి వైజ్ఞానిక సంబంధమైన పరిజ్ఞానం మన దేశీయులను విభ్రమకు గురిచేసింది.

అ ఆ ఇ ఈ

17, 18 శతాబ్దాల్లో తెలుగు బాగా వికసించి, క్రమంగా క్షీణించింది. క్రీ.శ. 1800 నుంచి నేటి వరకు గల కాలాన్ని భాషాపరంగా ఆధునిక యుగంగా పరిగణిస్తున్నారు. అప్పటి కే తెలుగుపై ఇంగ్లీషు భాష ప్రభావం ప్రారంభమై ఆధునిక స్వరూపాన్ని సంతరించుకుంది. వ్యవహార పత్రాల్లో కూడా ఆంగ్ల పదాలు ప్రవేసించాయి. అలా అలా ఇంగ్లీషు భాష అనధికారికంగా సత్వర జీవన అభివద్ధికి దోహదపడే భాషగా ప్రజల్లో భావన ఏర్పడిపోయింది. ఆ రోజుల్లోనే ఇంగ్లీషు వారైనప్పటికీ మన తెలుగు భాష మాధుర్యాన్ని గ్రహించిన వారై, కల్నల్ కాలిన్ మెకంజీ, విలియమ్ కెరే, మారిస్ సోదరు లు, ఎ.డి క్యాంబెల్.. వంటి వారు తెలుగు భాష అభివద్ధికి పాటుపడ్డారు. సి.పి.బ్రౌన్ భాషా సంబంధమైన పరిశోధనకు బీజం వేయటమే కాక, సాహిత్య వద్ధికి ఎనలేని క షి చేశాడు. విదేశీయులే ఆశ్చర్యమొందేలా మాధుర్యం కలిగిన మన తెలుగు భాష అంతరించిపోయే ప్రమాదంలో పడింది. ఏ భాషైనా వ్యవహార బలం చేతనే మనుగడలో ఉంటుంది. మరి తెలుగు చదవలేని రాయలేని తరం తయారవుతుంటే, వ్యవహారంలో అంతరించి తద్వారా తెలుగు జాతి అనేదే అంతరించిపోయే ప్రమాదం ఉంది. అందుకే భాష విషయం లో ప్రాంతం, యాస అంటూ దురభిమానాలు పక్కనపెట్టి అందరం ఒకే తెలుగు జాతిగా సంఘటితమై తెలుగు భాష మనుగడకు మేల్కొనవలసిన సమయం ఆసన్నమైంది. భవిష్యత్తు కోసం అన్ని విద్యలూ నేర్చినట్లే ఆంగ్లాన్ని నేర్చుకున్నప్పటికీ, మనం మాట్లాడే భాష కనీసం చదవటం, రాయటం అయినా వచ్చి ఉండేలా బోధన వ్యవస్థలో మార్పు తెచ్చుకోవాలి. మాతభాష ప్రాముఖ్యతను ప్రచారం చేయాలి. తద్వారా తెలుగు జాతిని కాపాడుకోవలసి ఉంది.

సెల్ : 7659834544

జాతీయ గీతానికి గౌరవమేదీ?



శ్రీనివాస్ చిరిపోతుల

దేశ భక్తి గౌరవం,అభిమానం వంటివి గుండెల్లో గూడు కట్టుకొని ఆయా సందరాల్లో ఉబికి వచ్చే భావోద్వేగాలు. వాటిని కొలవడానికి ఇప్పటివరకూ ఎలాంటి పరికరాలు లేవు. జాతివారసత్వ సంపదకు గర్వ కారణం అని పాఠ్యపుస్తకాల్లోని ప్రతిజ్ఞను బట్టీ పట్టినంత మాత్రాన దేశ భక్తులైపోరు. దేశ వ్యాప్తంగా థియేటర్లలో సినిమా ప్రదర్శనకు ముందు జాతీయ గీతాన్ని తప్పనిసరి చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు, ఒక్క మాటలో చెప్పాలంటే విడ్డూరంగా ఉంది. సినిమా హాళ్ళలో జాతీయ గీతాలాపన వేళ ద్వారాలన్ని మూసివేయాలనే నిబంధన. అంతకు మించి అతిగా చేస్తే ,ఏదో వినోదం కోసం సినిమాకి వస్తే ఇదేం శిక్ష అని ప్రేక్షకులు జాతీయగీతం పైనే వైముఖ్యాన్ని ప్రదర్. శించే ప్రమాదమూ ఉంది. శ్యాం నారాయణ్ అనే వ్యక్తి జాతీయ గీతం పట్ల అమితమైన గౌరవంతో లేచి నిలబడితే ,సినిమా కనపడడం లేదంటూ చుట్టుపక్కల వాళ్ళు అతన్ని కూర్చోబెట్టారు. ప్రజల్లో అవగాహనలేమి కారణంగా జాతీయ గీతానికి అవమానం జరుగుతోంది అని భావించి శ్యాం నారాయణ్ ప్రజాప్రయోజన వ్యాజ్యం ద్వారా కోర్టును ఆశ్రయించారు. సినిమా హాళ్ళలో జాతీయ గీతాలపనకు ఆదేశించాలని కక్షిదారు కోరనే లేదు.ఐనా మాత దేశం పట్ల ప్రేమాభిమానాల వ్యక్తీకరణలకు అదొక అవకాశం అంటూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు అసంబద్ధంగా ఉందనడంలో ఎలాంటి సందేహం లేదు. కిందటి సంవత్సరం ముంబాయిలోని ఓ థియేటర్లో జాతీయ గీతాలాపన సమయంలో నలుగురు కుటుంబ సభ్యులు లేచి నిలబడడంతో చుట్టుపక్కల వాళ్ళకు కోపం వచ్చి వారితో గొడవ పడి అక్కడి నుండి ఆ కుటుంబాన్నే బయటకు పంపించిన వైనం, సోషల్ మీడియాలో వైరల్గా మారింది. జాతీయగీతం ప్రదర్శించినపుడు శ్రోతలంతా ఏకాగ్రతతో నిలబడాలి. కానీ, సినిమా ప్రదర్శనలో న్యూస్ రీల్ లో భాగంగా జాతీయ గీతాన్ని ప్రదర్శిస్తే- ప్రేక్షకులు లేచి నిలబడడం గీతానికి గౌరవం ఆపాదించకపోగా,సినిమా ప్రదర్శనకు అవరోధమై అలజడి రేగే అవకాశం ఉంది. భక్తితో గుడికి వెళ్తాం,ఏకరూప బట్టలు వేసి చిన్నారుల్ని పాఠశాలలకు పంపిస్తాం,ఉద్యోగులంతా బాధ్యతతో కార్యాలయాలకు వెళ్ళతారు. వీటన్నిటికి ఒక లెక్క ఉన్నపుడు, ఎంటర్టైన్ మెంట్ కోసం సినిమా హాళ్ళకు వెళ్ళేవాళ్ళ మూడ్ దానికి భిన్నంగా ఉంటుంది. ఫుల్లుగా మందు కొట్టి సినిమాకి వెళ్ళరాదు అన్న నిషేదం ఏదీ లేనప్పుడు,మందు బాబులు లేచి నిలబడ్డా జాతీయ గీతాన్ని గౌరవించినట్టేనా? 1987లోనే సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును గుర్తుకు తెచ్చుకోవాలి. కేరళ లోని ఓ పాఠశాలలో జాతీయ గీతాలపన సందర్భంగా ముగ్గురు పిల్లలు- గీతాన్ని పాడనందుకు యాజమాన్యం వారిని తమ పాఠశాల నుండి బహిష్కరించారు. తమ తమ మత విశ్వాసాల రీత్యా పాడలేకపోయామన్న వాదనను మన్నించి తిరిగి వారిని చేర్చుకోవడం జరిగింది. మన రాజ్యాంగం సహనాన్నే అలవరుస్తోంది-మనం దాన్ని నీరుగార్చరాదు. అని, ఉద్బోదించింది. రాజ్యాంగ వ్యవస్థల నుండి ఆ సహనాన్నే యావత్ భారత దేశం కోరుకుంటుంది.

సెల్ : 96034 71199.

ఆర్టికల్ 14 అంతా అబద్ధం



వంగరి రవిరాజు

గత నెలలో రాష్ట్రంలో రెండు వేర్వేరు రకాల దర్యాప్తు పద్ధతులు జరిగాయి. ఒకటి డ్రగ్స్ విచారణ, రెండవది రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇసుక లారీల దహన విచారణ పద్ధతి. ఈ రెండు విచారణ పద్ధతుల ద్వారా తెలిసిన విషయం చట్టం ముందు అందరూ సమానమే అని చెప్పే ఆర్టికల్ 14 అంతా అబద్ధం అని. చట్టం పెద్దలకు చుట్టం గానూ, పేదలపై కఠినంగా పని చేస్తుందని తేటతెల్లం అయింది.

ఒకసారి ఆ రెండు విచారణ పద్ధతులను పరిశీలిస్తే, డ్రగ్స్ సినిమా పరిశ్రమకు చెందిన వారు వినియోగిస్తున్నారని తెలియడంతో విచారణ నిమిత్తం వారికి నోటీసులు జారీ చేశారు. ఏసీ గదుల్లో విచారించి, మధ్యాహ్నం ప్రత్యేకమైన భోజనం పెట్టి పంపించారు. నేరెళ్లలో లారీలు దహనం చేశారు అనే విచారణ నిమిత్తం అర్ధరాత్రి పోలీసులు గ్రామాల్లో గాలించి ఎనిమిది మందిని జులై 4 న అరెస్టు చేసి ఒక కళాశాలకు తరలించి బట్టలు విప్పి ఫైబర్ లాఠీలు విరిగేలా కొట్టారు. కరెంటు షాక్ లు పెట్టారు. రోకలి బండలు ఎక్కించారు. కులాల పేరుతో దుషించారు. ఇప్పుడు మీ ఒళు హూనమైంది బయటకు వెళ్లిన తర్వాత మీ భార్యలతో కాపురాలు ఎలా చేస్తారు. వాళ్ళను మా దగ్గరకు పంపండి. మేము కొట్టినట్టు కోర్టులో, ఆస్పత్రిలో చెప్పుతే నక్సలైట్లని ముద్ర వేస్తాం, రౌడీషీట్లు తెరిచి జీవితంలో బయటకు రాకుండా కేసులు పెడుతాం, మీ భార్యలపై వ్యభిచారం కేసులు పెడతాం, మీ పిల్లలపై గంజాయి కేసులు పెట్టి జైళ్లలో మగ్గేలా చేస్తాం అంటూ బండ బూతులు తిడుతూ కాళ్లతో తన్నారని బాధితులు చెప్పారు. డ్రగ్స్ విచారణ వీఐపీ హోదాలో సాగింది, నేరెళ్ల సామాన్యుల విచారణ ఇంత దారుణంగా కర్కషంగా సాగింది. చట్టాలు, ప్రభుత్వాలు, అధికారులు అంతా పెద్దలకు అనుకూలంగా పనిచేస్తాయి అనడానికి ఇవి మచ్చుకు ఉదాహరణలు. అసలు ప్రశ్నల్ల ఇసుక లారీలు ఢీకొని చనిపోతే ఎందుకు కేసులు నమోదు చేసి వారిని విచారించలేదు. లారీలు దహనం చేసినందుకు ఇంత కర్కషంగా వ్యవహరిస్తే, లారీలు ఢీకొని 4 ప్రాణాలు పోయాయి, 45 మందికి పైగా గాయపడ్డారు, ఒక ఆర్టీసీ బస్సును ఢీ కొట్టిన వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదు. జిల్లా స్థాయి ఉన్నత పోలీసు అధికారులు ఇందులోకి వచ్చారు అంటే అవతలి వ్యక్తి ఎంతటివాడో అర్థం కాక తప్పదు. అసలు విచారణ పద్ధతి ఏంటి? లారీలు తగులబెట్టారని ఫిర్యాదు అందితే జులై 4 న అరెస్టు చేసిన వారి వివరాలు జనరల్ డైరీలో నమోదు చేసి, 24 గంటలలోపు కోర్టులో హాజరు పర్చాలి. కానీ నాలుగు రోజుల పాటు థర్డ్ డిగ్రీ ప్రయోగించి చట్టానికి విరుద్ధంగా వ్యవహరించారు. అసలు రాజ్యాంగంలోని 20 , 21, 22వ నిబంధనలను పూర్తిగా ఉల్లంఘించి తద్వారా వ్యక్తి యొక్క ప్రాథమిక హక్కులను ఉల్లంఘించారు. 20(3) నిబంధన ప్రకారం బలాత్కార సాక్ష్యం నిషేధం, అంటే ఒక వ్యక్తిని తనకు తాను వ్యతిరేక సాక్ష్యం చెప్పుకోడానికి నిర్బంధించరాదు. 22(3) అరెస్టు చేసిన 24 గంటలలోపు కోర్టులో హాజరు పర్చాలి. 22(3) ప్రకారం అరెస్టుకు కారణాలు తెలియజేయాలి. ఇలా చట్టాలను తుంగలో తొక్కి అప్రజాస్వామికంగా వ్యవహరించారు. శారీరకంగా, మానసికంగా వారిని హింసించారు. ఎముకలు విరిగేలా కొట్టడం, మూత్రం నుండి రక్తం వచ్చేలా కొట్టడానికి వాళ్లు లారీలతో మనుషులను చంపారా? ఓ... చలాన్లు కట్టి మనిషి ప్రాణాలు తీసిన లారీలను తగలబెట్టారు అనా? మనిషి ప్రాణాలు తీస్తున్నా పట్టించుకోని పోలీసులు, లారీలు తగులబెడితే మాత్రం ఇంత కఠినంగా వ్యవహరించడానికి గల కారణాలు ఏంటి? డ్రగ్స్ విచారణ జరుగుతున్న సందర్భంలో ముఖ్యమంత్రి కేసీఆర్ వాళ్లు బాధితులు అన్నారు. మరి లారీలు తగులబెట్టారన్న నెపంతో నాలుగు రోజులు చిత్రహింసలకు గురైన వాళ్లు మాత్రం బాధితులు కాదా? వీళ్ల గురించి ఎందుకు పట్టించుకోలేదు. సినిమా వాళ్ళపై ఉన్న ప్రేమ సామాన్యులపై ఎందుకు లేదు. నేరెళ్ల సంఘటన చిన్న విషయం, దానిని ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయి అని హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి' అన్నారు. లారీల కింద పడి చనిపోవడం చిన్న విషయమా, 45 మందికి పైగా గాయపడటం చిన్నవిషయమా, అక్రమంగా 8 మందిని అరెస్టు చేసి థర్డ్ డిగ్రీ ప్రయోగించి చిత్రహింసలకు గురిచేయడం చిన్న విషయమా. సామాన్యుడి ప్రాణాలకు విలవ లేనట్టుంది. సత్వరమే నేరెళ్ల సంఘటనపై విచారణ జరిపించి, ఘటనకు సంబంధించిన బాధ్యులను శిక్షించాలి. నేరెళ్ల బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి.

లారీలు తగులబెట్టారని ఫిర్యాదు అందితే జులై 4 న అరెస్టు చేసిన వారి వివరాలు జనరల్ డైరీలో నమోదు చేసి, 24 గంటలలోపు కోర్టులో హాజరు పర్చాలి. కానీ నాలుగు రోజుల పాటు థర్డ్ డిగ్రీ ప్రయోగించి చట్టానికి విరుద్ధంగా వ్యవహరించారు. అసలు రాజ్యాంగంలోని 20 , 21, 22వ నిబంధనలను పూర్తిగా ఉల్లంఘించి తద్వారా వ్యక్తి యొక్క ప్రాథమిక హక్కులను ఉల్లంఘించారు. 20(3) నిబంధన ప్రకారం బలాత్కార సాక్ష్యం నిషేధం, అంటే ఒక వ్యక్తిని తనకు తాను వ్యతిరేక సాక్ష్యం చెప్పుకోడానికి నిర్బంధించరాదు. 22(3) అరెస్టు చేసిన 24 గంటలలోపు కోర్టులో హాజరు పర్చాలి. 22(3) ప్రకారం అరెస్టుకు కారణాలు తెలియజేయాలి. ఇలా చట్టాలను తుంగలో తొక్కి అప్రజాస్వామికంగా వ్యవహరించారు.

సెల్ : 9908170175

కన్నీళ్ల నేరెళ్లను ఓదారుద్దాం..



కంచర్ల శ్రీనివాస్

నీరు వివిధ రూపాలుగా మారుతుంది మన అవసరాలను బట్టి.. కన్నీరుగా కూడా కారుతుంది మన మానసిక స్థితినిబట్టి..ఇసుక అడుగున నీరుంటుంది.. సైకత తోడేళ్ళ ఇనుప గోళ్ళు తోడేకొద్దీ అది ఉబికి వస్తుంది.. ఇసుక అడుగునుండే కాదు మనిషి కండ్లనుండీ..నీరు తీరు అనేక రూపాలుగా మారటం నిత్యం అందరం చూస్తుంటాం..రీచుల కొద్దీ నీరు ఎలా దుఖ జనిస్తుందో కన్నీటి కారకంగా ఎలా పరివర్తనం చెందుతుందో చూడాలంటే..రండిపోదాం నెత్తురోడుతున్న పల్లెకు కన్నీళ్ళ నేరేళ్ళకు..

సిరిసిళ్ళ రాజన్న జిల్లా ఇపుడు ఉశికె కండ్ల నేరెళ్ల ..సాధారణ గ్రామం ఇప్పుడు జాతీయ స్థాయి చర్చానీయాంశం..బాధితుల ఆర్తనాదాలు అంతగా ప్రతిధ్వనించటమే ఇందుకు కారణం..

ప్రశ్నించటం నేరం కాదు. ఉద్యమం పోరాటం తప్పు కాదు. కానీ రాజ్యాంగం కల్పించిన ఆ హక్కులు నేరేళ్ల ఊరోళ్ళకు హరించబడుతున్నయ్. అంబేద్కర్ బొమ్మ సాక్షిగా కాలరాయబడుతున్నాయ్..

ఇసుక కాంట్రాక్టర్లకు చెందిన లారీలను నేరెళ్ళ స్థానికులు ధ్వంసం చేయటం పట్ల ప్రభుత్వం ప్రతిస్పందించింది..వాహనాలకు నిప్పు పెట్టారన్న ఆరోపణలపై పోలీసులు కొందరిని చిత్ర హింసలకు గురిచేశారు.. ఇసుక రీచులకు సంబంధించిన వెయికిపైగా లారీల సంచారంతో తమ గ్రామ పర్యావరణ విధ్వంసం జరుగుతోంది ప్రశాంతంగా జీవించే హక్కుకు భంగం కలుగుతోంది అని స్థానికులు అంతకు ముందు మొరపెట్టుకున్నా స్పందించలేదు..అంటే గెలవటం కోసం ఓటింగ్ యంత్రాలకు ప్రాధాన్యం ఇస్తున్న పార్టీలు ప్రభుత్వాలుగా మారాక మనిషి ప్రాణం కన్నా మర యంత్రాలకే ప్రాముఖ్యమిస్తున్నాయని ఈ సంఘటన రుజువు చేస్తోంది....

థర్డ్ డిగ్రీ ప్రయోగించి లాకప్పులో కుళ్ళ బొడిచి మర్మాంగాలకుకరెంట్ షాకిచ్చి...ఎంతటి భయానక రాజ్య హింస.. ఇంతకీ వారు ఉగ్రవాదులో, కనీసం తీవ్ర వాదులో కాదు. సాధారణ పౌరులు.. వారు చేసిన నేరం దోపిడీని ప్రశ్నించటం... అక్రమాన్ని అడ్డగించటం..చిత్ర హింసల ద్వారా పాలకులు ప్రకటించింది ఏంటంటే..ఎన్ని ఇబ్బందులకు గురౌతున్నా సరే భరించాలి. ఎంత కష్టాన్నైనా సహించాలి .. మాఫియా సామ్రాజ్యానికి ఎదురు చెప్పకూడదు. వాళ్ల ఆధిపత్య చర్యలను ప్రశ్నించకూడదు..

అయితే ఈ కండ్లెందుకు చూపెందుకు చూపుడు వేలెందుకు? ఈ స్వాతంత్ర్యమెందుకు.. ప్రభువులకు వత్తాసు పలికిన అప్పటి ఆ ద్రోణుడు ఎరుకల ఏకలవ్యుడిని బలి కోరింది బొటన వేలే తప్ప చూపుడు వేలుకాదు భవిష్యత్తులో ఏ ఏకలవ్యుడూ పాలకులను ప్రభువులను ప్రశ్నించకుండా ఉండటానికి ..

సాధారణ జన జీవనానికి తీవ్ర విఘాతం కలగటమే నేరెళ్ల లొల్లికి అసలు కారణం..ఒకటి కాదు, రెండు కాదు, అనుమతించిన లారీలు ట్రక్కులే వెయ్యి. అనధికారికంగా మరో అయిదు వందల వరకూ వాహనాలు రేయింబవళ్ళూ ఆ పల్లె గుండెల మీద రయ్ రయ్ మని రాకపోకలు సాగిస్తూ కంటి మీద కునుకు లేకుండా చేయటమే కాదు, అధిక స్పీడు అజాగ్రత్త డ్రైవింగులతో స్థానికుల ప్రాణాలకు ప్రమాదం కలిగిస్తున్నాయ్..

ఇసుక రీచులనుండి కోట్లు తవ్వుకోవటం తెలిసిన కాంట్రాక్టర్లు గ్రామంలో వేగాన్ని నియంత్రించే స్పీడ్ బ్రేకర్ల వద్ద తగు జాగ్రత్తలు చేపట్టక పోవటంతో రోడ్లు తదితర సహజ వనరుల విధ్వంసంతోపాటు ప్రాణాలను మూల్యంగా చెల్లించాల్సి వస్తోంది. దుమ్మూ ధూళి, వాహనాల పొగ లౌడ్ హారన్ల రోదనలతో వాతావరణ కాలుష్యం ప్రశాంత పల్లె జీవనాన్నీ అన్ని విధాలా విచ్ఛిన్నం చేస్తుండటంతో గ్రామస్తుల తిరుగుబటు మొదలైంది. ఈ నేపథ్యంలో ఇసుక రవాణా తీరును ప్రశ్నించటం.. సరైన సమాధానం రాని కారణంగా అడ్డగించటం ఆందోళనలకు పూనుకోవటంతో నేరెళ్ల అందరి నోళ్లల్ల నానుతోంది..

ఈ కారణంగా ఆ గ్రామంలో ఎందరో గాయపడ్డారు. మరికొందరు ప్రాణాలు పోగొట్టుకున్నారు.. ప్రమాదాల తీవ్రత ఎంత అంటే ప్రమాదాలకు గురైన వారు కోలుకోకముందే మరెవరో గాయపడటం ప్రాణాలు కోల్పోయిన సంఘటన మరువకమునుపే మరెవరికో ఆపద వాటిల్లటం..

ఇసుక రీచులనుండి కోట్లు తవ్వుకోవటం తెలిసిన కాంట్రాక్టర్లు గ్రామంలో వేగాన్ని నియంత్రించే స్పీడ్ బ్రేకర్లు తగు జాగ్రత్తలు చేపట్టక పోవటంతో రోడ్లు తదితర సహజ వనరుల విధ్వంసంతోపాటు ప్రాణాలను మూల్యంగా చెల్లించాల్సి వస్తోంది..

దుమ్ము ధూళి వాహనాల పొగ లౌడ్ హారన్ల రోదనలతో వాతావరణ కాలుష్యం గ్రామాన్నీ ప్రశాంత పల్లె జీవనాన్నీ అన్ని విధాలా విచ్ఛిన్నం చేస్తుండటం తో గ్రామస్తుల తిరుగుబటు మొదలయ్యింది. ఈ నేపథ్యంలో ఇసుక రవాణా తీరును ప్రశ్నించటం.. సరైన సమాధానం రాని కారణంగా అడ్డగించటం ఆందోళలకు పూనుకోవటం తో నేరెళ్ళ అందరి నోళ్ళల్ల నానుతోంది..

ఉధ తమైన ఆందోళనలో భాగంగా స్థానికుల్లో కొందరు తీవ్ర ఆగ్రహానికి లోనై ఇసుక రవాణా లారీలకు నిప్పు పెట్టటంతో నేరెళ్ళ యుద్ధభూమిగా మండుతోంది..

ఇసుక కాంట్రాక్టర్లకు సంబందించిన విలువైన వాహనాలను దగ్ధం చేశారన్న కారణంగా అ ఊరికి చెందిన దళితులు వెనుకబడిన తరగతులకు చెందిన వారిని చిత్రహింసల పాలు చేశారు.. ఎంతంటే సభ్య సమాజం సిగ్గుతో తల దించుకునేంత.. మనిషిలో ఆటవికత్వం ఇంకా మిగిలే ఉంది అన్నంత..

వాహనాలు తగులబెట్టి ప్రైవేట్ ఆస్తులను ధ్వంసంచేయటం నేరమే.. ప్రక తిని విధ్వంసం చేసిన ఇసుక మాఫియా చర్యలను నేరంగా పరిగణించని నిర్లక్ష్యం ఫలితంగానే ఆ సంఘటన చోటు చేసుకుంది అన్న విషయమూ వాస్తవమే.

ఉద్యమాల ఊపిరి మెట్లపై నడిచొచ్చి ప్రభుత్వ గద్దెనెక్కిన నేత నిన్నటి దారి మరిచినట్టున్నాడు అందుకే నేడు ప్రజాందోళనల పట్ల ఆక్షేపణ వ్యక్తమౌతోందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయ్..

గాయపడిన హక్కులను ఓదార్చేందుకు అభ్యుదయ శక్తులు తదితర మేధావివర్గాలు కలిసి సాగుతున్నాయ్..నేరెళ్ళ గుండె గాయంపై మానవత్వ పిట్టలు మందు రాస్తున్నాయ్.


సెల్ : 9346611455

ఈ పేజీ మీ అందరిది

ఇక్కడ వ్యక్తమయ్యే అభిప్రాయాలు వ్యాసకర్తల వ్యక్తిగతం. నవతెలంగాణ అభిప్రాయాలు కానవసరం లేదు. 4000 క్యారెక్టర్ల లోపు ఉన్న వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. ఎట్టి పరిస్థితుల్లోను 6000 క్యారెక్టర్లకు మించకుండా పంపించండి. లేనట్లయితే ఎడిటింగ్‌లో మీరు చెప్పదలచిన అభిప్రాయాలు స్పష్టత కోల్పోవచ్చు. వివిధ ప్రజాసమస్యలపై రాసిన వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. వ్యాస రచయితలు వారి ఫొటో, సెల్‌నెంబర్ ఇవ్వాలి. - ఎడిటర్

మీ రచనలు పంపవలసిన చిరునామా :

email: vedika@ navatelangana.com Postal Addres: M.H.Bhavan,plot No,21/1, Azamabad, Near RTC Kalayana mandapam,Hyderabad500020. Ph:27665420,27673787,9490099077/78. Fax:040-27652228





భావోద్వేగభరిత ఇరానియన్ చిత్రాలు

ప్రపంచ సినిమాల్లో ఇరానియన్ చిత్రాలకు ఓ ప్రత్యేకత ఉంది. వాస్తవికతకు దగ్గరగా, అత్యంత సహజంగా ఉండటమే ఇందుకు కారణం. కుటుంబ వ్యవస్థ, మానవ సంబంధాలు, అనుబంధాలు, భావోద్వేగాలను వెండితెరపై ఆవిష్కరించడంలో ఇరానియన్ సినిమాలు వాటికవే సాటి. ఈ చిత్రాల స్ఫూర్తి, ప్రేరణతో విశ్వవ్యాప్తంగా ఎన్నో భాషల్లో సినిమాలు రూపొంది విశేష ప్రేక్షకాదరణ పొందడం విశేషం. మనసు పొరల్ని సున్నితంగా స్పృశించే కొన్ని ఇరానియన్ చిత్రాల గురించి ఈ వారం అందిస్తున్న స్పెషల్ 'షో'...

ఐస్ ఏజ్

బాబాక్, మనిజెహ్ భార్యభర్తలు. వీరి వైవాహిక జీవితం విజయవంతంగా పదేండ్లు పూర్తి చేసుకుంది. సాఫీగా సాగుతున్న వీరి జీవితంలో దుర్భర పరిస్థితులు చోటు చేసుకుంటాయి. సామాజికంగా, ఆర్థికంగా వచ్చిన ఇబ్బందులను, అడ్డంకులను అధిగమించడానికి బాబాక్ విపరీతంగా శ్రమిస్తుంటాడు. ఈ క్రమంలో వీరిద్దరి మధ్య దూరం పెరగటంతో భార్య మరో వ్యక్తికి దగ్గరవుతుంది. ఆ తర్వాత బాబాక్ తెలుసుకున్న నిజమేంటి?, చివరికి వీరి కథ ఎలా ముగిసిందనేది సినిమా. ఆర్థిక, సామాజిక ఇబ్బందులు ఎలాంటి పరిస్థితులకు దారితీస్తాయనేది ఈ చిత్రంలో దర్శకుడు ముస్తఫా కైయీ అద్భుతంగా చూపించారు. 2015లో విడుదలైన ఈ చిత్రంలో బాబాక్ పాత్రలో ఫర్హాద్ అస్లానీ, మనిజెహ్ పాత్రలో సహర్ డోలాత్షాహిల నటన ఆకట్టుకుంటుంది.























లైఫ్ ప్లస్ వన్ డే

చిన్న కూతురు సోమాయి ఇంటిని మొత్తం తనే చూసుకుంటూ పెద్ద దిక్కుగా ఉంటుంది. ఫ్యామిలీ అంతా అనారోగ్య సమస్యలతో బాధపడుతుంటారు. అందులో తల్లి తీవ్ర అనారోగ్యంతో దీనస్థితిలో ఉంటే, అన్నయ్య డ్రగ్స్‌కి బానిసవుతాడు. పెద్దన్నయ్య మోసపూరితమైన వైఖరితో డబ్బు గుంజాలని చూస్తుంటాడు. సోదరి డిజార్డర్‌తో, తమ్ముడు చిల్లర పనులు చేస్తూ ఉంటాడు. ఇలా ఎవరికి వారు తమ ధోరణిలో ఉంటారు. ఈ నేపథ్యంలో పెళ్ళీడుకొచ్చిన సోమాయికి ఓ సంపన్న ఆఫ్ఘాన్ కుటుంబానికి చెందిన మంచి పెళ్ళి సంబంధం వస్తుంది. సోమాయి పెళ్ళి చేసుకుని వెళ్ళిపోయాక ఆ కుటుంబం సమస్యల వలయం నుంచి ఎలా బయటపడిందనేది ఈ చిత్ర ఇతివృత్తం. సయీద్ రూస్టాయ్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం కుటుంబం అనుబంధాలను, బాధ్యతను, సమస్యలను అనేక కోణాల్లో వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించింది. ఇందులో సోమాయి పాత్రలో పరినాజ్ ఇసడియర్, ఇతర ప్రధాన పాత్రల్లో పెయ్మాన్ మోయడీ, నవిద్ మహమ్మద్‌జదెహ్ తదితరులు నటించి మెప్పించారు. అత్యంత సహజంగా సాగే ఈ చిత్రం విమర్శకుల ప్రశంసలందుకుంది.

ఐ యామ్ ఏ మదర్

తనని అత్యాచారం చేసేందుకు పాల్పడిన సయీద్ అనే వ్యక్తిని అవా హత్య చేస్తుంది. దీంతో ఆమెకు కొన్నేండ్లు జైలు శిక్ష పడుతుంది. హంతకురాలిగా జైల్లో అవా ఎటువంటి ఇబ్బందులు పడింది?, తన ప్రియుడికి, అత్యాచారం చేయబోయిన సయీద్‌కి ఉన్న సంబంధం ఏంటనేది ఈ చిత్ర కథాంశం. ఆద్యంతం నాటకీయంగా సాగే ఈ ఇరానియన్ చిత్రాన్ని దర్శకుడు ఫెరిడౌన్ జేరేని రూపొందించారు. 2012లో విడుదలైన ఈ సినిమా విమర్శకుల ప్రశంసలతోపాటు కలెక్షన్ల పరంగా సత్తా చాటింది. ఇందులో అవా పాత్రలో బరన్ కొసరి, సయీద్ పాత్రలో హబీబ్ రెజాయి నటించారు. ముఖ్యంగా బరన్ కొసరి నటన ప్రేక్షకుల్ని మంత్రముగ్ధుల్ని చేస్తుంది.

ది పాస్ట్

ఇరాన్‌కు చెందిన అహ్మద్ నాలుగేండ్ల పాటు ఫ్రాన్స్‌లో ఉంటాడు. అహ్మద్‌కు భార్య, ఇద్దరు పిల్లలుంటారు. భార్య మారీతో విభేదాలు రావడంతో విడాకులు తీసుకుని అహ్మద్ తిరిగి ఇరాన్ వెళ్ళిపోయేందుకు సన్నాహాలు చేస్తుంటాడు. ఈ క్రమంలో మారీ మరో వ్యక్తితో సన్నిహితంగా ఉన్నట్టు తెలుసుకుంటాడు. అంతేకాదు ఆమె గర్భవతి కూడా అని తెలుస్తుంది. ఈ నేపథ్యంలో ఆమె నుంచి అహ్మద్ దూరమయ్యాడా?, మారీ మరో వ్యక్తితోనే జీవితం కొనసాగించిందా?, చివరికి కథ ఎలాంటి మలుపులు తిరిగిందనేది సినిమా. అస్గర్ ఫర్హాది దర్శకత్వంలో రూపొందిన ఈ డ్రామా చిత్రం 2013లో విడుదలైన విశేష ప్రేక్షకాదరణతోపాటు విదేశీ విభాగంలో ఆస్కార్‌కు నామినేట్ అయ్యింది. ఇందులో అహ్మద్ పాత్రలో అలీ మోస్సాఫా, మారీ పాత్రలో బెరినెస్ బెజో నటన ప్రేక్షకులను కట్టిపడేస్తుంది.


గోల్డ్ అండ్ కాపర్

ఇరాన్‌కు చెందిన సయీద్ రెజాకు ఇద్దరు పిల్లలు, భార్య జహ్రా ఉంటారు. ఓ భయంకరమైన వ్యాధితో భార్య జహ్రా బాధపడుతుండటంతో ఇంటి పనులతోపాటు పిల్లల ఆలనా పాలనా మొత్తం సయీదే చూసుకోవాల్సి వస్తుంది. ఓ పక్క ఇంటి బాధ్యతలను నెరవేరుస్తూనే మరో పక్క ముస్లిం సాహిత్యాన్ని అభ్యసిస్తుంటాడు. ఈ క్రమంలో అనుకోకుండా ఓ రోజు భార్య కింద పడిపోతుంది. హాస్పిటల్ నుంచి వచ్చినప్పట్నుంచి ఆమె ప్రవర్తనలో వచ్చిన మార్పుతో వీళ్లిద్దరికి రోజూ గొడవలవుతుంటాయి. దీంతో చివరికి వీరి జీవితం ఎలాంటి మలుపులు తిరిగిందనేది సినిమా. ముస్లిం కుటుంబాల్లో ఉన్న పరిస్థితితోపాటు మానవ సంబంధాల నేపథ్య ప్రధానంగా చూపించిన ఈ చిత్రానికి హోమాయున్ అస్టాడియన్ దర్శకత్వం వహించారు. 2011లో విడుదలైన ఈ సినిమా ఫజ్ర్ అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శితమైంది. ఇందులో సయీద్ రెజా పాత్రలో బెరూజ్ షోయబీ, జహ్రా పాత్రలో నెగార్ జాహేరియన్ నటించి మెప్పించారు.

షో







ది సేల్స్‌మ్యాన్

భార్యాభర్తలైన ఎమాద్, రానాలు నాటకాల్లో నటిస్తూ లైఫ్‌ని లీడ్ చేస్తుంటారు. ఆర్థర్ మిల్లర్ ఫేమస్ నాటకం 'డెత్ ఆఫ్ ఏ సేల్స్‌మ్యాన్' నాటకం కోసం రిహార్సల్ చేస్తున్న క్రమంలో బలవంతంగా ఓ అపార్ట్‌మెంట్‌లో రెంట్‌కు ఉండాల్సి వస్తుంది. ఆ సమయంలో భార్య రానాపై దాడి జరుగుతుంది. దానికి కారణం ఎవరు? వారుండే ఇంట్లో గతంలో ఏం జరిగింది?, అనంతరం వీరిమధ్య ఎలాంటి సంఘర్షణ చోటు చేసుకుందనే ఆసక్తికర అంశాల సమాహారమే ఈ చిత్రం. అస్గర్ ఫర్హాది దర్శకత్వంలో 2016లో రూపొందిన ఈ చిత్రం సంచలన విజయం సాధించింది. విమర్శకులను సైతం మెప్పించి, ప్రేక్షకులనూ మంత్రముగ్ధుల్ని చేసింది. గతేడాది విదేశీ విభాగంలో ఆస్కార్ అవార్డు సొంతం చేసుకుని, కేన్స్‌లోనూ ప్రదర్శితమైంది. ఇందులో షహబ్ హోస్సెనీ, తరణె అలిదూస్తీల నటన ప్రేక్షకులను కట్టిపడేస్తుంది. భావోద్వేగ భరితమైన డ్రామాను ఈ చిత్రం అద్భుతంగా వెండితెరపై ఆవిష్కరించింది.

బాడీగార్డ్

సూసైడ్ బాంబర్ నుంచి ఓ పెద్ద రాజకీయ నాయకుడిని ఒక ప్రభుత్వ బాడీగార్డ్ ప్రాణాలతో కాపాడతాడు. అందుకు అతని ధైర్యాన్ని మెచ్చుకోక పోగా, తన నిజాయితీని, నిబద్ధతను ప్రశ్నించడం మొదలు పెడతారు. దీంతో తన నిబద్ధతే ప్రశ్నార్థకంగా మారుతుంది. ఈ నేపథ్యంలో ఆ బాడీగార్డ్ తానేంటో నిరూపించుకోవడం కోసం ఏం చేశాడనే దాన్ని దర్శకుడు ఇబ్రహీం హటమికై అత్యద్భుతంగా తెరపై ఆవిష్కరించారు.

2016లో విడుదలైన ఈ చిత్రం విమర్శకుల ప్రశంసలందుకుంది. కలెక్షన్ల పరంగానూ సత్తా చాటింది. ముఖ్యంగా బాడీగార్డ్ పాత్రలో నటించిన పార్వీజ్ పారాస్తియ్ నటన ప్రేక్షకులను మెస్మరైజ్ చేస్తుంది.

ఏ క్యూబ్ ఆఫ్ షుగర్

ఇరాన్‌లోని ఓ పాత నగరంలో ఉన్న ఒక పురాతన ఇంటిలో ఓ కుటుంబం నివసిస్తూ ఉంటారు. ఆ కుటుంబంలో నలుగురు ఆడపిల్లలు. ముగ్గురికి పెళ్ళిళ్లు అయిపోయాయి. చివరి అమ్మాయికి పెళ్ళి కుదరడంతో బంధువులంతా ఇంటికి వస్తారు. పెళ్ళి పనుల్లో ఇల్లంతా సందడిగా ఉంటుంది. పెళ్ళికి సన్నాహాలు జరుగుతున్న క్రమంలో అనుకోకుండా ఓ సంఘటన చోటు చేసుకుంటుంది. ఇంతకి ఆ సంఘటనేంటి?, పెళ్ళి జరిగిందా ? లేదా అనేదే సినిమా. ఇరాన్ సంస్కృతిని, ముస్లిం గైడెన్స్‌ను తప్పుదోవ పట్టించేదిగా ఉందంటూ ఈ చిత్రాన్ని కొన్ని రోజులు ప్రభుత్వం బహిష్కరించింది. కానీ పలు ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో ప్రదర్శితమై అందరి ప్రశంసలందుకుంది. పెళ్ళి కూతురు పాత్రలో నెగర్ జాచేరియన్ నటన అద్భుతంగా ఉంటుంది.

హిస్స్ దోఖ్‌తారా ఫరీద్ నేమిజానంద్

శిరిన్ అనే యువతికి ఇంట్లో వాళ్ళు చూసిన రెండు సంబంధాలు దాదాపు పెళ్ళి వరకు వచ్చి ఫెయిల్ అవుతాయి. మూడోసారి కూడా ఇంట్లో వాళ్ళు శిరిన్‌కి ఓ సంబంధం చూస్తారు. మరికొన్ని గంటల్లో పెళ్ళి జరుగుతుందనగా, అనుకోకుండా ఓ ఘటన చోటు చేసుకుంటుంది. దీంతో మానసిక పరిస్థితి గందరగోళం కారణంగా శిరిన్ ఓ మర్డర్ కేసులో ఇరుక్కుంటుంది. దీని తర్వాత ఆమె జీవితం ఎలాంటి మలుపులు తిరిగింది?, చిన్నప్పుడు తన జీవితంలో చోటు చేసుకున్న చీకటి రోజు ఏంటి అనేది మిగిలిన సినిమా కథ. పౌరాణ్ దరాఖ్షాన్దే దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ఒక అమ్మాయిలోని సంఘర్షణను ఆవిష్కరించింది. మధ్య తరగతి కుటుంబంలో పెళ్ళి చేయాలంటే ఎలాంటి అవరోధాలుంటాయనేది కళ్ళకు కట్టినట్టు చూపించింది. శిరిన్ పాత్రలో టన్నజ్ తబటాబేయి నటన అలరిస్తుంది.

ది పేయింటింగ్ పూల్

దివ్యాంగులైన భార్యభర్తలకు ఎలాంటి లోపాలు లేని ఓ కుమారుడు జన్మిస్తాడు. ఈ భార్యభర్తలు తమ సమస్యను అధిగమించేందుకు చేయని ప్రయత్నమంటూ లేదు. ఈ క్రమంలో ఈ తల్లిదండ్రులకు, ఆ కుమారుడికి మధ్య చోటు చేసుకున్న సంఘర్షణ, వారి అనుబంధం, తమ సమస్యలను అధిగమించేందుకు వారు చేసే పోరాటం ఎలా సాగిందనేది సినిమా. మాజార్ మిరి దర్శకత్వంలో 2013లో విడుదలైన ఈ చిత్రం విశేష ప్రేక్షకాదరణ పొందింది. దివ్యాంగులైన కుటుంబంలోని ఇబ్బందులను ప్రతిబింబించిన ఈ చిత్రంలో భార్యభర్తల పాత్రల్లో షహాబ్ హోస్సెని, నీగర్ జాహేరియన్‌ల నటన మనసు పొరలను సున్నితంగా స్పృశిస్తుంది.

గష్త్ ఇ ఇర్షద్

పేద కుటుంబంలో జన్మించిన ముగ్గురు యువకులు చిన్న చిన్న పనులు చేస్తూ శ్రామికులుగా జీవిస్తుంటారు. ఇలాగైతే ఎక్కువ డబ్బు సంపాదించలేమని మాయమాటలు చెబుతూ జనాన్ని మోసం చేస్తుంటారు. విచిత్ర దుస్తులు ధరించిన వీరిని పోలీసులు తరచూ అరెస్ట్ చేస్తుంటారు. విచిత్ర దుస్తులు ధరించిన ఈ ముగ్గురు యువకుల బండారం చివరకు బయటపడిందా? వారిని పోలీసులు అరెస్ట్ చేశారా లేదా అనేదే సినిమా. ఆద్యంతం హాస్యభరితంగా సాగే ఈ చిత్రాన్ని సాయిద్ సోహీలి రూపొందించారు. కామెడీ చిత్రంగా మంచి ఆదరణ పొందిన ఈ సినిమాలో ముగ్గురు యువకుల పాత్రల్లో హమీద్ ఫర్రోఖ్నేహాడ్, పౌలాడ్ కిమియా, సాద్ సోహీలి నటించారు.

స్పెషల్ లైన్

హ్యాకర్స్ గ్రూప్‌కు చెందిన బ్యాంక్ ఎకౌంట్స్‌లో మనీ అంతా ఖాళీ అవుతుంది. ఆ డబ్బును మరొక హ్యాకర్ గ్రూప్ కొట్టేస్తుంది. దీంతో ఆ డబ్బును ఈ హ్యాకర్స్ గ్రూప్ కట్టాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో హ్యాకర్స్ గ్రూప్ ఏం చేసిందనేది సినిమా. ఆద్యంతం కామెడీని పంచే ఈ చిత్రాన్ని దర్శకుడు మోస్తాఫా కీయే కామెడీ, క్రైమ్ డ్రామాగా తెరకెక్కించారు. 2014లో విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించింది. ఇక ఇందులో సామ్ ఘూరీబియన్, మిత్రా హజార్, పరినాజ్ ఇజడియర్‌లు నటించి ఆకట్టుకున్నారు.

ఫర్ పూనేహ్ సేక్


మజిద్ ఇరాన్‌కు చెందిన మధ్యవయస్కుడు. మధ్యతరగతి కుటుంబానికి చెందిన వ్యక్తి కూడా. సాంప్రదాయాలకు విలువిచ్చే వ్యక్తి. అతని భార్య పూనెహ్ విభిన్న నేపథ్యానికి చెందిన మహిళ. ఆమె ఆలోచన విధానం సైతం భిన్నంగా ఉంటుంది. భార్యపై అనుమానంతో మజిద్ మద్యానికి బానిసవుతాడు. దీంతో తరచూ ఇంట్లో గొడవలు జరిగి, అనేక సమస్యలు ఎదురవుతుంటాయి. వాటిని ఈ జంట ఎలా ఎదుర్కొన్నారనే కథాంశంతో దర్శకుడు హేటెఫ్ అలిమర్దాని ఈ చిత్రాన్ని ఆద్యంతం వినోదాత్మకంగా రూపొందించారు. 2013లో విడుదలైన ఈ చిత్రంలో మజిద్ పాత్రలో ఫర్హాద్ అస్లాని, పూనెహ్ పాత్రలో హానీ తవాస్సోలి నటించారు.

ఎట్ ది ఎండ్ ఆఫ్ 8 స్ట్రీట్

సంతోషకరమైన జీవితం కొనసాగిస్తున్న నిలోఫర్ కుటుంబంలో అనుకోకుండా ఓ సంఘటన జరుగుతుంది. దీంతో నిలోఫర్ కుటుంబమంతా తీవ్ర కష్టాల్లో, సమస్యల్లో కూరుకుపోతారు. కుటుంబాన్ని కాపాడుకోవాలంటే నిలోఫర్‌కి మూడే మూడు రోజుల టైమ్ మాత్రమే ఉంటుంది. దీని కోసమై నిలోఫర్‌కి పెద్ద మొత్తంలో డబ్బు అవసరమవుతుంది. మరి నిలోఫర్ ఆ డబ్బు సంపాదించడానికి ఎలాంటి కష్టాలు పడింది?, చివరికి తన కుటుంబాన్ని కాపాడుకుందా, లేదా? అనే కథాంశంతో ఆద్యంతం ఉత్కంఠభరితంగా దర్శకుడు అలిరేజా అమిని ఈ చిత్రాన్ని రూపొందించారు. 2012లో విడుదలైన ఈ సినిమా విశేష ప్రేక్షకాదరణతోపాటు కలెక్షన్ల పరంగానూ సత్తా చాటింది. ఇందులో నిలోఫర్ పాత్రలో తరణె అలిడోయోస్టి నటన మంత్రముగ్ధుల్ని చేస్తుంది.

ఫెసిలిటీ ల్యాండ్

ఓ మూడు జంటలు బర్త్‌డే పార్టీ రోజు కలుసుకుంటారు. ఈ సందర్భంగా తమ జీవితంలో జరిగిన చేదు జ్ఞాపకాలను, సరదా సన్నివేశాలను గుర్తు చేసుకుంటారు. మరి వారి జీవితంలో చోటు చేసుకున్న ఆ సంఘటనలేంటనేదే సినిమా. ఆద్యంతం నాటకీయంగా సాగే ఈ చిత్రాన్ని దర్శకుడు మాజార్ మిరి 2014లో రూపొందించారు. విమర్శకుల ప్రశంసలందుకున్న ఈ చిత్రం పలు అవార్డులను సొంతం చేసుకుంది. ఇందులో హామెడ్ బెహద్ద్, యాసిగా లీల, మహ్నాజ్ అఫ్షార్, బహ్రాంగా హుస్సెన్ యారీ, అమీర్ అఘేయి ప్రధాన పాత్రల్లో నటించారు.

















కార్పొరేట్ కంపెనీలకు రాయితీలు...
ఉపాధినిచ్చే పరిశ్రమలపై పన్నులా?

'గ్రానైట్'పై జీఎస్టీ తగ్గించే వరకూ పోరాటం

- ఆమరణ నిరాహారదీక్షకు సీపీఐ(ఎం) మద్దతు
- ఖమ్మంలో భారీ ప్రదర్శనం
- గ్రానైట్ పరిశ్రమపై నిర్లక్ష్యం : ఎంపీ రేణుకాచౌదరి
- జర్నలిస్టులు, పలు పార్టీల నాయకుల సంఘీభావం



నవతెలంగాణ-ఖమ్మం ప్రతినిధి

బ్యాంకులకు వేల కోట్లు అప్పులు ఎగ్గొట్టిన కార్పొరేట్ కంపెనీలకు రూ.7లక్షల కోట్లు రాయితీలిచ్చిన.. కేంద్రం 20లక్షల మందికి అన్నంపెట్టే గ్రానైట్ పరిశ్రమపై 2శాతంగా ఉన్న పన్నును 28శాతానికి పెంచిందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు విమర్శించారు. జీఎస్టీ బిల్లును వ్యతిరేకిస్తూ గ్రానైట్ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం నుంచి ఖమ్మంలో ఆమరణ నిరాహారదీక్షకు దిగిన విషయం విదితమే. దీక్షా శిబిరాన్ని పోతినేని ఆదివారం సందర్శించి సంఘీభావం తెలిపారు. ఇంత పెద్దఎత్తున గ్రానైట్ ఉద్యమం రూపం దాల్చడం శుభపరిణామం అన్నారు. ఈ ఉద్యమంతో కేంద్ర ప్రభుత్వానికి దిమ్మదిరిగేలా చేయాలన్నారు. గ్రానైట్ అసోసియేషన్ ఆందోళనకు సీపీఐ(ఎం) సంపూర్ణ మద్దతిస్తుందని చెప్పారు. సబ్‌కే సాత్ సబ్‌కే వికాస్ అని చెప్పిన మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత అంబానీకే సాత్, ఆదానీకే వికాస్‌లా మార్చారని ఎద్దేవా చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరావు మాట్లాడుతూ.. మొదట్లో జీఎస్టీని ఆమోదించిన కేసీఆర్.. ఆ తర్వాత దానివల్ల రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులపై రూ.19వేల కోట్ల భారం పడుతుందని చెబుతున్నారని అన్నారు.

రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి మాట్లాడుతూ.. ప్రభుత్వం దేశంలోని చిన్నతరహా పరిశ్రమలను మూసేసేందుకు కుట్ర పన్నుతోందని విమర్శించారు. ఉపాధి కల్పిస్తున్న గ్రానైట్ పరిశ్రమను మోడీ సర్కారు తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందన్నారు. గతంలో తాను గ్రానైట్ అసోసియేషన్ నాయకులతో కలిసి కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీని కలిసి సమస్య వివరించినా పట్టించుకోలేదన్నారు. సీపీఐ(ఎం) అనుబంధ రైతుసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి నున్నా నాగేశ్వరావు మాట్లాడుతూ.. ఇది గ్రానైట్ యజమానుల, కార్మికుల సమస్య మాత్రమే కాదని, యావత్ జిల్లా ప్రజల సమస్యగా పరిగణించాలన్నారు. కేసీఆర్‌కు నిజంగా జీఎస్టీని వ్యతిరేకించే ఆలోచన, గ్రానైట్ రంగాన్ని పరిరక్షించాలన్న చిత్తశుద్ధి ఉంటే గ్రానైట్ అసోసియేషన్‌తో కలిసి ధర్నాకు దిగాలన్నారు. తెలుగు రాష్ట్రాల్లో సీఎంలిద్దరూ అభివృద్ధిలో పోటీపడకుండా, మోడీని ప్రసన్నం చేసుకునే పనుల్లో పోటీపడుతున్నారని ఎద్దేవా చేశారు.

రాష్ట్ర పరిశ్రమాభివృద్ధి సంస్థ చైర్మన్, టీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు బుడాన్‌బేగ్ మాట్లాడుతూ... గ్రానైట్ యజమానులు చేపట్టిన ఆమరణ నిరాహారదీక్ష న్యాయమైందన్నారు. ప్రభుత్వం గ్రానైట్ పరిరక్షణకు జీఎస్టీ పన్ను తగ్గించాలని, ఇప్పటికే కేంద్రానికి లేఖ రాసినట్టు తెలిపారు. సీపీఐ జిల్లా కార్యదర్శి భాగం హేమంతరావు మాట్లాడుతూ.. గ్రానైట్ సమస్య పరిష్కారానికి కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు అఖిలపక్షాన్ని జీఎస్టీ కౌన్సిల్ వద్దకు తీసుకెళ్లాలన్నారు. టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, సయ్యద్ ఇస్మాయిల్ మాట్లాడుతూ.. గ్రానైట్ అసోసియేషన్ చేపట్టిన దీక్షలకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామన్నారు. అవసరమైతే హైదరాబాద్‌కు తాము కూడా కలిసి నడుస్తామన్నారు.

ఖమ్మంలో సీపీఐ(ఎం) భారీ ప్రదర్శన

ఆమరణ నిరాహారదీక్షకు మద్దతుగా సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు బత్తుల లెనిన్, యర్రా శ్రీకాంత్, ఐద్వా కేంద్ర కమిటీ సభ్యురాలు అఫ్రోజ్ సమీనా, డీవైఎఫ్ఐ, గ్రానైట్, టైల్స్ అసోసియేషన్ల నాయకులు పాల్గొన్నారు.

పత్తి పైరు ధ్వంసం చేసిన అధికారులు

- పట్టాలున్నా పట్టించుకోని ఫారెస్ట్ ఆఫీసర్స్



నవతెలంగాణ-నెన్నెల

ఓ పేద కుటుంబం సాగుచేసుకుంటున్న పత్తి పైరు అటవీ శాఖ అధికారులు ధ్వంసం చేశారు. పట్టాలున్నాయని కాళ్లావేళ్లా పడ్డా పట్టించుకోకుండా మొక్కలను పీకేశారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

మంచిర్యాల జిల్లా నెన్నల మండలం నందులపల్లి గ్రామానికి చెందిన ఇందూరి ఎంకుకు 1995లో అప్పటి టీడీపీ ప్రభుత్వం 672 సర్వేనెంబర్‌లో మూడెకరాల భూ పంపిణీ చేసింది. ఎంకు భర్త బతికుండగా సదరు భూమిలో జొన్నలు, పెసరు సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవారు. ఆయన మరణానంతరం కొన్నేండ్లుగా భూమి బీడుగానే మిగిలింది. మూడేండ్ల నుంచి ఎంకు కొడుకు మల్లేష్ నువ్వుల పంట పండించాడు. ఈయేడు పత్తిసాగు సాగుచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో శనివారం ఆ భూమి వద్దకు వెళ్లిన ఫారెస్ట్ అధికారులు వారిపై దౌర్జన్యానికి దిగారు. అటవీ శాఖకు చెందిన స్థలమంటూ మొక్కలను పీకివేసేందుకు యత్నించారు. బాధితులు ఎంత బతిమాలినా పట్టించుకోకుండా అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆదివారం ఉదయం పంటకు ఎరువులు వేసేందుకు వెళ్లేసరికే బీట్ ఆఫీసర్లు రమేశ్, కామరాజు, అటవీశాఖ సిబ్బంది మూడెకరాల్లోని పత్తి మొక్కలను పీకేశారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించి నష్టపరిహారం చెల్లించాలని బాధితురాలు ఎంకు కన్నీరుమున్నీరుగా విలపించింది. అయితే, అదే సర్వే నెంబర్‌లో కొందరు నాయకులు 30 ఎకరాల వరకు సాగుచేసు కుంటున్నా అధికారులు వారి జోలికెళ్లడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

జలవిద్యుత్‌పై జెన్‌కో దృష్టి

(మొదటిపేజీ తరువాయి)

ఈ రిజర్వాయర్‌లోకి వచ్చి చేరితే 3.4 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి సాధ్యమౌతుంది. శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో ఇప్పటి వరకు ఎలాంటి ఇన్‌ఫ్లోలు లేవు. అయితే ఇటీవల ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడంతో ఈ రెండు జలాశయాల్లోకి వరదనీరు వచ్చి చేరుతుందని అంచనా వేశారు. అలాగే సింగూరు, నిజాంసాగర్, పోచంపాడు జలాశయాలతో పాటు కృష్ణా, గోదావరి బేసిన్‌లో వరద నీరు ఆశించిన స్థాయిలో వస్తే రోజువారీ 27.9 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని సాధించవచ్చని అధికారులు అంచనా వేశారు. దీనికోసం జలవిద్యుత్కేంద్రాలను ట్రయల్‌బేస్‌లో నడుపుతున్నారు. వచ్చే మూడు, నాలుగు రోజుల్లో రాష్ట్ర జలాశయాల్లోకి వరదనీరు వచ్చే అవకాశం ఉన్నట్టు జెన్‌కో ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. జలవిద్యుదుత్పత్తి ప్రారంభమైతే థర్మల్ విద్యుత్కేంద్రాల్లో తాత్కాలికంగా ఉత్పత్తిని తగ్గించడం లేదా నిలిపివేయడం చేస్తామని ఆ అధికారి తెలిపారు.

అదానీ చాపర్‌లోనే జైలుకి!

(మొదటిపేజీ తరువాయి)

ప్రధాని మోడీకి సన్నిహిత సంబంధాలున్న విషయం విదితమే. ఆస్ట్రేలియాలో బొగ్గు గనులు మొదలుకొని..ఎన్నో విధాలుగా అతనికి మోడీ పరోక్షంగా సహకరిస్తున్నారన్న వార్తలు వెలుగుచూస్తున్నాయి. వీటికితోడు డేరా సచ్చా బాబాకు బీజేపీతో ఉన్న బలమైన బంధాల కారణంగా వాదనకు బలం చేకూరుతున్నది. మోడీ,గుర్మీత్ వాడిన హెలికాప్టర్లపై AW..139 సేమ్ నెంబర్ ఉన్నది. అయితే, భారత్‌లో వినియోగించే AW..139 నెంబర్ కలిగిన చాపర్‌లు డజన్ల సంఖ్యలో ఉన్నాయట. మరోవైపు హర్యానా సర్కారు చాపర్ వివాదంపై స్పందిస్తూ..ఓ సంస్థ నుంచి అద్దెకు తీసుకున్నట్టు తెలిపింది. తిమ్మిని బమ్మి చేయగల సామర్థ్యం ఉన్న బీజేపీ అటు కేంద్రంలోనూ...ఇటు రాష్ట్రంలోనూ అధికారంలో ఉన్నది. ఈ నేపథ్యంలో గుర్మీత్‌కు సెక్యూరిటీ పేరుతో..హడావిడిలో అదానీని బీజేపీ పెద్దలు పురమాయించినా ఆశ్చర్యపోనక్కర్లేదని పలువురు అంటున్నారు. రామ్‌రహీమ్‌తో పాటు చాపర్‌లో ఓ మహిళ ప్రయాణించటం చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా ఓ ఖైదీతో పాటు వారి బంధువులను ఎవరినీ అనుమతించరు. అయితే, ఆ మహిళ అతని కుమార్తె హనిప్రీత్‌గా అధికార వర్గాలు వెల్లడించాయి. ఇలాంటి బాబాలు ముందుగా అధికారంలో ఉండే పాలకులను నడిపిస్తే...ఆ తర్వాత వాళ్లు ప్రభుత్వాలను నడిపిస్తారని సోషల్ మీడియాలో కామెంట్లు హెూరు పుట్టిస్తున్నాయి..

గోవుల దొంగలంటూ..

(మొదటిపేజీ తరువాయి)

తీసుకొని ముగ్గురు యువకులు వెళ్తుండగా, వారిని దొంగలుగా అనుమానించిన గ్రామస్తులు రోడ్డు మూసివేసి అడ్డుకున్నారు. వారిలో ట్రక్కు డ్రైవర్‌గా భావిస్తున్న యువకుడు తప్పించుకొని పారిపోగా, మిగతా ఇద్దరినీ గ్రామస్తులు కొట్టి చంపారు. ట్రక్కు నుంచి పశువుల్ని బయటకు తీసి ట్రక్కును తగులబెట్టారు. ఆ ప్రాంతంలో పశువుల దొంగతనాలు జరగుతున్నట్టుగా గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తమ పశువుల రక్షణ కోసం తామే బృందాలుగా ఏర్పడి కాపలా కాస్తున్నట్టు వారు తెలిపారు. అయితే, సెప్టెంబర్ 2న జరిగే బక్రీద్ కోసం సమీపంలోని మార్కెట్‌లో పశువుల్ని కొనుగోలు చేసి తీసుకువెళ్తుండగా ఈ సంఘటన జరిగిందా అన్న కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నట్టు ఓ సీనియర్ పోలీస్ అధికారి తెలిపారు. గ్రామస్తుల దాడి నుంచి తప్పించుకున్న డ్రైవర్ సమీపంలోని దూప్‌గురి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు తెలుస్తోంది. రెండు నెలల్లో బెంగాల్‌లో ఇది రెండో సంఘటన. జూన్ 23న ఉత్తరదినాజ్‌పూర్ జిల్లా చోప్రా గ్రామంలో ముగ్గురు వ్యక్తుల్ని గోవుల దొంగలుగా ఆరోపిస్తూ అతి దారుణంగా కొట్టి చంపారు.

డీఎస్సీ ఆశలో.. ఆగిన శ్వాస

(మొదటిపేజీ తరువాయి)

గుర్రై ప్రాణం వదిలాడు. ప్రయోజకులవుతారని ఎంతో కష్టపడి చదివించిన తల్లికి గుండెకోత మిగిలింది. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పట్టణంలో ఆదివారం జరిగింది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం...

పట్టణంలోని శాస్త్రినగర్‌కు చెందిన లక్ష్మయ్య-అంజమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. ఇద్దరు కుమార్తెల పెండ్లి చేశారు. కొడుకు రామక్రిష్ణ(30), కూతురు భాగ్యలక్ష్మి బీఈడీ పూర్తి చేశారు. మరో కొడుకు జ్ఞానేశ్వర్ కూలీ పనిచేస్తూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటున్నారు. తండ్రి లక్ష్మయ్య 2010లో అనారోగ్యంతో మృతిచెందాడు. దాంతో కుటుంబ భారం అంజమ్మపై పడటంతో చిన్నహోటల్ నడుపుతూ పిల్లలను పోషించుకుంటోంది. వచ్చే కొద్దిపాటి ఆదాయంతోనే పిల్లలిద్దరినీ బీఈడీ చేయించింది. వారు టెట్ పాసై మూడేండ్లుగా డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా రామకృష్ణ తల్లికి హోటల్ పనిలో సహకరించేవాడు. తనకు నచ్చని పనిచేయడం సిగ్గుగా ఉందని తరచూ తల్లితో ఆవేదన చెందేవాడు. డీఎస్సీ నోటిఫికేషన్ వెలువడకపోవడంతో తీవ్ర నిరాశకు లోనై నెల రోజుల నుంచి అన్నం తినడం మానేశాడు. కుటుంబీకులు ఎంత నచ్చజెప్పినా వినలేదు. చివరకు అనారోగ్యం బారినపడ్డాడు. ఆస్పత్రిలో చికిత్స చేయించినా ఫలితం లేక ఆదివారం మృతిచెందాడు.

రామకృష్ణ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి
సీపీఐ(ఎం) నాయకుడు ఎస్.చిరంజీవి

చేతికొచ్చిన కొడుకును కోల్పోయిన తల్లికి ప్రభుత్వం ఆధారం కల్పించాలని సీపీఐ(ఎం) నాయకుడు ఎస్.చిరంజీవి అన్నారు. హోటల్ నడుపుతూ పిల్లలను బీఈడీ చేయించిన తల్లికి కొడుకు మరణంతో తీరని శోకం మిగిలిందన్నారు. ప్రభుత్వం మూడేండ్లుగా డీఎస్సీ నిర్వహించకపోవడమే దీనికి కారణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే, అధికారులు స్పందించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ అమరవీరుల స్మారకదినం

(మొదటిపేజీ తరువాయి)

పెంచాలన్నా, సంస్కరణల్ని అమలు చేయాలన్నా ప్రభుత్వాలు వెనుకడుగు వేయక తప్పలేదు. అదే సమయంలో అప్పటి అధికార తెలుగుదేశం పార్టీని పదేండ్లకు పైగా ప్రతిపక్షానికే పరిమితం చేసి ప్రజలు తమ నిరసనను తెలిపారు. దేశవ్యాప్తంగా ఈ ఉద్యమం అప్పట్లో సంచలనం రేపింది. విద్యుత్ సంస్కరణల్ని అమలు చేసేందుకు దేశంలోని అన్ని రాష్ట్రాలు పునఃపరిశీలన చేసుకోవాల్సిన పరిస్థితుల్ని కల్పించాయి. ఈ ప్రజా పోరాటాన్ని చూసిన ప్రపంచబ్యాంకు తన విధానాల్నే సమూలంగా మార్పులు చేసుకోవాల్సి వచ్చింది.

ఆనాటి ప్రజా విద్యుత్ ఉద్యమంలో విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామి పోలీసుల బుల్లెట్లకు ఎదురొడ్డి, జనం కోసం తమ ప్రాణాల్ని తృణప్రాయంగా విడిచారు. పోలీసుల పాశవిక లాఠీల దాడిలో రామకృష్ణ అనే మరో ఉద్యమకారుడు తలపగిలి మరణించాడు. అప్పటి విద్యుత్ ఉద్యమ పోరాటాన్ని తలచుకుంటే ఇప్పటికీ ఒళ్లు గగుర్పొడుస్తుందని పోలీస్ బుల్లెట్ గాయాల బారిన పడి, కోలుకున్న జగదీష్ ఇప్పటికీ చెప్తుంటారు. ఆనాటి ప్రజాఉద్యమానికి చిహ్నంగా, ప్రజల కోసం ప్రాణాలర్పించిన వీరులకు సంతాపసూచకంగా బషీర్‌బాగ్ చౌరస్తా వద్ద స్మారక స్థూపాన్ని ఏర్పాటు చేశారు. సోమవారంనాడు ఈ స్థూపం వద్ద అమరులకు వామపక్షపార్టీలు నివాళులర్పించనున్నాయి.

మహిళ శవాన్ని తిన్న కుక్కలు

- లక్నో ప్రభుత్వాస్పత్రిలో దారుణం

లక్నో: ఓ వైపు మౌలిక సదుపాయాల లేమి.. మరోవైపు ఆస్పత్రివర్గాల నిర్లక్ష్యం...వెరసి ఓ మహిళ శవం.. వీధి కుక్కలపాలైన దౌర్భాగ్య పరిస్థితి తలెత్తింది. ఈ దారుణ ఘటన బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలోని రామ్ మనోహర్ లోహియా ఆస్పత్రిలో చోటు చేసుకున్నది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. చిన్హాట్ ప్రాంతానికి చెందిన పుష్పా తివారి(40) అనే మహిళకు ఫుడ్ పాయిజన్ కావడంతో ఆమెను శనివారం లోహియా ఆస్పత్రిలో చేర్పించారు. కాగా ఆమె చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి చనిపోయింది. అయితే పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మార్చురీ వద్ద ఎలాంటి భద్రతా ఏర్పాట్లు లేకపోవడంతో ఆమె శవాన్ని కుక్కలు తిన సాగాయి. కొన్ని అవయవాలను వేరు చేసి దూరంగా ఎత్తుకెళ్లాయి. మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. ఆస్పత్రివర్గాల నిర్లక్ష్యమే దీనికి ప్రధాన కారణమని తెలుస్తున్నది. ఘటనకు బాధ్యుల్ని చేస్తూ మార్చురీ గార్డు, సూపర్‌వైజర్, వార్డు బాయ్‌ను విధుల నుంచి తప్పించారు. ఘటనపై దర్యాప్తు చేసి, నివేదిక ఇవ్వాల్సిందిగా సంబంధిత అధికారులను ఆరోగ్య శాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ ప్రశాంత్ త్రివేది ఆదేశించారు.

భావితరాలకు స్వచ్ఛమైన గాలి, నీరే నిజమైన ఆస్తి

శాస్త్ర, సాంకేతిక పద్ధతుల్లో పర్యావరణ పరిరక్షణకు కృషి

- చెట్ల పెంపకం బాధ్యత
- పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ పర్యటన

నవతెలంగాణ-రఘునాథపాలెం/ కొత్తగూడెం

భావి తరాలకు స్వచ్ఛమైన గాలి, నీరు అందించడమే నిజమైన ఆస్తిగా గుర్తించి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని సైన్స్ అండ్ టెక్నాలజీ ఎన్విరాన్‌మెంట్ పార్లమెంటరీ కమిటీ చైర్మన్ గారపాటి రేణుకాచౌదరి అన్నారు. ఆమె నేతృత్వంలోని కమిటీ ఆదివారం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పర్యటనలో భాగంగా ఖమ్మం అర్బన్ మండలం వెలుగుమట్లలోని అర్బన్ పార్కు ప్రాంతంలో పర్యటించింది. అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించింది. పార్కులో సభ్యులు మొక్కలు నాటారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చైర్మన్ రేణుకాచౌదరి కమిటీ సభ్యులతో కలిసి మాట్లాడారు. సమాజంలో శాస్త్ర సాంకేతిక పద్ధతుల్లో వస్తున్న మార్పులకనుగుణంగా పర్యావరణాన్ని పరిరక్షించేందుకు కమిటీ కృషి చేస్తోందన్నారు. గంగానది తరహాలో గోదావరి నీటిని శుద్ధి చేసేందుకు ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్టు చెప్పారు. చెట్ల పెంపకానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. తమ కమిటీ దేశవ్యాప్తంగా పర్యటించి ఇప్పటి వరకు 300 నివేదికలను కేంద్ర ప్రభుత్వానికి అందించినట్టు తెలిపారు. సాగు, తాగునీటి సమస్యల గురించి కమిటీకి అనేక ఫిర్యాదులు వచ్చాయని, దేశవ్యాప్తంగా ఈ సమస్య ఉందన్నారు. ఇది పరిష్కారం కావాలంటే వర్షాలు కురవాలని, వర్షాలు కురవాలంటే పర్యావరణం ముఖ్యమని చెప్పారు. శాటిలైట్ సేవలను మారుమూల ప్రాంతాలకు విస్తరింపజేయడం ద్వారా ఏ భూమిలో ఏ పంట ఎప్పుడు వేయాలన్న దానిపై సూచనలివ్వడం జరుగుతుందన్నారు. అనంతరం పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య దంపతులను శాలువా కప్పి సన్మానించారు. భద్రాద్రి జిల్లా సుజాతనగర్, సింగరేణి కాలరీస్, పాల్వంచ, కేటీపీఎస్ ప్రాంతాల్లోని పరిశ్రమలను, గనులను, వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. భద్రాచలం పేపర్ బోర్డు వారు గోదావరిలోకి కలుషిత నీరు వదులుతున్న విషయాన్ని పరిశీలించనున్నట్టు తెలిపారు. కలుషిత నీరు వినియోగం జరిగితే హెవీ వాటర్‌ప్లాంట్ పరిశ్రమ కుప్పకూలే ప్రమాదముందని హెచ్చరించారు. గోదావరి నది గంగానది కావద్దని సూచించారు. కేటీపీఎస్‌లో ఫ్లైయాష్ పట్ల పలు ఫిర్యాదులు అందాయని, ఆ సంస్థ సీఎస్ఆర్ పాలసీ అమలు చేయడం లేదని రేణుకాచౌదరి వివరించారు. సింగరేణిలో ఉపరితల గనుల వల్ల నష్టాలున్నాయని, కావున దానికి సంబంధించి నిబంధనలు పాటించాలన్నారు. వీటి పరిశీలన అనంతరం భారత ప్రభుత్వానికి సైన్స్ అండ్ టెక్నాలజీ స్టాండింగ్ కమిటీ నివేదిక అందచేస్తుందని, దేశవ్యాప్తంగా పర్యావరణ సమస్యల పరిష్కారానికి సూచనలు, సలహాలు నివేదికలో పొందుపరచనున్నట్టు వివరించారు. కార్యక్రమంలో సైన్స్ అండ్ టెక్నాలజీ ఎన్విరాన్‌మెంట్ అండ్ ఫారెస్టు పార్లమెంటరీ కమిటీ సభ్యులు పంకజ్ చౌదరి, ఎస్ఆర్.బాలసుబ్రహ్మణ్యం, నామదేశ్వర్‌ప్రసాద్, వందనా చావన్, సీహెచ్.సుక్రాంసింగ్ యాదవ్, నాగేంద్రసింగ్, విక్రమ్ ఊసంది, నానభాహు ఫలంగరావ్ పటేల్, శివాజీ హద్రోల్ రావ్‌పాటిల్, సీపీ నారాయన్, పర్సనా ఆచార్య, ఈటీ.మహ్మద్ భషీర్, పీఎన్.పందయ్, రాజీవ్ సక్సేనా, హరిష్‌కుమార్, భీమ్‌సింగ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తక్కువ వేతన జాబ్స్‌తోనే తిప్పలు

(మొదటిపేజీ తరువాయి)

(ఎన్ఎస్ఎస్ఓ) విడుదల చేసిన 'ఎంప్లాయిమెంట్ అన్‌ఎంప్లాయిమెంట్ సర్వే' (ఈయూఎస్) గణాంకాల ప్రకారం గత మూడు దశాబ్దాల కాలంగా దేశంలో నిరుద్యోగిత తక్కువ స్థాయిల వద్ద స్థిరంగా ఉంటూ వస్తోందని పేర్కొంది. ప్రపంచ మార్కెట్లకు తగ్గట్టుగా ఉత్పత్తిని చేపట్టడం ద్వారానే మేకిన్ ఇండియా విజయవంతం కాగలదని నిటి ఆయోగ్ విశ్లేషించింది. దక్షిణ కొరియా, తైవాన్, సింగపూర్, చైనా వంటి దేశాలు అవలంబిస్తున్న విధానాలను ఇందుకు తార్కాణంగా ఉదహరించింది. కాంట్రాక్ట్ కార్మికుల స్థానంలో స్థిర ఉద్యోగాలను ప్రోత్సహించాలని సర్కారుకు తెలిపింది. పెద్దమొత్తంలో ఉత్పాదకతను పెంచడం ద్వారా అధిక వేతన ఉద్యోగాలను సృష్టించడంపై దృష్టి సారించాలని సూచించింది. ప్రస్తుత తరుణంలో తయారీ రంగంలో ముందుకు వెళ్లడం-ఎగుమతుల ఆధారిత వ్యూహాన్ని అనుసరించడం అంత అనుకూలమైనది కాదని నిటి ఆయోగ్ తెలిపింది. ఉత్పాదకతను పెంచడం, అధిక వేతన ఉద్యోగాలను సృష్టించడమేప్రస్తుతం ఎంతో ఆవశ్యకమని తెలిపింది.


సీఈజెడ్ ఏర్పాటుతో మేలు..: తీర ప్రాంత ఉద్యోగ కల్పనా కేంద్రాలు (సీఈజెడ్) ఏర్పాటు చేయాలని నిటి ఆయోగ్ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. సీఈజెడ్ల ఏర్పాటు ద్వారా చైనావంటి తయారీ ఆధారిత దేశాల నుంచి బహుళజాతి కంపెనీలను భారత్‌లోకి ఆకర్షించవచ్చునని నిటి ఆయోగ్ తెలిపింది. సీఈజెడ్‌ల కారణంగా ఉద్యోగాల కల్పనకు ఎక్కువ ఆస్కారం ఉండే రంగాలకు చెందిన పరిశ్రమలు భారత్‌కు తరలి వచ్చే అవకాశం ఉన్నదని పేర్కొంది. ఈ ప్రక్రియ వల్ల చిన్న, మధ్య తరహా పరిశ్రమలకూ ఉత్పత్తి రంగంలో తగిన ప్రాధాన్యత లభించి మేటి ఉత్పాదకతను అందిపుచ్చుకొనేందుకు వీలు పడుతుందని పేర్కొంది. ఫలితంగా మేటి వేతన చెలింపులు కలిగిన ఉద్యోగాల సృష్టికి బాటలు వేస్తుందని విశ్లేషించింది. కార్మిక చట్టాలను అందుకు అనుగుణంగా సవరించాలని సూచించింది. కార్మిక చట్టాలను మార్చకుండా తక్కువ ఉత్పాదకత, తక్కువ వేతనాలతో కూడిన ప్రస్తుత స్థితిలో మార్పు సాధ్యం కాదని తెలిపింది. పెద్ద సంఖ్యలో ఉన్న కార్మిక చట్టాలను ఏకీకృతం చేయడంలో భాగంగా నాలుగు విభాగాల్లోకి క్రోడీకరిస్తూ ఇటీవల లోక్‌సభలో ప్రవేశపెట్టిన వేతన నియమావళి బిల్లుపైనా నిటి ఆయోగ్ వ్యాఖ్యానించింది. ప్రతిపాదిత నూతన చట్టాల వల్ల కొద్దిపాటి ప్రయోజనమేనని నిటి ఆయోగ్ పరోక్షంగా అభిప్రాయపడింది.

ప్రమాదంలో రాజ్యాంగం

(మొదటిపేజీ తరువాయి)


కొత్తలో ఆర్ఎస్ఎస్ ప్రకటించిందని గుర్తు చేశారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు అన్యాయానికి, వివక్షకు గురవుతున్నారని చెప్పారు. కులాంతర వివాహాలు జరిగితే కుల నిర్మూలన జరుగుతుందని అంబేద్కర్ ఆశించారని, ఇప్పటికీ సమాజంలో అమలు కావడం లేదన్నారు. ఉన్నత విద్యాసంస్థల్లో కులవివక్ష కొనసాగుతోందని, అందుకు రోహిత్ వేముల ఆత్మహత్య నిదర్శనమని అన్నారు. హక్కుల గురించి తెలుసుకుని ప్రశ్నిస్తారని భావించి విద్యాసంస్థల్లో వేధింపులకు గురిచేస్తున్నారని చెప్పారు. రాజ్యాంగం ఇచ్చిన హక్కులను బీజేపీ, ఆర్ఎస్ఎస్ హరిస్తున్నారని విమర్శించారు. ఉద్యమించడం హక్కుగా మారాలని చెప్పారు.

నిటిఆయోగ్ ప్రణాళిక దేశానికి ప్రమాదం : రాఘవులు




అంబేద్కర్ ఇచ్చిన రాజ్యాంగ ఫలాలు ఏనుగు మింగిన వెలగపండులా మిగిలిపోయే ప్రమాదముందని డీఎస్ఎంఎం జాతీయ నాయకులు బివి రాఘ వులు అన్నారు. నిటిఆయోగ్ ఏప్రిల్‌లో మూడేండ్ల కార్యాచరణ ప్రణాళిక, ఏడేండ్ల వ్యూహం, 15 ఏండ్ల విజన్ రూపొందించిందని చెప్పారు. అందులో మూడేండ్ల ప్రణాళికను కేంద్రం ఆమోదించి ప్రకటించిందన్నారు. దేశంలో 235 ప్రభుత్వ సంస్థలు, శాఖలున్నాయని చెప్పారు. అందులో 74 సంస్థలను మూసివేయాలని నిటి ఆయోగ్ సిఫార్సు చేసిందన్నారు. ఇక రిజర్వేషన్లు అమలు చేసేందుకు అవకాశం లేదన్నారు. 20 సంస్థలను ప్రయివేటు సంస్థలకు అమ్మాలని నిర్ణయించారని చెప్పారు. ఆ సంస్థల్లో ప్రయివేటు యజమానిదే పెత్తనం సాగుతుందని అన్నారు. ఆరు సంస్థలను ఇప్పటికే మూసివేశారని గుర్తు చేశారు. మిగతా సంస్థలు, శాఖలను ప్రయివేటుపరం చేయాలని (పెట్టుబడులు ఉపసంహరించాలి) సిఫారసు చేసిందన్నారు. మూడేండ్ల ప్రణాళికలోనే రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా నిర్ణయాలున్నాయని చెప్పారు. ఇది దేశానికే ప్రమాదకరమని అన్నారు. ద్రవ్యలోటు మూడు శాతానికి తగ్గించాలని సిఫారసు చేసిందన్నారు. విద్య, ఆరోగ్యం మీద ప్రభుత్వ ఖర్చు తగ్గించాలని ప్రభుత్వం భావిస్తోందని చెప్పారు. ఉపాధి హామీ చట్టానికి కేటాయించిన నిధులు యంత్రాలకే ఇస్తున్నారు తప్ప కార్మికులకు చెల్లించడం లేదన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ధ్వంసమవుతుందని చెప్పారు. ఆధార్ అనుసంధానం చేయడం వల్ల పేదలు నష్టపోతారని అన్నారు. ప్లాన్, నాన్‌ప్లాన్ బడ్జెట్ లేనపుడు సబ్‌ప్లాన్‌కు అవకాశమే లేకుండా కేంద్రం చేసిందన్నారు. ఆ ప్రణాళికలో సబ్‌ప్లాన్ మాట లేదని చెప్పారు. ఫెడరలిజం పేరుతో రాష్ట్రాలకు 32 శాతం నుంచి 42 శాతానికి నిధులు పెంచినందున కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపైనే ఉంటుందని బీజేపీ ప్రభుత్వం చెప్తోందన్నారు. ఈ పేరుతో ఆ పథకాలే రద్దయ్యే ప్రమాదముందని చెప్పారు. దేశంలో ఒకేసారి ఎన్నికల వల్ల జాతీయస్థాయిలో పెద్ద పార్టీల పెత్తనం పెరుగుతుందన్నారు. రిజర్వేషన్లు తొలగించాలి, లేదంటే అగ్రకులాలకివ్వాలని ఆర్ఎస్ఎస్ డిమాండ్ చేస్తోందని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం దుర్వినియోగం అవుతుందని అంటున్నారని, ఏ చట్టం దుర్వినియోగం కావడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. దుర్వినియోగం చేసే వారిపై చర్య తీసుకోవాలన్నారు. దేవాలయంలోకి దళితులు రావొద్దని పూజారి నోటీసు పెట్టారని, ఎంత ధైర్యమని ప్రశ్నించారు. రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా చట్టాలొచ్చినా అమలు కావడం లేదన్నారు. 50 పడకల కంటే ఎక్కువుండే ఆస్పత్రులను ప్రయివేటుపరం చేయాలని నిటిఆయోగ్ సిఫారసు చేసిందని చెప్పారు. జబ్బు చూసి కాకుండా జేబు చూసి చేర్చుకునే పరిస్థితి వస్తుందన్నారు.

అవమానించేలా మాట్లాడితే పదవులు పోయేలా చట్టం : వి శ్రీనివాసరావు




రాజ్యాంగానికి వ్యతిరేకంగా, దళితులు, గిరిజనులను అవమానించేలా, కించపరిచేలా మాట్లాడితే వారి పదవులు పోయేలా కొత్త చట్టం తేవాలని డీఎస్ఎంఎం జాతీయ సమన్వయకర్త వి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పర్యటనకు వచ్చే ముందు దళితులకు సబ్బు ఇచ్చి స్నానం చేసి, అత్తరు కొట్టుకొని ఉండాలని చెప్పిన యూపీ సీఎం యోగికి ఆ పదవిలో ఉండే అర్హత ఉందా?అని ప్రశ్నించారు. ఇది సిగ్గుచేటని విమర్శించారు. దళితులు మురికిగా ఉంటారని ఏపీ మంత్రి ఆదినారాయణరెడ్డి వ్యాఖ్యానించడం సమంజసం కాదన్నారు. వారు మురికిగా ఉండడానికి కారణమెవరని అడిగారు. ఇది అగ్రకుల దురహంకారంతో మాట్లాడ్డమే అవుతుందన్నారు. సంప్రదాయాల పేరుతో దళితులు, గిరిజనులు, మహిళలను రెండో తరగతి పౌరులుగా చూస్తున్నారని చెప్పారు. ఈ అంశాలపై నవంబర్ 4,5,6 తేదీల్లో మధురైలో జరిగే డీఎస్ఎంఎం జాతీయ మహాసభల్లో చర్చించి కార్యాచరణ రూపొందిస్తామన్నారు.

ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రక్షణ లేదు : రాధాకృష్ణన్




మోడీ పాలనలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు దేశంలో రక్షణ లేదని డీఎస్ఎంఎం జాతీయ కన్వీనర్, కేరళ మాజీ స్పీకర్ కె రాధాకృష్ణన్ చెప్పారు. దేశంలో ఎక్కడా సామాజిక న్యాయం అమలు కావడం లేదన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 71 ఏండ్లయినా స్వేచ్ఛ లేదని అన్నారు. కేరళలో ఇతర రాష్ట్రాలతో పోల్చితే ఎస్సీ, ఎస్టీలకు హక్కులు, సంక్షేమ ఫలాలు ఎక్కువగా అందుతున్నాయని చెప్పారు.

కుల,వర్గ పోరాటాలతోనే సామాజిక న్యాయం : కాకి మాధవరావు



కుల, వర్గ పోరాటాలు నిర్వహించడం ద్వారానే సామాజిక న్యాయం అమలవుతుందని అధ్యక్షత వహించిన ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి కాకి మాధవరావు అన్నారు. కుల పోరాటాల్లేకుండా వర్గ పోరాటం విజయవంతం కావన్నారు. అసమానతలు తగ్గాలంటే ధనవంతుల నుంచి పన్ను ఎక్కువ వసూలు చేయాలని చెప్పారు. చదువు, ఆరోగ్యం, ఉపాధికి అవసరమైన నైపుణ్యం, సంక్షేమ పథకాలు అమలవుతాయని అన్నారు. కానీ సంపన్నుల ఆదాయం మీద 70 శాతం ఉంటే, దాన్ని 30 శాతానికి పన్ను తగ్గించారని చెప్పారు. వారి ప్రయోజనాలు నెరవేర్చడం కోసమే పాలకులు పనిచేస్తున్నారని అన్నారు.


ఆవులకు రక్షణ... మనుషుల ● చంపే పార్టీ అధికారంలో : సైలాబ్‌బాబు



దేశంలో ఆవులను రక్షించి, మనుషులను చంపే పార్టీ అధికారంలో ఉందని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్‌బాబు విమర్శించారు. దీంతో రాజ్యాంగానికి, రిజర్వేషన్లకు పెను ప్రమాదం వచ్చిందన్నారు. వీటిని రక్షించుకునే బాధ్యత అందరిపైనా ఉందని చెప్పారు. అభివృద్ధివైపు కాకుండా అనాగరికంవైపు నడిపిస్తున్నారని ఎద్దేవా చేశారు. అసమానతలు, కులవివక్ష కొనసాగాలని కోరుకునే పార్టీ అధికారంలో ఉందన్నారు. సమానత్వం రావాలన్నా, వివక్ష పోవాలన్నా కమ్యూనిస్టులు, అంబేద్కరిస్టులు బలపడాలని ఆకాంక్షించారు. బొందలగడ్డకు స్థలం ఇవ్వలేనోడు బంగారు తెలంగాణ ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ సోమప్రసాద్, మాజీ ఎంపీ రామచంద్రడోమ్ ప్రసంగించగా, డీఎస్ఎంఎం నాయకులు శాంతికుమార్, మమత, ఆశీమ్‌బాలా, దేబేష్ దాసు, శ్రీసంపత్, నత్తు ప్రసాద్, రాంకుమార్, గోపాలకృష్ణ, కేవీపీఎస్ ఉపాధ్యక్షులు జి నాగయ్య, అధ్యక్షుడు కె భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సెన్సెక్స్ ▲ 28 31,596	నిఫ్టీ ▲ 5 9,857	డాలరుకు రూపాయి విలువ 64.03	బంగారం(10.గ్రా) రూ. 29,582	వెండి (కేజీ) రూ. 42,600	కోడిగుడ్లు

గురువారం మార్కెట్లు ముగిసిన నాటికి






కోడిగుడ్లు			
హైదరాబాద్	320	విజయవాడ	320
ఒక్కగుడ్డుకు	3.80	చెన్నై	355
వరంగల్	322	ముంబయి	365



ఎగవేతదారులపై బ్యాంకులు సీరియస్!

- రూ.70,000 కోట్ల సొమ్ము రికవరీకి అడుగులు
- 'సర్‌ఫైసీ' చట్ట కింద మొదలైన చర్యలు



న్యూఢిల్లీ: ఉద్దేశపూర్వక ఎగవేతదారల నుంచి రుణాల రికవరీకి ప్రభుత్వం రంగ బ్యాంకులు (పీఎస్‌బీలు) వేగంగా పావులు కదుపుతున్నాయి. దాదాపు 5,954 మంది ఎగవేతదారులు బ్యాంకుల నుంచి రూ.70,000 కోట్ల మేర రుణాలను తీసుకొని.. వాటిని కావాలనే తిరిగి చెల్లించడం లేదని బ్యాంకుల పరిశీలనలో తేలింది. దీంతో మార్చి చివరి నాటికి ప్రభుత్వ రంగంలోని 21 బ్యాంకులు కఠినతరమైన 'సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్సియనల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్' (సర్‌ఫైసీ) చట్టం ప్రకారం చర్యలు చేపట్టాయి. ఆర్థిక శాఖ సమీకరించిన గణాంకాలలో ఈ విషయం వెల్లడైంది. దేశంలో అతిపెద్ద విత్త సంస్థ భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) దాదాపు రూ.20,943 కోట్ల రుణాల ఎగవేతలకు సంబంధించి.. దాదాపు 1,444 ఉద్దేశపూర్వ ఎగవేతదారులకు తాకీదులు పంపింది. మిగతా 20 బ్యాంకులు మొత్తం కలిసి దాదాపు రూ.48,496 కోట్ల రుణాలకు సంబంధించి 4,510 ఎగవేతదారులకు తాకీదులను అందజేసింది. ఆర్థిక శాఖ వద్ద అందుబాటులో ఉన్న సమాచారం మేరకు 2016-17 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ రంగ బ్యాంకులకు ఉద్దేశపూర్వక ఎగవేతదారులు ఎగవేసిన సొత్తు మొత్తం విలువ రూ.92,376 కోట్లుగా ఉంది. 2015-16 ఆర్థిక సంవత్సరంలో ఇది రూ.76,685 కోట్లుగా నమోదు అయింది.

'జన్ ధన్'లోకి రూ.65,000 కోట్లు



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ మూడేండ్ల కిందట ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జన్‌ధన్ పథకం పేదల్లో ఆర్థిక ఆత్మ విశ్వాసాన్ని నింపిందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. దేశ వ్యాప్తంగా 30 కోట్ల కుటుంబాలు ఈ పథకంలో భాగంగా చేరారని ఆయన వివరించారు. ఈ తరహా ఖాతాలలో సామాన్యుల డిపాజిట్లు దాదాపు రూ.65,000 కోట్లకు చేరువైనట్టుగా ఆయన వివరించారు. ఆదివారం మోడీ మన్‌కీబాత్ కార్యక్రమంలో మాట్లాడుతూ జన్‌ధన్‌లో చేరిన వారి సంఖ్య ప్రపంచంలోని చాలా దేశాల జనాభా కంటే ఎక్కువ కావడం విశేషమని ఆయన అన్నారు. జన్‌ధన్ యోజన పథకం దేశీయంగానే కాకుండా ఆర్థిక పండితులకు కూడా ఒక చర్చనీయాంశంగా మారిందని తెలిపారు. జన్‌ధన్ పథకం ద్వారా పేదలకు ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజనా, ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజనా , రూపే కార్డు, ప్రధాన మంత్రి ముద్రా యోజనా వంటి పథకాలను అందుకోగలుగుతున్నారని ప్రధాని తెలిపారు. జన్‌ధన్‌తో గత కొంత కాలంగా ఆర్థిక వ్యవస్థలో భాగంగా కాకుండా వస్తున్న సమాజంలోని చిట్టచివరి వ్యక్తిని కూడా బ్యాంకింగ్ వ్యవస్థలోకి సమ్మిళితం చేసేందుకు వీలు పడిందని ఆయన వివరించారు. రూపే కార్డు మూలంగా పేదలు కూడా ఈ రోజు ఎంతో స్వాభిమానంతో సంపన్నులతో సరిసమానంగా వివిధ రకాల డిజిటల్ బ్యాంకింగ్ సేవలను వినియోగించుకో గలుగుతున్నారని ఆయన అన్నారు.

హైదరాబాద్‌లో ఆభరణాల సామ్రాజ్యం

సోమాజీగూడలో లలితా జ్యువెల్లరి ప్రారంభం

- 1,30,000 చ.అడుగుల విస్తీర్ణంలో భారీగా ఏర్పాటు
- ప్రపంచంలోనే అతిపెద్ద షోరూమ్‌లలో ఒకటిగా రికార్డు
- బంగారం, వజ్రం, వెండి, ప్లాటినమ్ ఆభరణాల లభ్యం



హైదరాబాద్‌లోని సోమాజీగూడలో ఏర్పాటు చేసిన లలితా జ్యువెల్లరీ షోరూమ్



లలితా జ్యువెల్లరీని ప్రారంభిస్తున్న మంత్రి కేటీఆర్, సంస్థ సీఎండీ కిరణ్ కుమార్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

నాణ్యత ప్రమాణాలు పాటించే నగలకెప్పుడూ గిరాకీ ఉంటుందని, అలాంటి షోరూమ్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన లలితా జ్యువెల్లరీ షోరూమ్ నిర్వాహకులను మంత్రి కె.తారకరామారావు అభినందించారు. దక్షిణ భారత దేశంలో అగ్రగామిగా భాసిల్లుతున్న లలితా జ్యువెల్లరి ప్రతిష్టాత్మకమైన, అదిపెద్ద షోరూం ప్రారంభోత్సవం హైదరాబాద్‌లోని సోమాజిగూడలో ఆదివారం అంగరంగవైభవంగా జరిగింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, గనులు, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కె తారకరామారావు సతీసమేతంగా విచ్చేసి షోరూంను ప్రారంభించారు. వజ్రాభరణాల విభాగాన్ని లైకా గ్రూపు చైర్మెన్ ఎ సుభాస్కరణ్ దంపతులు ప్రారంభించారు. కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ జ్యోతి ప్రజ్వలన చేశారు. హోమ్ శాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఎంపీ టి సుబ్బరామిరెడ్డి, శివ గ్రూపు చైర్మెన్ సి శివశంకరన్, డీసీ డిజైన్ ప్రై లిమిటెడ్ చైర్మెన్ దిలీప్ చాబ్రియా, వేల్స్ విశ్వవిద్యాలయం (చెన్నై) చైర్మెన్ డాక్టర్ ఐసరి కె గణేశ్, అడయార్ ఆనందభవన్ మేనేజింగ్ డైరెక్టర్ కేటీ శ్రీనివాసరాజా తదితరులు గౌరవ అతిథులుగా ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. లలితా జ్యువెల్లరికే ఎంతో ప్రతిష్టాత్మకమైన ఈ షోరూం ప్రపంచంలోనే అతి పెద్ద షోరూంలలో ఒకటని లలిత్ జ్యువెల్లరి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ యం. కిరణ్‌కుమార్ తెలిపారు. హైదరాబాద్ వాసులతో పాటు తెలంగాణ ప్రజలకు అందం చిందే ఆకర్షణీయమైన డిజైన్లు, అద్భుతమైన పనితనాన్ని చాటే నగలు అత్యంత తక్కువ తరుగుకే తమ షోరూంలో లభిస్తాయని ఆయన చెప్పారు. హిడన్ చార్జీల భారం మోపకుండా సరసమైన ధరకు నగలు అందించాలన్నదే తమ లక్ష్యమన్నారు. తయారీ ధరకే బంగారు నగలు అందించడంతోపాటు ఎలాంటి జిమిక్కులు లేకుండా పారదర్శకమైన పద్ధతిన నాణ్యమైన నగలు ఇస్తున్నామని కిరణ్ కుమార్ తెలిపారు. సోమాజీగూడలో లలితా జ్యువెల్లరిని 1,30,000 చ.అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేశామని ఆయన వివరించారు.ఇది ప్రపంచంలోనే అతిపెద్ద షోరూమ్‌లలో ఒకటిగా నిలవనుందన్నారు. ఈ షోరూంలో బంగారం, వజ్రం, వెండి, ప్లాటినమ్ ఆభరణాల లభ్యం కానున్నాయి.

నీలేకని చాలా చేయాల్సి ఉంది..

- మొదట బోర్డు ప్రక్షాళన చేపట్టాలి
- రవి వెంకటేషన్‌ను తప్పించాలి..
- మరోమారు విఫల ప్రయోగం వద్దు : ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్‌వో బాలకృష్ణన్



న్యూఢిల్లీ: దేశీయ ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ కొత్త చైర్మెన్‌గా బాధ్యతలు స్వీకరించిన నందన్ నీలేకని మరో రెండు, మూడేళ్లపాటు సంస్థలో కొనసాగాల్సిన అవసరం ఎంతైనా ఉందని సంస్థ మాజీ సీఎఫ్‌వో బాలకృష్ణన్ అభిప్రాయపడ్డారు. ఇన్ఫోసిస్‌లో మరోసారి ఎలాంటి సంక్షోభం తలెత్తకుండా ఉండటానికి నీలేకని కొంత కాలం చైర్మెన్ హోదాలో ఉండడం అత్యంతావశ్యకమని ఆయన అన్నారు. అదే సమయంలో సహ చైర్మెన్‌గా ఉండి, బోర్డు స్వతంత్ర డైరెక్టర్‌గా మారిన రవి వెంకటేశన్ తన పదవి నుంచి తప్పుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. 'ఇన్ఫోసిస్ నందు 2014లో ఓ పెద్ద ప్రయోగం జరిగింది. వత్తిపరంగా వ్యవహరించే బోర్డు.. కంపెనీని సమన్వయం చేయడం ప్రారంభించింది. వ్యవస్థాపకులతో కాకుండా సీఈవో పదవిని వేరొకరితో భర్తీ చేశారు. బోర్డు సరిగా వ్యవహరించలేకపోవడమే ఇందుకు కారణం. ఆ ప్రయోగం ఇప్పుడు విఫలమైంది. ఇలాంటి ప్రయోగం మరోసారి విఫలం కాకూడదు' అని అన్నారు. భవిష్యత్‌లో నీలేకని సంస్థను వీడే లోగా ఓ మంచి చైర్మెన్ కోసం అన్వేషణ సాగించాలని, దానిపై తక్షణం దష్టి పెట్టాలని ఆయన సూచించారు. 'నీలేకని రెండు, మూడేళ్లు సంస్థలో కొనసాగవచ్చు. ఎందుకంటే కొన్ని పనులను ఆయన చక్కబెట్టాల్సి ఉంది. బోర్డు పునర్‌వ్యవస్థీకరణ, కొత్త సీఈవో, చైర్మెన్ పదవికి విజయవంతమైన ప్రణాళిక స ష్టించడం, సరిగా భావవ్యక్తీకరణ చేయలేని, బలహీన బోర్డును పూర్తిగా దించేయడం' మొదలైనవన్నీ జరగాలన్నారు. గతంలో జరిగిన వాటిని దష్టిలో పెట్టుకుని మొదటి ప్రాధాన్యం బోర్డు ప్రక్షాళనకే ఇవ్వాలని అన్నారు.

ఏప్రిల్ నాటికి మరో పెద్ద బ్యాంకు!

- పలు బ్యాంకుల విలీనంతో ఏర్పాటు
- ఎస్‌బీఐ మార్గంలో మెర్జర్‌కు చర్యలు
- చురుగ్గా పావులు కదుపుతున్న సర్కారు
- అవసరమైతే మూలధన సాయానికి సై!




న్యూఢిల్లీ: ప్రభుత్వ బ్యాంకుల (పీఎస్‌బీ) విలీనంపై ఆసక్తిగా ఉన్న సర్కారు వచ్చే ఏప్రిల్ నాటికి దేశంలో కనీసం మరో దిగ్గజ బ్యాంకు ఏర్పాటు ధ్యేయంతో పని చేస్తోంది. ఇప్పటికే అనుబంధ బ్యాంకుల విలీనం ద్వారా సర్కారు భారతీయ స్టేట్ బ్యాంకును (ఎస్‌బీఐ) భారీ బ్యాంకుగా మార్చిన సంగతి తెలిసిందే. ఇదే బాటలో ఇప్పుడు అవకాశం ఉన్న పలు బ్యాంకుల విలీనాన్ని కూడా వేగవంతం చేసే ప్రయత్నాలను మొదలు పెట్టింది. ఇందుకు గాను అవసరమైతే ఇతర బ్యాంకుల కొనుగోలుకు గాను ఆసక్తి కనబరిచే బ్యాంకునకు మూలధన సాయం అందించాలని కూడా సర్కారు యోచిస్తున్నట్టుగా సమాచారం. ఇప్పటికే మొండి బాకీల దెబ్బకు కుదేలైన బ్యాంకులకు ఆర్థికంగా దన్నుగా నిలవడం.. విలీనానికి తోడ్పాటును అందించడంతో పోటు దేశంలో బలమైన బ్యాంకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నది సర్కారు యోచనగా తెలుస్తోంది. ప్రభుత్వ రంగ బ్యాంకుల విలీనాంశం పరిశీలనకు గాను సర్కారు ఇప్పటికే ప్రత్యామ్నాయ వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. విలీనానికి సంబంధించి ఆయా బ్యాంకుల బోర్డుల నుంచి తొలత ప్రత్యామ్నాయ వ్యవస్థకు ప్రతిపాదన అందాల్సి ఉంటుందని ప్రభుత్వ అభిజ్ఞ వర్గాలు తెలిపాయి. బోర్డుల నుంచి అందిన ప్రతిపాదనకు ప్రత్యామ్నాయ వ్యవస్థ సభ్యుల సమ్మతి లభించాలి. అప్పుడు అవసరమనుకుంటే సర్కారు మూలధన సాయం అందిచేందుకు యోచిస్తున్నట్టుగా ఈ వర్గాలు తెలిపాయి.

పెద్ద బ్యాంకులూ కలిసిపోవచ్చు...

విలీనంలో భాగంగా పెద్ద బ్యాంకులు తప్పనిసరిగా.. చిన్న, మధ్య తరహా బ్యాంకులను తమలో కలుపుకోవాలన్న నిబంధనేది లేదని సర్కారు వర్గాలు చెబుతున్నాయి. అవసరం, నిబంధనల మేరకు ఒక పెద్ద బ్యాంకు మరో పెద్ద బ్యాంకును కొనుగోలు చేసేందుకు కూడా సర్కారు సాయం అందించనుందని ప్రభుత్వ అధికారి ఒకరు తెలిపారు.

నదిలోకి కూతుర్ని విసిరేసి.. తల్లీ ఆత్మహత్య



చిన్నారి అతిథి (ఫైల్)

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

మూడేండ్ల కూతుర్ని నదిలోకి విసిరేసిన ఓ తల్లి ఆపై తానూ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లా మావల మండలంలో ఆదివారం విషాదాన్ని నింపింది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... జైనథ్ మండలంలోని గిమ్మ గ్రామానికి చెందిన స్వప్న(40), అదే మండలంలోని గూడరాంపూర్‌కు చెందిన వికలాంగుడైన అమరేశ్వర్‌తో ఇరవై ఏండ్ల కిందట వివాహం అయింది. మూడేండ్ల కిందట వారికి కుమార్తె అతిథి పుట్టింది. అమరేశ్వర్ ప్రస్తుతం మంచిర్యాలలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో పనిచేస్తున్నాడు. కుటుంబం మావల మండలంలోని దోబీకాలనీలో నివాసముంటోంది. వినాయక చవితి సెలవుకు అమరేశ్వర్ దోబీకాలనీకి వచ్చాడు. ఆదివారం ఉదయం మంచిర్యాలకు వెళ్తానని భర్యతో చెప్పగా, తానూ వస్తానని స్వప్న అంది. దానికి భర్త నిరాకరించడంతో మనస్తాపానికి గురైన ఆమె కూతుర్ని వెంటబెట్టుకుని ఆటోలో బయటకు వెళ్లిపోయింది. పెన్‌గంగా వద్ద దిగి ముందుగా కూతురు అతిథిని నదిలోకి విసిరేసి, అనంతరం తానూ దూకింది. మొదట తల్లి మృతదేహం ఒడ్డుకు కొట్టుకురావడంతో గమనించిన స్థానికులు జైనథ్ పోలీసులకు సమాచారమందించారు. పోలీసులు ఆమె మృతదేహాన్ని బయటకు తీసి బంధువులకు సమాచారం అందించారు. చిన్నారి మృతదేహం కోసం గజ ఈతగాళ్లతో గాలిస్తున్నారు. స్వప్న మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రిమ్స్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు జైనథ్ ఎస్ఐ పుల్లయ్య తెలిపారు. కుటుంబ కలహాల కారణంగానే ఈ దారుణం జరిగినట్టు తెలిసింది.

మల్లన్న సాగర్ పనుల్లో కార్మికుడు మృతి

నవతెలంగాణ - తొగుట

మల్లన్నసాగర్‌కు నీళ్లు తెచ్చేందుకు తవ్వుతున్న సొరంగం పనుల్లో బండరాయి మీదపడి కార్మికుడు మృతిచెందాడు. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సిద్దిపేట జిల్లా తొగుట మండల పరిధిలోని చుక్కపూర్ సొరంగం వద్ద శనివారం సాయంత్రం జరిగింది. కాంట్రాక్టర్లు, అధికారుల నిర్లక్ష్యంతో ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేరళ రాష్ట్రంలోని కున్నత్‌నగర్ నియోజకవర్గం మడవలూర్ గ్రామానికి చెందిన కుంజు మోహన్(36) తోటి కార్మికులు అనిల్, దామోదర్‌తో కలిసి చుక్కపూర్ సొరంగంలో డ్రిల్లింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో బండరాయి మీదపడింది. వారు ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం స్థానికులు వారిని సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా పరిస్థితి విషమించి మోహన్ చనిపోయాడు. మిగతా ఇద్దరిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుడి సోదరుడు సురేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

కాన్పుకెళ్తే కడుపు కోతే

- రాష్ట్రంలో 58% శస్త్రచికిత్సలు నమోదు
- అత్యధికంగా కరీంనగర్‌లో 81.1%
- మహబూబ్‌నగర్‌లో అత్యల్పంగా 33.5%
- ఎన్‌ఎఫ్‌హెచ్ సర్వే-4లో వెల్లడి
- ప్రయివేట్ ఆస్పత్రుల ధనదాహం
- తల్లీబిడ్డల ఆరోగ్యంపై ప్రభావం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రయివేట్ ఆస్పత్రుల కాసుల కక్కుర్తి గర్భిణీలకు కడుపుకోత మిగిలిస్తున్నది. పురిటి నొప్పులతో ఆస్పత్రికి వచ్చిన వారికి సుఖప్రసవం చేయాల్సిన డాక్టర్లు సిజేరియన్లు చేసి ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. సాధారణ ప్రసవాలు చేస్తే తక్కువ ఫీజు వస్తుందన్న దురాశతో సిజేరియన్లు చేసి అడ్డగోలుగా దండుకుంటున్నారు. ప్రయివేట్ ఆస్పత్రుల్లో జరిగే ప్రసవాల్లో సగానికిపైగా సిజేరియన్లే ఉంటున్నాయంటే వారి ధనదాహం ఎలా ఉందో స్పష్టంగా అర్థమవుతున్నది. సాధారణ ప్రసవాలు నానాటికీ తగ్గిపోతుండగా.. అడ్డగోలు కోతలు పెరిగిపోతుండటం ఆందోళన కలిగిస్తున్నది. ప్రసవం సులువుగా కాకుండా ప్రమాదమైతే ఎలా అన్న భయాందోళనలతో కొన్ని కుటుంబాలు సిజేరియన్‌కు మొగ్గుచూపుతున్నాయి. వారి బలహీనతలను ఆయా ఆస్పత్రులు సొమ్ము చేసుకుంటున్నాయి. విచిత్రమేంటంటే ప్రసవాలకూ ముహూర్తాలు పెట్టి ఆ ప్రకారం సిజేరియన్ ద్వారా బిడ్డను బయటకు తీస్తున్న పరిస్థితి కూడా ఇటీవల ఎక్కువైంది.

రాష్ట్రంలో 58 శాతం

రాష్ట్రంలో 58% ప్రసవాలు శస్త్రచికిత్స ద్వారానే జరుగుతున్నాయి. అత్యధికంగా పాత కరీంనగర్ జిల్లాలో 81.1%, అత్యల్పంగా పాత మహబూబ్‌నగర్‌లో 33.5% కాన్పు కోతలు జరుగుతున్నాయని నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే-4లో తేలింది. అయిదేండ్లుగా జరిపిన సర్వే నివేదికలు, అధ్యయనాలూ ఇదే విషయాన్ని నొక్కి చెప్పాయి. ఇక వైద్య ఆరోగ్యశాఖ అంచనా ప్రకారం రాష్ట్రంలో ఏటా ఆరు లక్షల ప్రసవాలు జరుగుతున్నాయి. అందులో ప్రయివేటు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో సమాన సంఖ్యలో జరుగుతున్నాయి. మూడు దశాబ్దాలుగా సాధారణ ప్రసవాలు తగ్గి సిజేరియన్ సంస్కృతి పెరిగింది. ప్రయివేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో 90%,



ప్రభుత్వాస్పత్రుల్లో 60% ప్రసవాలు సిజేరియన్ ద్వారానే జరుగుతున్నాయి. మొత్తమ్మీద ఏటా 4.5 లక్షల ప్రసవాలు సిజేరియన్ ద్వారానే సంభవిస్తున్నాయి. సాధారణ ప్రయివేట్ ఆస్పత్రిలో సిజేరియన్ ఆపరేషన్‌కు రూ. 20 వేల నుంచి రూ.40 వేల వరకు వసూలు చేస్తున్నారు. కార్పొరేట్, సూపర్ స్పెషాలిటీలో రూ. లక్ష నుంచి రూ.2 లక్షల వరకు గుంజుతున్నారు. సాధారణ ప్రసవాలు చేయాలంటే అనువైన వాతావరణం ఉండాలి. ప్రయివేట్ ఆసుపత్రుల్లో అటువంటి వాతావరణం, వసతులున్నా కూడా చాలా కేసుల్లో సిజేరియన్ వైపు మొగ్గుచూపుతున్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో మాత్రం అటువంటి వాతావరణం ఉండటంలేదు. ఒకే వార్డులో పదిమంది గర్భిణీలను పడుకోబెట్టి ప్రసవం చేస్తున్నారు. దీనివల్ల సాధారణ ప్రసవం ఏమాత్రం సాధ్యంకాదని వైద్యులు చెబుతున్నారు. అంతేకాకుండా సిజేరియన్‌తో తల్లీ బిడ్డల ఆరోగ్యంపై వ్యతిరేక ప్రభావం ఉంటుందని హెచ్చరిస్తున్నారు. సాధ్యమైనంత వరకు సిజేరియన్‌కు వెళ్లకుండా సాధారణ ప్రసవం జరిగేలా చూడాలని చెబుతున్నారు.

సర్కారు వైద్యంలో వసతులేవి?

రాష్ట్రంలోని ప్రభుత్వాస్పత్రుల్లో వసతుల లేమి, సిబ్బంది కొరత కాన్పులపై ప్రభావం చూపిస్తున్నది. తప్పనిసరి పరిస్థితుల్లో బాధితులు ప్రయివేట్ ఆస్పత్రులను ఆశ్రయించి శస్త్రచికిత్సలకు గురవుతున్నారు. రాష్ట్రంలోని 676 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సుమారు 300 వరకూ 24 గంటలపాటు వైద్యసేవలకు ఉద్దేశించినవే. టీచింగ్, జిల్లా, ఏరియా ఆస్పత్రుల్లో కేసీఆర్ కిట్స్ పథకం కారణంగా ప్రసవాల సంఖ్య కాస్తమెరుగైనా పీహెచ్‌సీల్లో మార్పురావడంలేదు. సాధారణ పీహెచ్‌సీల్లో ఇద్దరుండాల్సిన చోట ఒక్క వైద్యుడే ఉంటున్నారు. 24 గంటల పీహెచ్‌సీల్లో నలుగురు వైద్యులుండాల్సిన చోట ఇద్దరితో నెట్టుకొస్తున్నారు. వీరితోపాటు స్టాఫ్‌నర్సులు, సహాయ సిబ్బంది కొరత కూడా వేధిస్తోంది. తాగునీరు, వాడుకనీరు, విద్యుత్, తదితర కనీస సౌకర్యాల లేమి కూడా పీహెచ్‌సీలను వెక్కిరిస్తున్నాయి. ఒక రాత్రంతా గర్భిణిని పీహెచ్‌సీల్లో ఉంచడానికి సిబ్బంది సిద్ధపడటంలేదు.

ఏ మాత్రం ప్రమాదం లేదని కచ్చితంగా భావిస్తే తప్ప.. పీహెచ్‌సీల్లో ప్రసవాలకే వైద్యసిబ్బంది ముందుకు రావడం లేదని తెలుస్తున్నది. సమీపంలోని పెద్దాస్పత్రికో, ప్రయివేట్ ఆస్పత్రికో వెళ్లమని సలహాలిస్తున్న సందర్భాలే ఎక్కువ. దీంతో, ప్రసవానికి ప్రభుత్వాస్పత్రికి వచ్చినవారూ గత్యంతరంలేక ప్రయివేట్‌కు వెళ్తున్నారని తెలుస్తున్నది. పీహెచ్‌సీల్లో జరిగిన కాన్పుల్లో 90%పైగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్యలో చేసినవే ఉంటున్నాయనీ, అత్యధికశాతం బాలింతలను సాయంత్రానికే ఇంటికి పంపించేస్తున్నారని వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. దీన్నిబట్టి వైద్య సిబ్బంది పూర్తిగా ఆత్మరక్షణ ధోరణి అవలంబిస్తున్నారనేది అర్థమవుతున్నది.

పాత జిల్లాల వారీగా శస్త్రచికిత్సల వివరాలు

మహబూబ్‌నగర్	- 33.5%
ఆదిలాబాద్	- 39.9%
హైదరాబాద్	- 62.2%
కరీంనగర్	- 81.1%
నిజామాబాద్	- 50.4%
నల్లగొండ	- 69.0%
మెదక్	- 47.1%
ఖమ్మం	- 65.6%
రంగారెడ్డి	- 58.7%
వరంగల్	- 69.2%
తెలంగాణ	- 58.0%



మాట్లాడుతున్న కాకి మాధవరావు

రోహిత్ వేముల మృతిపై సుప్రీం జడ్జితో విచారణ జరపాలి

- రూపన్‌వాలా కమిషన్ రిపోర్టును రద్దు చేయాలి :ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హెచ్‌సీయూ విద్యార్థి రోహిత్ వేముల మృతిపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో మరోసారి విచారణ జరపాలని ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి కాకి మాధవరావు డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూపన్‌వాలా కమిషన్ రిపోర్టు అనైతికమని, తప్పులతడక అని విమర్శించారు. రూపన్‌వాలా కమిషన్‌కు ఏ కారణాల వల్ల చనిపోయారో, ఇలాంటివి జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో సూచించారని చెప్పారు. కులం గురించి పేర్కొనపోయినా లేని అధికారాలను వినియోగించి రోహిత్ వేముల మృతిపై విచారణ జరిగిందని అన్నారు. 1993లో ఏపీలో కుల ధ్రువీకరణ పత్రంపై రెవెన్యూ అధికారులకే పూర్తి అధికారాలుంటాయని చట్టం వచ్చిందని గుర్తు చేశారు.

సివిల్ కోర్టులకు జోక్యం చేసుకోవడానికీ అవకాశం లేదన్నారు. రోహిత్ వేముల తల్లి రాధికను విచారించ లేదని చెప్పారు. రోహిత్ వేముల దళిత ఐకాన్‌గా మారారని, అది పోగొట్టేందుకే దళితుడు కాదని రూపన్‌వాలా కమిషన్ నివేదిక ఇచ్చిందన్నారు. యూజీసీ నిజ నిర్ధారణ కమిటీకి దొరకని ఆధారాలు ఆ కమిషన్‌కు ఏం దొరికాయని ప్రశ్నించారు. రాజ్యాంగంలో తండ్రి కులమే పిల్లలకు వర్తిస్తుందని ప్రారంభంలో ఉన్నా అనేక కోర్టు తీర్పుల తర్వాత ఇప్పుడు లేదన్నారు. ఏ వాతావరణంలో పిల్లలు పెరిగితే ఆ కులం వస్తుందని చెప్పారు. రోహిత్ తండ్రి వడ్డెర అనడంలో ఎవరికీ అభ్యంతరం లేదని అన్నారు. విడాకులు తీసుకొని ఎస్సీ కాలనీలో పెరిగారని చెప్పారు. టీమాస్ ప్రతినిధులు జాన్‌వెస్లీ, విమలక్క, తెలంగాణ మేధావుల ఫోరం కన్వీనర్ పీఎల్ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ రూపన్‌వాలా కమిషన్ నివేదిక నేరస్తులకు అనుకూలంగా ఉందన్నారు. కేంద్ర మంత్రులు స్మృతి ఇరానీ, దత్తాత్రేయ, ఎమ్మెల్సీ రామచంద్రరావు, హెచ్‌సీయూ వీసీ అప్పారావు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నుంచి తప్పించుకునేందుకు ఇది ఉపయోగపడుతుందని చెప్పారు.కులవివక్షను రూపుమాపేలా ఉండాల్సిన నివేదిక మనువాదాన్ని పెంచిపోషించేలా ఉందన్నారు. ఈ నివేదికను నిరసిస్తూ వచ్చేనెల 2న టీ మాస్ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. వచ్చేనెల 3న రాష్ట్రవ్యాప్తంగా మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో రూపన్‌వాలా కమిషన్ నివేదికను దగ్ధం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టీమాస్ ప్రతినిధులు జి రాములు, ఆర్ శ్రీరాంనాయక్, ఎంవి రమణ, మన్నారం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



మహిళలకూ పరిపూర్ణ స్వేచ్ఛ కావాలి



నస్రీన్ ఖాన్

సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంతో మరోసారి ఇస్లామిక్ నిబంధనలు, ఉల్లంఘనలతో దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. మత మౌఢ్యాన్ని అవలంబించే కొందరు ప్రతి మతంలోనూ కనిపిస్తుంటారు. లేకపోతే మదర్సాల వేద పాఠశాలలు, సెయింట్స్ పేరుతో పాఠశాలలు ఉండేవేకావు. మతాల ఉనికి ఇప్పటికీ ఉందంటే వాటిని పట్టించుకునేవారు ఉండడంవల్లే అని చెప్పవచ్చు. పురుషాధిపత్య సమాజం కావడంతో ప్రతిమతంలోనూ మహిళలకు పరిపూర్ణ స్వేచ్ఛ లభించలేదు. జనాభాపరంగా మైనారిటీలు కావడంతో వీరిలో ముందుకు వస్తున్న మహిళల సంఖ్య కూడా తక్కువగానే ఉంది. దేశంలో జరిగే అనేక సంఘ వ్యతిరేక చర్యలలాంటిదే తలాక్ ఎ బిద్దత్ వ్యవహారం కూడా. వరకట్నం, లంచం, దొంగతనం, దాడులకు దిగడం, అత్యాచారాలు ఇవన్నీ కూడా చట్ట వ్యతిరేకాలే.

అసలు విధానం

తలాక్ అన్నా విడాకులు అన్నా ఒకే అర్థం. తలాక్ విధానంలో ఒక పద్ధతి ఉంటుంది. ఆ పద్ధతి పూర్తిగా దంపతుల క్షేమం కోరే ఏర్పాటు చేసినది. పొరపాటుగానో, ఏమరుపాటుగానో భర్త తలాక్ ఆవేశంలోనో చెప్పి ఉంటే దానిని సరి చేసుకునే అవకాశం ఇచ్చి మరీ పెట్టినదే. అది కూడా భార్య రుతుకాలంలో ఉన్నప్పుడు చెప్పకూడదనే నిబంధన ఉంది. అలా భార్య రుతు సమయంలో లేనప్పుడు ఒక తలాక్ చెప్పి నెల రోజులపాటు వేచి చూడాలి. అప్పటికీ తన పొరపాటు గ్రహించే అవకాశం అతడికి ఉంటుంది. అయినా అతడి అభిప్రాయంలో మార్పు రాకపోతే మరో నెలలో మరో రుతుక్రమం గడిచిన తరువాత తలాక్ అని చెప్తారు. ఆ నెలలో కూడా అతడి అభిప్రాయం మారుతుందేమోనని వేచి చూసే అవకాశం ఉంది. అప్పటికీ అతడి అభిప్రాయం స్థిరంగా ఉండి మూడోసారి రుతుక్రమం అయిపోయిన తరువాత మూడోసారి తలాక్ చెప్పాల్సి ఉంటుంది. ఇంకో పద్ధతి ఉన్నా స్థూలంగా ఈ పద్ధతినే పోలి ఉంటుంది. తలాక్ చెప్తున్న ప్రతిసారీ ఇరువురి తరపున ఇద్దరు సాక్షులు ఉండాలనే విషయం విస్మరించరానిది. ఈ తలాక్ చెప్తున్న మూడు నెలల కాలంలో ఆమె భర్త ఉన్న ఇంట్లోనే ఉండే అధికారం ఉంది. ఈ పద్ధతిని ఇద్దత్ అంటారు. ఇద్దత్ కాలంలో ఆమె గర్భవతిగా ఉంటే ఆ బాధ్యతంతా భర్తే చూసుకోవాలి. ఇక తలాక్‌ను వాట్సప్‌లో పంపించడం, ఫోన్‌లో చెప్ప డం, పోస్టు ద్వారా చెప్పడం ఒకేసారి మూడుసార్లు తలాక్ చెప్ప టం అనే అంశాలన్నీ ఇస్లాం విధానానికి పూర్తి వ్యతిరేకమే. ఇంట ర్నెట్ వచ్చిన కొత్తలో స్కైప్ ద్వారా వివాహాలు జరపడం మొదలు పెట్టారు. ఈ నికాహ్‌లే ఇలాంటి తలాక్‌లకు తావిచ్చాయి కానీ, ఇస్లాం పుట్టినప్పుడు ఎలాంటి టెక్నాలజీ లేదనే విషయాన్ని మర్చిపోకూడదు. దేశంలో 15శాతం జనాభా ఉండగా ఇటువంటి వివాహాలు 0.01శాతం జరుగుతున్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు.



అఫ్రీన్ రెహమాన్ | గుల్షన్ పర్వీన్ | అతియా సబ్రీ | ఇష్రత్ ఇయాన్ | సయరా బానో

కోర్టు చెప్పిందేమిటి?

సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు కూడా ఇస్లాంలో లేని ఒక పద్ధతికి స్వస్తి చెప్పడంలాంటిదే. తలాక్ ఎ బిద్దత్ పేరుతో అసలు తలాక్ విధానాన్ని పాటించకుండా ఫాస్ట్‌ట్రాక్‌ను తీసుకొచ్చిన ప్రబుద్ధులకు మాత్రమే ఈ తీర్పు వర్తిస్తుంది. ఆరు నెలలపాటు తలాక్ ఎ బిద్దత్‌ను రద్దు చేయాలని కూడా స్పష్టం చేసింది. కోర్టు తీర్పును అనుసరిస్తూ, ఆధునిక టెక్నాలజీని వినియోగిస్తూ జరిగే తలాక్ ఎ బిద్దత్‌కు కళ్ళెం పడిందనుకుందాం. కానీ దీనివలన ఒనగూరిన ప్రయోజనాలేమిటో బోధపడట్లేదు. ఒకరిపై మరొకరికి ఇష్టం లేకుండానే కాపురం చేయగల్గుతారా? కోర్టు తీర్పును ఆధారం చేసుకున్న ఐదుగురు మహిళలు కూడా మళ్ళీ భర్తతో కలిసి ఉండేందుకు కానీ, అత్తామామలతో సయోధ్య కుదుర్చుకుని ఉంటామని కానీ సుముఖత వ్యక్తం చేయలేదు. సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటానని ఒకరు, ఉద్యోగం చేసుకుంటానని మరొకరు భిన్నమైన అభిప్రాయాలను వెల్లడించారు.

ఇస్లాంలో పురుషుడికి ఉన్నన్ని వెసులుబాట్లు స్త్రీలకు లేవు. భిన్నత్వంలో ఏకత్వమనేది భారత దేశపు ఆత్మ. ఏ దేశంలో లేని గొప్ప సంస్కృతి భారత్‌లో పరిఢవిల్లుతోంది. అటువంటి సమయంలో పరమత సహనం అత్యంత ముఖ్యమైన అంశం. మిగిలిన మతాల మాదిరిగానే ఇస్లామ్‌ను కూడా ఆదరించాల్సిన అవసరం ఉంది. మానసికంగా ఏర్పరుచుకున్న కంచెను ఇతర మతస్తులూ తొలగించుకోవాలి. అలాగే ముస్లింలు కూడా విశాల దృక్పథంలో అర్థం చేసుకుని, ఈ తీర్పును అభివృద్ధికి అవకాశంగా మలుచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

లింగ సమానత్వమంటే?

తలాక్ ఎ బిద్దత్‌ను రద్దు చేయడం ద్వారా లింగ సమానత్వం వస్తుందని కోర్టు అభిప్రాయపడింది. విడాకులు తీసుకోవడంలో ఒక పద్ధతి నిలుపుదల చేయడంవల్ల లింగసమానత్వం ఎలా వస్తుంది. మూడుసార్లు తలాక్ చెప్పిన తరువాత ఆమె అంటే ఇష్టంలేని ఆ ఇంట్లో ఆమె ఉండగలుగుతోందా? లింగ సమానత్వ విషయంపై చాలామంది ముల్లాలను అడిగినా ఒకే సమాధానం వినిపిస్తోంది. ఏ మతాల్లోనూ మహిళకు లేని గౌరవం ఇస్లాంలో కల్పిస్తుంది అని. పురుషాధిక్య భావజాలం వారితో అలా చెప్పించి ఉండొచ్చు. వారి ఉద్దేశ్యంలో "భర్తకు విధేయురాలై ఉండడం, భర్త ఆస్తులకు రక్షకురాలిగా ఉండడం, భర్త ఆజ్ఞలను శిరసావహించడం" వారికి ఇస్లాం కల్పించిన విశేష హక్కులట. ఇస్లాం రూపు దిద్దుకున్న సమయంలో ఈనాటి అభివృద్ధిలేదు. అందుబాటులో ఉన్న విధానాలతోనే ఇవి రూపొందించబడ్డాయి. ఏ మతంలోనైనా కాలక్రమేణా వస్తున్న మార్పులకు అనుగుణంగానే స్త్రీకి స్వేచ్ఛ లభిస్తూ వచ్చిందనే విష యాన్ని ఇక్కడ గమనంలోకి తీసుకోవాలి. ఇంతగా అభి వృద్ధి చెం దామని చెప్పుకుం టున్న ఈ తరంలోనూ గర్భస్త దశలోనే ఆడపిల్ల నలిగిపోవడం ద్వా రానే లింగ సమానత్వం ఏస్థాయిలో ఉందో అర్థమవుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో కేవలం మూఢత్వాన్ని ఇస్లామ్ మాత్రమే పెంచి పోషిస్తోందని చెప్పడం అజ్ఞానమే అవుతుంది.

రాజకీయ ప్రయోజనాలు

దేశంలో ఉన్న 15శాతం ముసల్మానులను ఆకర్షించేందుకు ప్రతిపార్టీలోనూ ఒక ప్రణాళిక ఉంటుంది. అటువంటి ప్రణాళిక బీజేపీకి కూడా ఉంటుంది. గోద్రా అంశాన్ని ఇప్పటికీ మరువలేని ముసల్మానులకు తాము ఎంతమాత్రం వ్యతిరేకం కాదనే సంకేతాలిచ్చేందుకు ఇప్పుడు తలాక్ అంశాన్ని ఉపయోగించుకుంటున్నది. ఇదే బీజేపీ గతంలో యూనిఫాం సివిల్ కోడ్ పేరుతో రచ్చ చేసిన విషయాన్ని మరువలేము. ఈ తీర్పు గుజరాత్, హిమాచల్ ప్రదేశ్‌లలో జరగనున్న ఎన్నికలకు ప్రచారాస్త్రమనేది నిస్సందేహం. షరియత్‌లో లేని విధానాన్ని అవలంబిస్తూ అదే ఇస్లాం అని చిత్రీకరిస్తున్న మిడిమిడి జ్ఞానం ఉన్న వారిని తీవ్రంగా తప్పుప డుతున్న మౌల్వీ అర్షద్ అభిప్రాయం ప్రకారం హిందూ వివాహ వ్యవస్థలోనూ ఎన్నో అంశాలున్నాయన్నారు. నూరేళ్ళు తోడుంటా నని అగ్ని సాక్షిగా ప్రమాణం చేసిన భర్త ఆమెకు చె ప్పాపెట్టకుండా పారిపోతే ఆ భార్య పరిస్థితి ఏమి టని ఆయన ప్రశ్నించారు. ఈ విషయంపై న్యాయ నిపుణులు విజయ్ భాస్కర్ జెల్లా మాట్లాడుతూ చట్ట ప్రకారం అటువంటి స్త్రీనాలుగేండ్ల తరువాత వేరే వివాహం చేసుకోవచ్చు. 1939 యాక్టు ప్రకా రం ఆమె పోషణకు సంబంధించిన విషయంపై కోర్టు ద్వారా కోరవచ్చు. అయితే ముస్లిం మహిళలు మాత్రం అలా నాలుగేండ్లపాటు వేచి చూడాల్సిన అవసరం లేదు. ఖులా, ఇద్దత్ సమయాల తరువాత వివాహం చేసుకునే సౌలభ్యం ఉంది అని షాహ్‌నవాజ్ వివరించారు.

ఇవీ కావాల్సినవి

రాళ్లూ, రప్పలు నిండిన రహదారిపై నుంచి ఒ కే ఒక చిన్న రాయిని తొలగించడంలాంటిది సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు. ఇస్లాంలో పురుషుడికి ఉన్నన్ని వెసులుబాట్లు స్త్రీలకు లేవు. భిన్నత్వంలో ఏకత్వమనేది భారత దేశపు ఆత్మ. ఏ దేశంలో లేని గొప్ప సంస్కృతి భారత్‌లో పరిఢవిల్లుతోంది. అటువంటి సమయంలో పరమత సహనం అత్యంత ముఖ్యమైన అంశం. మిగిలిన మతాల మాదిరిగానే ఇస్లామ్‌ను కూడా ఆదరించాల్సిన అవసరం ఉంది. మానసికంగా ఏర్పరుచుకున్న కంచెను ఇతర మతస్తులూ తొలగించుకోవాలి. అలాగే ముస్లింలు కూడా విశాల దృక్పథంలో అర్థం చేసుకుని, ఈ తీర్పును అభివృద్ధికి అవకాశంగా మలుచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మహిళలకు విస్తృత స్థాయిలో ఉన్న అవకాశాలను వినియోగించుకుని అభివృద్ధి పథంలో నడిపించాలి. ట్రిపుల్ తలాక్ తీర్పు నేపథ్యంలో కేంద్రం చట్టం చేసే దిశగా ఆలోచించాలి. ఇందుకు ముస్లిం పర్సనల్ లా బోర్డు, ఇతర ఇస్లామిక్ సంస్థల మేధావులతో సమాలోచనలు జరపాలి. కేవలం తలాక్ ఎ బిద్దత్‌పై మాత్రమే కాకుండా ముస్లిం మహిళల అభివృద్ధికి ప్రత్యేకమైన చర్యలు తీసుకోవాలి. ఇందుకు ముస్లిం సమాజమంతా కలిసికట్టుగా పనిచేసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సెల్ : 96524 32981

బంతిలో కలవని బతుకమ్మ

ఓగోటి కిరణ్‌కుమార్

తెలంగాణ ఉద్యమంలో బతుకమ్మలకు ప్రత్యేక స్థానం ఉంది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం ఈ ఉత్సవాలకు ప్రత్యేక నిధులు కేటాయించి ఆదరిస్తున్నది. ఆనాడు వాడవాడలా బతుకమ్మ ఆడి ప్రత్యేక రాష్ట్రం కోసం మహిళలు గలమెత్తారు. కానీ నేడు ఈ బతుకమ్మ సంబురాలకు రాష్ట్రంలో 99 శాతానికి పైగా గ్రామాల్లో దళితులు దూరంగా ఉంటున్నారు. ప్రభుత్వం నిధులు ఖర్చు చేస్తున్నా తామెందుకు బతుకమ్మ ఆడకూడదని తలంచిన గ్రామస్తులు 2016 సంవత్సరంలో ఆ ఉత్సవాలకు ఏర్పాట్లు చేసుకున్నారు. దళిత మహిళలు కొంతమంది బతుకమ్మలు పేర్చి సంబురాలు జరిపారు. కానీ ఆ బతుకమ్మ గ్రామస్తుల బంతిలో కలవకుండా వెలేసినట్టు వేరుగా నిమజ్జమైనది.



గ్రామంలో అందరితోపాటు ఒకేరోజు వెళ్తున్న దళితుల బోనాలు

తెలంగాణలో ముఖ్యమైన పండుగల్లో బతుకమ్మ ఒకటి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం ఈ ఉత్సవాలకు ప్రత్యేక నిధులు కేటాయించి ఆదరిస్తున్నది. తెలంగాణ ఉద్యమంలో బతుకమ్మలకు ప్రత్యేక స్థానం ఉంది. ఆనాడు వాడవాడలా బతుకమ్మ ఆడి ప్రత్యేక రాష్ట్రం కోసం మహిళలు గలమెత్తారు. కానీ నేడు ఈ బతుకమ్మ సంబురాలకు రాష్ట్రంలో 99 శాతానికి పైగా గ్రామాల్లో దళితులు దూరంగా ఉంటున్నారు. ప్రభుత్వం నిధులు ఖర్చు చేస్తున్నా తామెందుకు బతుకమ్మ ఆడకూడదని తలంచిన గ్రామస్తులు 2016 సంవత్సరంలో ఆ ఉత్సవాలకు ఏర్పాట్లు చేసుకున్నారు. దళిత మహిళలు కొంతమంది బతుకమ్మలు పేర్చి సంబురాలు జరిపారు. కానీ ఆ బతుకమ్మ గ్రామస్తుల బంతిలో కలవకుండా వెలేసినట్టు వేరుగా నిమజ్జమైనది. గ్రామంలో దళితులు మినహా మిగతా గ్రామస్తులంతా ఒక చోట చేరి సంబురాలు జరిపితే దళితుల బతుకమ్మకు మాత్రం బంతిలో చోటు దక్కలేదు. రాజధానికి కూతవేటు దూరంలో ఉన్న ఇబ్రహీంపట్నం నియోజకవర్గం, యాచారం మండలంలోని మొండి గౌరెల్లిలో ఈఘటన చోటుచేసుకుంది. అయితే దళితులు బతుకమ్మ ఆడటం ప్రారంభమైనందుకు సంతోషిస్తూనే ఈసారి మరింత ఘనంగా నిర్వహించాలని అనుకుంటున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో ముఖ్యంగా దళితుల విషయంలో కుల వివక్ష రూపం మాత్రమే మారింది. దాని తీవ్రత మాత్రం తగ్గలేదు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ వంటి చట్టాలు వచ్చినప్పటికీ సక్రమంగా అమలు చేయడం లేదు. చేసే పనుల్లో ఇతర కులాలకు, దళితులకు మధ్య తేడాలు కొట్టొచ్చినట్టు కనిపిస్తాయి. ఇలాంటి ఘటన అదే గ్రామంలో ఇటీవల నిర్వహించిన బోనాల ఉత్సవాల సందర్భంగా బహిర్గతమైంది.

మీ గుడులకు మేం రంగులేయం

పట్టణాల్లో కంటే గ్రామాల్లో కుల వివక్ష కొట్టొచ్చినట్టు కనిపిస్తూ ఉన్నది. ఒకే గ్రామమైనా పండుగల విషయంలో ప్రజలు విడదీసినట్టు కనిపిస్తుంటారు. ఇది రాష్ట్రవ్యాప్తంగా అత్యధిక గ్రామాల్లో కనిపిస్తున్నది. మొండి గౌరెల్లి గ్రామస్తులు అందులో ముఖ్యంగా దళితులు ఇలాంటి వాటిని అధిగమించేందుకు ముందుకు సాగుతున్నారు. ఇటీవల జరిగిన బోనాల పండుగకు ఎవరి గుడి వారిదే అయినా అంతా ఒకేసారి వెళ్లాలని భావించారు. అందుకు అన్ని గుడులకు రంగులు వేయాలని కోరగా దళితుల గుడులకు మేం వేయమని ముదిరాజ్‌లు నిరాకరించారు. 'వేస్తే అన్ని గుడులకు మీరే వేయండి, లేకుంటే దేనికీ వేయనవసరం లేదు' అని సర్పంచ్ ఖరాకండిగా చెప్పడంతో అత్యధిక భాగం గ్రామస్తులు సైతం మద్దతుగా నిలిచారు. దీంతో అన్ని గుడులకు ఒకేసారి రంగులు వేశారు. బోనాలు కూడా ఇప్పటి వరకు కులాల వారీగా వెళ్లేవారు. ఒక రోజు ఎస్సీలు, మరొక రోజు మిగతా అన్ని కులాల వారు వెళ్లేవారు. దీనిని కూడా మార్చివేశారు. ఈసారి ఊరంతా ఒకేసారి బోనాలు వైభవంగా నిర్వహించారు.

గౌరవం కోసం గౌరెల్లి అడుగులు

ఆత్మగౌరవం, సమానత్వం కోసం అగ్రకులాలకు ఎదురేగుతూ ఆ గ్రామ దళితులు ముందుకు సాగుతున్నారు. తాము చేసిందే న్యాయం, చెప్పిందే వేదం అనే నానుడికి చరమగీతం పాడేందుకు అగ్రవర్ణాలకు వ్యతిరేకంగా దళితులు, బీసీలు ఒక్కతాటి మీద నడుస్తున్నారు. గౌరెల్లి గ్రామంలో సుమారు 3,000 జనాభా. 1400 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో దళితుల ఓట్లే 700 వరకు ఉంటాయి. అంటే గ్రామ ఓట్లలో సగం వరకు దళితులవే. అయినా ఆ గ్రామంలో అతి తక్కువ జనాభా గల అగ్ర కులాల వారిదే పెత్తనం. గ్రామంలో ఏ నిర్ణయం చేయాలన్నా వారు చెప్పినట్టు జరగాల్సిందే. ఆ గ్రామం 1981 వరకు యాచారం పంచాయతీ పరిధిలో ఉండేది. 1981లో ప్రత్యేక పంచాయతీగా ప్రభుత్వం ప్రకటించింది. రిజర్వేషన్లలో భాగంగా అప్పటి నుంచి నేటి వరకు ముగ్గురు ఎస్సీ సర్పంచులుగా ఎన్నికయ్యారు. విజయదశమి (దసర) పండుగ రోజు ఆ గ్రామంలో జాతీయ జెండాను ఎగురవేయడం ఆనవాయితీ. ఎవరు సర్పంచుగా ఉన్నా గ్రామ పెత్తందారులే ఎగురవేసేవారు. దీనిపైనే దళితులు మొదటగా తిరగబడ్డారు. గ్రామ ప్రథమ పౌరుడు ఎవరైతే వారే జెండాను ఆవిష్కరించాలని పట్టుబట్టారు. వీరికి బీసీల నుంచి మద్దతు లభించింది. అయినా పెత్తందారులు అడ్డుపడటంతో 2015లో దళితులు వెనక్కి తగ్గాల్సి వచ్చింది. 2016 సంవత్సరంలో పెత్తందారులపై గ్రామస్తులు తిరగబడి దళితుడైన సర్పంచ్ చేత జెండా ఆవిష్కరణ చేయించారు.

కుల వివక్షలో మరికొన్ని రూపాలు

గ్రామాల్లో అగ్రకులాలు, అణగారిన కులాల మధ్య కులవివక్షత పరోక్ష పద్ధతిలో కనిపిస్తూ ఉంటుంది. రెడ్డి, దొర, పటేల్ ఇలా ఏ పేరుతో పిలిచినా వారంటే ఇతర కులాలకు భయం పూరితమైన గౌరవం ఉంటుంది. పైకులాల వారు సాధారణంగా దళితవాడల్లోకి రారు. తప్పనిసరి పరిస్థితుల్లో వచ్చినా రాజసం చూపిస్తుంటారు. అదే ఇతర కులాల వారు ముఖ్యంగా దళితులు అగ్రవర్ణాల వారి ఇంటివైపు వెళ్తే గేటు దాటేందుకు కూడా పది రకాలుగా సంశయిస్తారు.

గ్రామసభలో తీర్మానిస్తాం : సర్పంచ్ కృష్ణమాదిగ



మా గ్రామంలో దసరా పండుగ రోజు జాతీయ జెండాను ఎగురవేయడం అనాదిగా వస్తున్నది. అయితే దీనిపై గ్రామంలో స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించుకున్నాం. త్వరలో గ్రామ సభ నిర్వహించి సర్పంచ్ ఎవరైతే వారే జెండా ఎగురవేసేలా తీర్మానం చేస్తాం. ఇది భవిష్యత్తు తరాలకు కూడా శ్రేయస్కరం. ఇప్పటికీ ప్రణాళిక రూపొందిస్తున్నాం. గ్రామ ముఖ్యులతో సంప్రదింపులు జరుగుతున్నాయి.

సెల్: 9666011107



జాతీయ జెండాను ఎగురవేస్తున్న దృశ్యం

స్త్రీల హక్కులు-అంబేద్కర్ ఆలోచన



మూడు సార్లు తలాక్ చెప్పి ముస్లింలలో విడాకులు తీసుకోవడం నిషేధమని సుప్రింకోర్టు తీర్పు వెలువరించిన నేపథ్యంలో స్త్రీల హక్కులపై దేశవ్యాప్తంగా నేడు చర్చ జరుగుతున్నది. ఈనేపథ్యంలో స్త్రీల హక్కులపై అంబేద్కర్ ఎన్నో పోరాటాలు చేశారు. మహిళల హక్కుల కోసం ఎందరో మహానుభావులు ఎన్నో ఉద్యమాలు నిర్వహించినా మహాత్మాపూలే, డాక్టర్ అంబేద్కర్‌ల గురించి చెప్పుకోవాల్సిన అవసరం ఉంది. హిందూ కోడ్ బిల్లును ఆనాటి పార్లమెంట్‌లో కాంగ్రెస్ నాయకులు వ్యతిరేకించడంపై కలత చెందిన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ తన కేంద్ర మంత్రి పదవికే రాజీనామా సమర్పించారు. స్త్రీల పట్ల ఆయనకు అంతటి గౌరవం ఉంటుంది. స్త్రీల హక్కులపై అంబేద్కర్ ఎంతో లోతైన అధ్యయనం చేశారు. అందుకే బ్రాహ్మణ సంస్కర్తలు నడిపిన సంస్కరణోద్యమాలకు, మహాత్మా పూలే, డా॥బిఆర్.అంబేద్కర్ నడిపిన స్త్రీ విముక్తి ఉద్యమాలకు మౌలిక భేదం ఉంది. హిందూ సంస్కర్తలు పునాదిని తొలగించకుండా ఉపరితలం మీద ఆలోచన చేశారు. కానీ పూలే, అంబేద్కర్ హిందూ వ్యవస్థ పునాదులను తొలగించ పూనుకున్నారు. వీరు హిందూ వ్యవస్థను, హిందూ కుటుంబాల పునాదులను పునర్నిర్మించటంలో శాస్త్రీయమైన అవగాహనతో కృషి చేశారు. 'సతి' దురాచార నిర్మూలన, వితంతు పునర్వివాహం, బాల్య వివాహాల నిషేధం వంటివి హిందూ కౌటుంబిక సంస్కరణలు మాత్రమే. కుల నిర్మూలన, అస్పృశ్యతా నిర్మూలన హిందూ వ్యవస్థలోని బానిస భావ నిర్మూలన, స్త్రీ విద్య, వ్యక్తిత్వ నిరూపణ కోసం కృషి వంటివి మొత్తం హిందూ వ్యవస్థ పునర్నిర్మాణానికి సంబంధించిన అంశాలు. విద్యాపైనా, ఆస్తిపైనా, స్త్రీకి నిషేధించిన పితృస్వామికత్వంపై చేసే సమరం మాత్రమే. స్త్రీ విముక్తి ఉద్యమానికి పునాదిని చేకూర్చుతుంది. మనువు, పరాశరుడు, యాజ్ఞవల్క్యుడు, సమస్త స్మృతి కర్తలు స్త్రీకి నిషేధించిన పౌరసత్వాన్ని పునర్నిర్మించడానికి సంబంధించిన పోరాటమే నిజమైన స్త్రీ విముక్తి పునాదిని కలుగజేస్తుంది. ఆ మౌలికమైన ఉద్యమాన్ని అంబేద్కర్ చేపట్టాడు. స్త్రీ వ్యక్తిత్వాన్ని, హక్కులను నిరూపించి పోరాటంతో ఆయన శాస్త్రీయ పద్ధతిని రూపొందించారు. స్త్రీకి ఆస్తిపైనా, విద్యాపైనా హక్కును హిందూ వ్యవస్థ నిరాకరించింది. స్త్రీలను కేవలం భోగ వస్తువుగా పరిగణించి, పురుషులను ఆనందపెట్టడమే వారి బాధ్యతగా స్మృతికారులు నిర్ణయించారు. వారి స్వేచ్ఛను అన్ని రంగాల్లోనూ నిరోధించారు. వారికి పౌర హక్కులు లేకుండా చేసి వారిని బానిసలుగా చూశారు.

అంబేద్కర్ కేవలం మనుస్మృతి రూపొందించిన వ్యవస్థ మీద పరిశోధించడమేకాక, కానిస్టిట్యూయంట్ అసెంబ్లీలో హిందూ కోడ్ బిల్లుపై మాట్లాడుతూ స్త్రీల విషయంలో కామన్‌కోడ్ ఉండాలని సూచించారు. అందులో ప్రధానంగా స్త్రీలకు ఆస్తిపైనా, విడాకులపైనా హక్కు ఉండాలని, వివాహపు వయస్సు, స్త్రీ రక్షణ విషయాల్లో శాస్త్రీయ దృక్పథం కావాలని వాదించారు. అయితే 1955 హిందూ మేరేజెస్ యాక్టు వచ్చే వరకు కులాంతర, వర్ణాంతర వివాహాలు చట్టబద్ధం కాదు. 1955 తరువాతే వర్ణాంతర వివాహాలకు స్వేచ్ఛ ఏర్పడింది. అయితే భార్యాభర్తల మధ్య మనస్పర్థల నేపథ్యంలో తీసుకునే విడాకులు ప్రాచీన కాలంలో కూడా అమలులో ఉండేవని, నారదస్మృతి, పరాశరస్మృతి విడాకులు అంగీకరిస్తున్నాయని, విడాకుల విషయంలో అడ్డు చెబుతున్న హిందూ సాంప్రదాయవాదులకు అంబేద్కర్ సమాధానం చెప్పారు. కౌటిల్యుడి కాలంలోనూ విడాకుల హక్కు ఉందని అంబేద్కర్ ఆధారాలు చూపించారు. కౌటిల్యుని కాలంలో భార్యాభర్తలలో ఒకరిపైన ఒకరికి కలిగిన ద్వేష భావం, విరోధం కారణంగా స్త్రీలు విడాకులను కోరగలిగారని చెప్పారు. తన భర్తను ద్వేషించే స్త్రీ, అతని ఇష్టానికి వ్యతిరేకంగా తన వివాహబంధాన్ని తెంచుకోలేదు. అట్లాగే భర్త తన భార్య ఇష్టానికి విరుద్ధంగా వైవాహిక సంబంధాన్ని రద్దు పరచుకోలేడు. వారు పరస్పరంగా ద్వేషించుకున్నప్పుడు మాత్రమే విడాకులు సాధ్యపడేవి. భార్య వలన తనకు ప్రమాదం కలుగుతుందని భయపడ్డ భర్త విడాకులు కోరినట్లయితే, వివాహ సందర్భంలో ఆమెకివ్వబడిన వస్తువులన్నీ ఇచ్చివేయాలి. అదే స్త్రీ అయితే భర్త ఆస్తిపై హక్కును వదులుకోవాలి. భర్త నడత మంచిది కానప్పుడు భార్య అతనిని వదిలివేయవచ్చునని కూడా కౌటిల్యుడి అర్థశాస్త్రంలో ఉంది.

పరిమితం లేని కాలానికి మనోవర్తిని కోరే హక్కుగల స్త్రీకి అవసరమైన మేరకు కొన్ని సందర్భాల్లో అవసరానికి మించకుండా, కూడు, గుడ్డకు సంరక్షకుడు తన ఆదాయానికి తగిన దామాషా ఇవ్వవలసి ఉంటుంది. మనోవర్తి ఇవ్వవలసిన కాలం పరిమితంగా ఉన్నట్లయితే సంరక్షకుడి ఆదాయానికి తగినట్టు కొంత మొత్తాన్ని ఆమెకివ్వాలి. ఆమె తనంతట తానుగా అంగీకరించి తన మామాగారి కుటుంబంలోని వారి సంరక్షణలో ఉన్నప్పుడు లేక ఆమె ఇష్టానుసారంగా స్వేచ్ఛగా ఉన్నప్పుడు ఆమె పోషణకు భర్తను కోరకూడదు. ఈ విధంగా సంరక్షణ విధానం చెప్పబడింది. కౌటిల్యుడి కాలంలో ఒక స్త్రీకిగానీ, ఒక విధవ(వితంతువు)కు గాని పునర్వివాహం చేసుకోవటంపైన ఎటువంటి నిషేధం లేదు. జీవనాధారమైన వృత్తి, ఆభరణాలు స్త్రీ ఆస్తిగా కౌటిల్యుడి అర్థశాస్త్రంలో పేర్కొనబడినవి. వృత్తిపరమైన ఆదాయం రెండు వేల వరకు ఆమె పేర ఉంటుంది. ఆభరణాలకు పరిమితి లేదు. సంబంధం వదులుకున్న భర్త తన సంరక్షణకు ఏర్పాట్లు చేయని సందర్భాల్లో భార్య ఆ ఆస్తిని కుమారుడికో, కోడలికో, తనకో వినియోగించటంలో తప్పులేదు. విపత్తు, జబ్బులు, కరువు సమయాల్లో మరమ్మతులకు, ధర్మ కార్యాలకు భర్తలు కూడా ఆ ఆస్తిని వినియోగించుకోవచ్చును. ఇటువంటి ఆధారాలెన్నో చూపించి ఆయన స్త్రీ హక్కులను చారిత్రకంగా నిర్ధారించారు. హిందూ ఛాందసుల నోళ్లుమూత పడేలా ఆయన తన వాదనా పటిమతో స్త్రీ విముక్తి కోసం నడుం కట్టారు. స్త్రీల హక్కులకు జీవగర్ర అయిన హిందూ కోడ్ బిల్లును కాంగ్రెస్ పార్లమెంట్ అంగీకరించనందుకు నిరసనగా అంబేద్కర్ రాజీనామా చేశారు. అంటే ఆయనకు స్త్రీ విముక్తి పట్ల ఉన్న పట్టుదల వ్యక్తమవుతుంది.

(సేకరణ : - సాంఘిక విప్లవమూర్తి డా॥అంబేద్కర్ పుస్తకం నుంచి...)


ఫ్లాయిడ్ మేవేదర్

మేవేదర్ 50-0

అజేయుడిగా కెరీర్‌కు వీడ్కోలు
ఆఖరి ఫైట్‌లో మెక్‌గ్రెగర్‌పై గెలుపు

లాస్ వెగాస్ (అమెరికా) : కాసులు కురిపించిన బాక్సింగ్ ఫైట్‌లో ఫ్లాయిడ్ మేవేదర్ ఊహించినట్టుగానే విజయం సాధించాడు. లాస్ వెగాస్ ఫైట్‌తో ఆరంగ్రేటం చేసిన ఐర్లాండ్ మార్షల్ ఆర్ట్స్ స్టార్ కానర్ మెక్‌గ్రెగర్ పది రౌండ్ల పోరులో మేవదర్‌కు చెప్పుకోదగిన పోటీ ఇచ్చాడు. మెక్‌గ్రెగర్‌ను మట్టికరిపించిన మేవదర్ కెరీర్‌లో 50వ విజయం సాధించాడు. హెవీవెయిట్ దిగ్గజ చాంపియన్ రాకీ మరికావో (49-0) రికార్డును మేవదర్ ఆదివారం విజయంతో అధిగమించాడు. ప్రొ బాక్సింగ్‌లో అజేయ బాక్సర్‌గా కెరీర్‌ను ముగించాడు. పది రౌండ్ల పోరులో మేవేధర్ 320 పంచ్‌లు విసరగా, వాటిలో 170 పంచ్‌లకు మెక్‌గ్రెగర్ విలవిల్లాడాడు. మెక్‌గ్రెగర్ 430 పంచ్‌లు విసరగా, వాటిలో కేవలం 111 పంచ్‌లు మాత్రమే మేవేదర్‌ను చేరాయి. మేవేదర్ కెరీర్ 50 విజయాల్లో ఏకంగా 27 నాకౌట్లు సాధించాడు. రూ. 1700 కోట్ల ఫైట్‌లో మేవదర్ రూ.1280 కోట్లు, మెక్‌గ్రెగర్ రూ.400 కోట్లు ఆర్జించారు. రెండేండ్ల క్రితం పకియావ్ (ఫిలిప్పిన్స్)పై విజయంతో కెరీర్‌కు గుడ్‌బై చెప్పిన మేవేదర్ అర్థ సెంచరీ విజయం కోసం మళ్లీ బాక్సింగ్ రింగ్‌లోకి దిగాడు. ఈ ఫైట్‌లో సెకన్‌కు సగటున రూ. 37 లక్షలు ఆర్జించాడు. ఇక మేవేదర్ ఆఖరి విజయానికి అందుకున్న బెల్ట్‌ను 3360 వజ్రాలు, 1.5 కేజీల మేలిమి బంగారంతో తయారు చేయటం విశేషం.



తొలి రోజే 13 వికెట్లు

బంగ్లాతో ఆసీస్ తొలి టెస్టు

ఢాకా : బంగ్లాదేశ్, ఆస్ట్రేలియా తొలి టెస్టు తొలి రోజే వికెట్ల జాతర. టర్నింగ్ పిచ్‌పై స్పిన్నర్లు చెలరేగటంతో వికెట్ల పతనం జోరుగా సాగింది. తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ 10/3తో కష్టాల్లో నిలిచింది. తమీమ్ ఇక్బాల్ (71, 144 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), షకిబ్ అల్ హసన్ (84, 133 బంతుల్లో 11 ఫోర్లు) అర్థ సెంచరీలు సాధించటంతో బంగ్లా 260 పరుగులు చేయగల్గింది. సౌమ్య సర్కార్ (8), ఇమ్రుల్ కయిస్ (0), షబ్బీర్ రెహమాన్ (0), ముష్ఫికర్ రహీం (18)లు విఫలమయ్యారు. ఆసీస్ స్పిన్నర్లు ఆగర్ (3/46), లియాన్ (3/79) సహా సీమర్ పాట్ కమిన్స్ (3/63) మూడేసి వికెట్లు కూల్చారు. బంగ్లా స్పిన్నర్లు సైతం మెరవటంతో ఆస్ట్రేలియా 18/3తో కష్టాల్లో నిలిచింది. వార్నర్ (0), ఖవాజా (1), లియాన్ (0)లు పెవిలియన్‌కు చేరారు. రెన్షా (6), స్మిత్ (3)లు క్రీజులో కొనసాగుతున్నారు. షకిబ్, మెహది హసన్‌లు చెరో వికెట్ పడగొట్టారు. ఆసీస్ ఇంకా 242 పరుగుల తొలి ఇన్నింగ్స్ వెనుకంజలో కొనసాగుతోంది.

ముర్రే కూడా మిస్

న్యూయార్క్ : నేటి నుంచి ఆరంభం కానున్న యూ.ఎస్ ఓపెన్‌కు మరో స్టార్ ఆటగాడు దూరమయ్యాడు. గాయాల బారిన పడిన 12 గ్రాండ్‌స్లామ్స్ విన్నర్ నొవాక్ జకోవిచ్ (సెర్బియా), స్విస్ స్టార్ స్టానిస్లాస్ వావ్రింకా, జపాన్ ఆటగాడు కియ్ నిషికోరి సహా కెనడా కెరటం మిలోస్ రావోనిక్‌లు ఫిట్‌నెస్ లేమితో న్యూయార్క్ గ్రాండ్‌స్లామ్ నుంచి వైదొలిగారు. ఇప్పుడు ఈ జాబితాలో వరల్డ్ నెం.2, బ్రిటన్ స్టార్ ఆండీ ముర్రే సైతం చేరాడు. పిరుదుల గాయంతో బాధపడుతున్న ముర్రే, యూ.ఎస్ ఓపెన్‌లో ఆడలేనని పేర్కొన్నాడు. 'స్పెషలిస్ట్‌లతో మాట్లాడాను. అన్ని విధాలుగా ప్రయత్నించాను. ప్రాక్టీస్‌లో ఫర్వాలేదు అనిపిస్తున్నా, గాయం బాధ తెలుస్తోంది. దురదృష్టశావత్తు ఈ ఏడాది న్యూయార్క్‌లో పోటీపడలేకపోతున్నాను. ఈ ఏడాది ఆఖరికల్లా మళ్లీ కోర్టులో కనిపిస్తా' అని ముర్రే పేర్కొన్నాడు. టెన్నిస్ గ్రాండ్‌స్లామ్ సీజన్‌లో ఏడాది ఆఖరు గ్రాండ్‌స్లామ్ యూ.ఎస్ ఓపెన్ నేటి నుంచి ఆరంభం కానున్నది. రోజర్ ఫెడరర్, రఫెల్ నడాల్‌లు ఇప్పుడు మెన్స్ సింగిల్స్ టైటిల్ కోసం పోరాడనున్నారు.


పి.వి సింధు

పసిడి పోరులో నిర్ణయాత్మక మూడో గేమ్. 20-20తో సింధు ముంగిట స్వర్ణావకాశం. ప్రపంచ చాంపియన్‌షిప్‌కు రెండే రెండు పాయింట్ల దూరంలో తెలుగు తేజం. కానీ స్వర్ణావకాశం ముంగిట తడబడిన పి.వి సింధు మరో ప్రతిష్ఠాత్మక ప్రపంచ టోర్నీలో సిల్వర్‌తో సరిపెట్టుకున్నది. గ్లాస్గోలో రజతం సాధించి ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో తన పతకాన్ని మెరుగుపర్చుకున్నది. వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో మూడు మెడల్స్ నెగ్గిన ఏకైక షట్లర్‌గా సింధు చరిత్ర సృష్టించింది.

ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో పి.వి సింధు, సైనా నెహ్వాల్ జోరుతో భారత్ తొలిసారి రెండు పతకాలు సాధించింది. సైనా కాంస్యం సాధించగా, సింధు సిల్వర్ ఎగరేసుకుపోయింది. పసిడిపై కన్నేసి గ్లాస్గోకు వచ్చిన సింధు ఈసారికి సిల్వర్‌తో సరిపెట్టుకున్నది. సెమీస్‌లో సైనాను ఓడించిన జపాన్ షట్లర్ నొజోమి ఒకుహార, ఫైనల్లో సింధుపైనా పైచేయి సాధించి మహిళల సింగిల్స్ ప్రపంచ విజేతగా నిలిచింది.

రజత సింధూరం

- ఫైనల్లో పసిడి చేజార్చుకున్న తెలుగు తేజం
- హోరాహోరీ పోరులో 1-2తో వెనుకంజ
- ప్రపంచ చాంపియన్‌గా ఒకుహార
- సైనా నెహ్వాల్‌కు కాంస్య పతకం
- బ్యాడ్మింటన్ ప్రపంచ చాంపియన్‌షిప్స్

నవతెలంగాణ-గ్లాస్గో

ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో తెలుగు తేజం పూసర్ల వెంకట సింధు మరో చరిత్ర సృష్టించింది. మహిళల సింగిల్స్‌లో రజతం సాధించిన ప్రతిష్టాత్మక ఈవెంట్‌లో ముచ్చటగా మూడో మెడల్‌ను సొంతం చేసుకున్నది. వరల్డ్ నెం.12, జపాన్ షట్లర్ నొజోమి ఒకుహరతో ఆదివారం జరిగిన ఫైనల్లో పి.వి సింధు 1-2తో ఓటమిపాలైంది. సుమారు రెండు గంటల పాటు హోరాహోరీగా సాగిన పసిడి పోరులో 19-21, 22-20, 20-22తో సింధు వెనుకంజ వేసింది. ఆద్యంతం ఉత్కంఠగా సాగిన ఫైనల్లో జపాన్ చిన్నది పసిడి పతకాన్ని ఎగరేసుకుపోయింది. శనివారం నాటి సెమీఫైనల్లో సైనా నెహ్వాల్‌ను ఓడించిన ఒకుహర, తాజాగా ఫైనల్లో మరో భారత అగ్రశ్రేణి క్రీడాకారిణి పి.వి సింధును జయించి జగజ్జేతగా నిలిచింది.

ఆరంభం అదిరినా.. : వరల్డ్ నెం.4 పి.వి సింధు పసిడి పోరులో ఫేవరేట్‌గా బరిలోకి దిగింది. ఒకుహరతో ముఖాముఖి పోరులో 3-3తో సమవుజ్జీగా నిలిచిన సింధు.. ఫైనల్లో పైచేయి సాధించేలా కనిపించింది. అందుకు తగినట్టే ఆరంభంలో సింధు దుమ్మురేపింది. తొలి గేమ్‌లో వరుసగా ఎనిమిది పాయింట్లు సాధించింది సింధు. తొలుత 3-3, 3-5తో వెనుకంజ వేసిన సింధు వరుస పాయింట్లతో విరామ సమయానికి 11-5తో ఆరు పాయింట్ల ఆధిక్యం సాధించింది. ద్వితీయార్థంలోనూ దూకుడు కొనసాగించిన సింధు 12-8తో నిలిచింది. కానీ క్రమంగా పుంజుకున్న ఒకుహర 14-14తో స్కోరు సమం చేయటమే కాదు 18-14తో సింధును వెనక్కి నెట్టేసింది. ఈ దశలో సింధు మళ్లీ పుంజుకుని 19-19తో సమవుజ్జీగా నిలిచింది. కానీ ఆఖర్లో వరుస పాయింట్లు సాధించిన ఒకుహర 21-19తో తొలి గేమ్‌ను సొంతం చేసుకున్నది. 25 నిమిషాల పాటు సాగిన తొలి గేమ్‌లో ఒకుహర, సింధులు వేగంగా ఆడారు. కానీ నెట్ వద్ద ఒకుహర పైచేయి సాధించింది. ఇద్దరూ దూకుడుగా స్మాష్‌లు సంధించుకున్నా, సుదీర్ఘ ర్యాలీలతో పైచేయి సాధించిన ఒకుహర ఆధిక్యం చేజిక్కించుకున్నది.

కండ్లుచెదిరే ర్యాలీ నెగ్గి.. : రెండో గేమ్‌ను సైతం సింధు గొప్పగా ఆరంభించింది. ముగింపులోనూ అదే జోరు చూపించిన తెలుగు తేజం మ్యాచ్‌ను మూడో గేమ్‌ను తీసుకెళ్లగల్గింది. 2-0, 5-1తో ముందంజలో నిలిచినా ఒకుహరను నిలువరించలేదు. దీంతో వరుస పాయింట్లు సాధించిన ఒకుహర విరామ సమయానికి 8-11తో సింధుతో పాయింట్ల అంతరాన్ని తగ్గించుకున్నది. ద్వితీయార్థంలో పాయింట్ల కోసం సుదీర్ఘ ర్యాలీలతో పోరాడటంతో.. ఆధిక్యం ఎటు వైపు వెళుతుందనే ఉత్కంఠ నెలకొన్నది. 12-12తో స్కోరు సమం చేసిన ఒకుహర 13-12తో ముందంజ వేసింది. కానీ సింధు 16-13, 18-16తో ఆధిక్యం నిలుపుకున్నది. ఈ సమయంలో 20-17తో గేమ్ పాయింట్ ముందు నిలిచిన సింధు మరోసారి నెట్ దగ్గర విఫలమైంది. దీంతో ఒకుహర 20-20తో రేసులోకి వచ్చింది. రెండు పాయింట్లు కోల్పోతే మ్యాచ్‌పై ఆశలు వదులుకోవాల్సిన తరుణంలో 43 షాట్ల ర్యాలీతో పాటు 73 షాట్ల ర్యాలీనీ నెగ్గిన సింధు ఔరా అనిపించింది. ఇద్దరు షట్లర్లూ సర్వశక్తులు ఒడ్డి ఆడారు. 38 నిమిషాల ఈ పోరులో నెగ్గిన సింధు.. మానసికంగా పైచేయి సాధించింది. ఈ గేమ్‌లో బ్యాక్‌హ్యాండ్‌తో సింధు ఇచ్చిన రిప్లేలతో ఒకుహర విస్తుపోయింది.


నొజోమి ఒకుహర

తడబడిన సింధు : నిర్ణయాత్మక మూడో గేమ్‌లో తొలిసారి సింధు ఆరంభంలో ఆధిక్యం కోల్పోయింది. 1-0తో గేమ్‌ను ఘనంగా మొదలెట్టినా, 1-5తో ఒకుహరకు కీలక ఆధిక్యం కోల్పోయింది. కానీ వేగంగా పుంజుకుని 5-5తో స్కోరు సమం చేసింది. పదునైన స్మాష్‌లతో చెలరేగిన సింధు 11-9తో విరామ సమయానికి ఒకుహరను నిలువరించగల్గింది. కానీ ద్వితీయార్థంలో అసలు డ్రామా మొదలైంది. 11-11, 12-12, 13-13, 14-14, 15-15, 16-16, 17-7తో ఆధిక్యం చేతులు మారుతూ ఆద్యంతం ఉత్కంఠగా సాగింది. ఈ దశలో 19-18తో ముందంజ వేసిన సింధు ఆధిక్యం నిలుపుకోలేదు. 19-19తో ఒకుహర పుంజుకున్నది. 20-19తో గేమ్ పాయింట్ ముందు నిలిచిన ఒకుహరను నిలువరించి 20-20 టైబ్రేకర్‌కు తీసుకెళ్లింది. కానీ ఇక్కడా మళ్లీ నెట్ గేమ్‌తోనే తప్పిదం చేసిన సింధు రెండు పాయింట్లు కోల్పోయి సిల్వర్‌తో సరిపెట్టుకున్నది. ఇక శనివారం అర్ధరాత్రి తర్వాత జరిగిన సెమీఫైనల్లో చైనా షట్లర్ చెన్ యెఫెయ్‌పై 21-13, 21-10తో పి.వి సింధు మెరుపు విజయం సాధించింది. చైనా వర్ధమాన సంచలనంగా పిలువబడుతునన చెన్‌ను చిత్తు చేసిన సింధు.. ఫైనల్లోనూ ఆ జోరు చూపలేకపోయింది.


సైనా నెహ్వాల్

సింధు	ఫైనల్లో ఎవరెలా..	ఒకుహార
08	వరుస పాయింట్లు	07
04	గేమ్ పాయింట్లు	03
124	మొత్తం పాయింట్లు	124
61	నెగ్గిన పాయింట్లు	63

మ్యాచ్ సమయం : 110 నిమిషాలు
ఫలితం : 19-21, 22-20, 20-22


రోహిత్ శర్మ (124 నాటౌట్)

శతకబాదిన రోహిత్

- 3-0తో వన్డే సిరీస్ భారత్ సొంతం
- బుమ్రా ఐదు వికెట్ల ప్రదర్శన
- అర్థ సెంచరీతో రాణించిన ధోని

నవతెలంగాణ-పల్లెకెలె

కోహ్లిసేనకు ఎదురులేదు. సిరీస్ విజయాల్లో తిరుగులేదు. శ్రీలంకపై హ్యాట్రిక్ వన్డే విజయం సాధించిన టీమ్ ఇండియా మరో రెండు మ్యాచులు ఉండగానే 3-0తో సిరీస్‌ను సొంతం చేసుకున్నది. పల్లెకెలెలో జరిగిన మూడో వన్డేలో భారత్ ఆరు వికెట్ల తేడాతో గెలుపొందింది. 218 పరుగుల స్వల్ప ఛేదనలో ఓపెనర్ రోహిత్ శర్మ (124 నాటౌట్, 145 బంతుల్లో 16 ఫోర్లు, 2 సిక్స్‌లు), మహేంద్రసింగ్ ధోని (67 నాటౌట్, 86 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) రాణించటంతో భారత్ మరో 4.5 ఓవర్లు ఉండగానే లక్ష్యాన్ని ఛేదించింది. కెప్టెన్ కోహ్లి (3), శిఖర్ ధావన్ (5), లోకేశ్ రాహుల్ (17)లు స్వల్ప స్కోరుకే పరిమితమయ్యారు. యువ పేసర్ జశ్‌ప్రీత్ బుమ్రా (5/27) ఐదు వికెట్ల విజృంభణతో తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక 217 పరుగులకే పరిమితమైంది. లహిరు తిరిమానె (80, 105 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) అర్థ సెంచరీతో రాణించాడు.


బుమ్రా (5/27)

ఈసారి రోహిత్‌తో కలిసి : పల్లెకెలెలోనే జరిగిన రెండో వన్డేలో టెయిలెండర్ భువనేశ్వర్ కుమార్‌తో కలిసి జట్టును విజయపథాన నడిపిన మహేంద్రసింగ్ ధోని.. మూడో వన్డేలో ఓపెనర్‌తో కలిసి ఆ పని పూర్తి చేశాడు. ఫామ్‌లో ఉన్న ఓపెనర్ శిఖర్ ధావన్ (5), కెప్టెన్ కోహ్లి (3)లు విఫలం కావటంతో 19/2తో భారత్ ఒత్తిడిలో పడింది. ఈ సమయంలో లోకేశ్ రాహుల్ (17)తో కలిసి రోహిత్ శర్మ (124) 42 పరుగులు జోడించాడు. కానీ మిస్టరీ స్పిన్నర్ ధనంజయ మరోసారి మాయ చేశాడు. రాహుల్, కేదార్ జాదవ్ (0)లను అవుట్ చేసి మ్యాచ్‌ను రసవత్తరంగా మార్చాడు. కానీ ఎం.ఎస్ ధోని (67)తో జట్టుకటిన రోహిత్ శర్మ ఐదో వికెట్‌కు అజేయంగా 157 పరుగుల భాగస్వామ్యం నమోదు చేశాడు. 14 ఫోర్లు, ఓ సిక్స్‌తో 118 బంతుల్లో శతకం సాధించిన రోహిత్ శర్మ.. శ్రీలంక గడ్డపై తొలి సెంచరీ బాదాడు. మరో ఎండ్‌లో ధోని నాల్గు ఫోర్లతో మరో అర్థ సెంచరీ ప్రదర్శన చేశాడు. వీరిద్దరి భాగస్వామ్యం వీడదీసేందుకు శ్రీలంక బౌలర్లు చెమటోడ్చినా ఫలితం లేకపోయింది.

ఐదేసిన బుమ్రా : టాస్ నెగ్గి తొలుత బ్యాటింగ్‌కు వచ్చిన శ్రీలంకకు బుమ్రా చుక్కలు చూపించాడు. ఓపెనర్ డిక్‌వెల్లా (13), కుశాల్ మెండిస్ (1), ధనంజయ (2), సిరివర్ధన (29) సహా అర్థ సెంచరీ హీరో లహిరు తిరిమానె (80)లను అవుట్ చేసి శ్రీలంకను స్వల్ప స్కోరుకే పరిమితం చేశాడు. దినేశ్ చండిమాల్ (36) రాణించినా.. బొటనవేలి గాయానికి గురై సిరీస్ నుంచి వైదొలిగాడు. కెప్టెన్ కపుగెదర (14), ఎంజెలో మాథ్యూస్ (11)లు సైతం స్వల్ప స్కోరుకే అవుటైన తరుణంలో మిడిల్ ఆర్డర్‌లో బాధ్యతాయుతంగా ఆడిన తిరిమానె.. అర్థ సెంచరీతో ఆదుకున్నాడు. జట్టుకు 217 పరుగుల పోరాడగలిగే స్కోరు అందించాడు.

210/7తో భారత్ గెలుపు ముంగిట నిలిచిన తరుణంలో శ్రీలంక అభిమానులు సహనం కోల్పోయారు. మైదానంలోకి వాటర్ బాటిల్స్ విసిరారు. బౌండరీ లైన్ వద్ద బాటిల్స్ పడటంతో మ్యాచ్‌కు అంతరాయం కలిగింది.

అనుభవం అంగట్లో సరుకు కాదు!


రవిశాస్త్రి, ధోని

టీమ్ ఇండియా చీఫ్ కోచ్ రవిశాస్త్రి సోషల్ మీడియాలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. శ్రీలంకతో రెండో వన్డేలో ఎనిమిదో వికెట్‌కు భువనేశ్వర్‌తో కలిసి అజేయంగా 100 పరుగులు జోడించిన ధోని.. జట్టును గట్టెక్కించాడు. 131/7తో ఓటమి కోరల్లో ఉన్న కోహ్లిసేనను గెలుపు పథాన నిలిపాడు. ఈ ప్రదర్శనను ఉటంకిస్తూ శాస్త్రి ట్విట్టర్‌లో కామెంట్ చేశాడు. ' మార్కెట్‌లో కొనలేని, మార్కెట్‌లోని అమ్మలేని అనుభవం అవసరం ఏంటో చెప్పేందుకు మరో గొప్ప ఉదాహరణ' అని ధోనితో ప్రాక్టీస్ సెషన్ ఫోటోను పోస్ట్ చేశాడు.

వారెవా వారియర్స్

ముంబయి: సుర్జీత్ సింగ్ సునామీ ప్రదర్శనలో బెంగళూరు బుల్స్ కొట్టుకుపోయింది. విదేశీ రైడర్ జంగ్ కున్‌లీ విజృంభణకి వీరేందర్ తోడవగా బుల్స్‌ని 32-26తో ఓడించింది వారియర్స్. అద్భుతమైన టాకిల్స్‌తో అదరగొట్టిన వారియర్ సుర్జీత్ విరామ సమయానికి 11-9తో జట్టును నిలిపాడు. ప్రథమార్ధంలో ఆరు టాకిల్ పాయింట్లు సుర్జీత్ ఒక్కడే సాధించడం విశేషం. ఇక రాహుల్‌కి ప్రత్యామ్నాయంగా వచ్చిన వీరేందర్ సైతం ఐదు రైడ్ పాయింట్లతో రాణించాడు. రోహిత్ కుమార్ ఏడు పాయింట్లు, కుల్దీప్ సింగ్ ఐదు టాకిల్స్‌తో బెంగళూరును ఆదుకునే ప్రయత్నం చేశారు. గుర్వీందర్ ఏడు పాయింట్ల ఆల్‌రౌండ్ ప్రదర్శన సైతం బుల్స్ ఓటమిని ఆపలేకపోయింది. మరో మ్యాచ్‌లో యు ముంబా పై 33-32తో దబంగ్ ఢిల్లీ అనూహ్యంగా గెలుపొందింది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.